స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక

సంపాదకుడు : కె.బి.జి. తిలక్

ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు: ట్రంప్

అమెరికా-ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తక్షణ సైనిక దాడుల విషయంలో తాత్కాలికంగా వెనక్కి తగ్గుతున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. అయితే, ఈ వివాదాన్ని దౌత్యపరమైన ఒప్పందం ద్వారా పరిష్కరించాలా? లేక సైనిక చర్యతో ముగింపు పలకాలా? అనే అంశంపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి కొంతమేర తొలగినప్పటికీ, అటు దౌత్యపరమైన, ఇటు సైనికపరమైన అవకాశాలు రెండూ అందుబాటులోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది.ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు నిలిచిపోయినప్పటికీ, ఖతార్, పాకిస్తాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వంతో దౌత్యపరమైన సంప్రదింపులు సాగుతున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, అమెరికా విధించిన షరతులను ఇరాన్ తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఖతార్, పాకిస్తాన్ ప్రతినిధులు ఇరాన్‌లో పర్యటిస్తున్నారు.

నర్మదఒడ్డున వేలాదిఓటరు కార్డులు విచారణకు విపక్షం డిమాండ్

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది ఒడ్డున వేలాది ఓటరు ఐడీ కార్డులు పడి ఉండటం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఖర్గోన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మండలేశ్వర్‌లో నిస్వార్థ్ సేవా సమితి సభ్యులు ఒక ఘాట్‌ను శుభ్రం చేస్తుండగా అక్కడ వేలాది ఓటరు ఐడీ కార్డులు ఉండటాన్ని గమనించారు. వెంటనే వారు అధికారులకు ఫిర్యాదు చేశారు.లభ్యమైన ఈ కార్డుల్లో చాలావరకు ఇండోర్ లోని రావు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవి. అన్ని కార్డులు అక్కడ ఎందుకు, ఎవరు పడేశారో తెలియరాలేదు. పోలీసులు, అధికారులు ఘటనా స్థలికి చేరుకుని ఓటరు ఐడీ కార్డులను సేకరించారు. కార్డులు దొరికిన విషయాన్ని మహేశ్వర్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ నిర్ధారించారు. దీనిపై విచారణకు ఒక తహశీల్దార్‌ను నియమించినట్టు చెప్పారు.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 185 విజయవాడ 27 అక్టోబర్ 2026 మంగళవారం 9 పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com

గవర్నర్ వెజిటేరియన్.. రాజ్ భవన్ లో శాఖాహారం.. కేరళలో ముదిరిన వివాదం



కేరళ రాజ్‌భవన్‌లో ఇకపై చికెన్, మటన్‌లకు నో-ఎంట్రీ.. ఆరు రుచుల కలియేపాకు, సాంబార్ల వడాపుడి మొదలైన వేళ... కొత్త గవర్నర్ గారు పీఠమెక్కగానే వంటగదిపై 'శాకాహార ఆంక్షల' జెండా ఎగరేశారు. కోడి కూరకు బదులు క్యారట్ ముక్కలే రాజ్యమేలుతుంటే 'అయ్యా... మా కడుపుల మీద కొట్టకండి, మా ప్లేట్లపై రాజ్యాంగ దాడి జరుగుతోంది' అంటూ కాంగ్రెస్, సీపీఎం నేతలు లబోదిబోమంటున్నారు. ఇంతకీ అక్కడ మారింది రాజ్‌భవన్ మెనూ మాత్రమేనా... లేక కేరళ రాజకీయాల రంగు కూడానా?" అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గవర్నర్ ఆహార అలవాట్లపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. వ్యక్తిగత ఎంపికను వ్యవస్థపై రుద్దుతున్నారంటూ కాంగ్రెస్, సీపీఎం నేతలు తీవ్రంగా విమర్శిస్తుండగా... అధికారులు ఈ వ్యవహారంపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. కేరళ రాజకీయాల్లో ఇప్పుడు ఆహార సంస్కృతి కేంద్రబిందువుగా మారింది. నూతన గవర్నర్ ఓం ప్రకాశ్ మాథుర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో లోక్‌భవన్‌లో శాకాహార నిబంధనలు అమల్లోకి వచ్చాయన్న వార్త తీవ్ర వివాదానికి దారితీసింది. గవర్నర్ వ్యక్తిగత ఆహార అలవాట్లకు సంబంధించిన ఈ అంశం క్రమంగా వ్యక్తిగత స్వేచ్ఛ, ఆహార సంస్కృతి, రాజ్యాంగ విలువలపై చర్చగా రూపాంతరం చెందింది. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి తన ఆహార ప్రాధాన్యతలను అధికారిక వ్యవస్థలో ఎంతవరకు అమలు చేయవచ్చనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. రాజ్ భవన్‌లో మాంసాహారాన్ని అనుమతించడం లేదని, అక్కడ కేవలం శాకాహార వంటకాలనే సిద్ధం చేయాలని గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లినట్లు వార్తలు రావడంతో కేరళ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. విభిన్న మతాలు, సంస్కృతులు, వైవిధ్యభరితమైన ఆహార అలవాట్లకు నిలయమైన కేరళ సమాజంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. శాకాహారం లేదా మాంసాహారం తీసుకోవడం అనేది ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశం. గవర్నర్ తన వ్యక్తిగత అవసరాల కోసం ప్రత్యేకంగా శాకాహారాన్ని ఏర్పాటు చేసుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేకపోయినా.. అదే నిబంధనను మొత్తం కార్యాలయానికి లేదా సిబ్బందికి వర్తింపజేస్తే ప్రశ్నలు తలెత్తడం సహజం. ఈ వ్యవహారంపై కాంగ్రెస్, సీపీఎం నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఈ నిర్ణయాన్ని వ్యక్తిగత స్వేచ్ఛ, ఆహార ఎంపికలపై ప్రభావం చూపే చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి తన వ్యక్తిగత అలవాట్లను అధికార యంత్రాంగంపై బలవంతంగా రుద్దడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏ ఒక్కరి వ్యక్తిగత నమ్మకాలకు లేదా జీవనశైలికి ప్రతిరూపాలుగా మారకూడదని... భిన్నమైన ఆహార అలవాట్లు ఉన్న ఉద్యోగుల స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ఉందని కమ్యూనిస్టు నేతలు కూడా అభిప్రాయపడ్డారు. వివాదం తీవ్రం కావడంతో రాజ్ భవన్ అధికారులు స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సిబ్బంది ఆహారంపై ఎలాంటి నిషేధం లేదని.. ఉద్యోగులు తమకు నచ్చిన ఆహారాన్ని తీసుకురావడానికి లేదా తినడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని వెల్లడించారు. గవర్నర్ వ్యక్తిగత సేవలకు, ఆయన ప్రత్యేక వంటగదికి మాత్రమే శాకాహార నిబంధనలు పరిమితమని అధికారులు వివరణ ఇచ్చారు. గతంలో పనిచేసిన గవర్నర్లు ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, రాజేంద్ర ఆర్లేకర్ కాలంలో మాంసాహార వంటకాలు సిద్ధం చేసేవారన్న వార్తల నేపథ్యంలో ప్రస్తుతం ఈ వివరణ ఇచ్చినప్పటికీ ఆదేశాల పరిధిపై చర్చ కొనసాగుతూనే ఉంది. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న సీనియర్ నాయకుడిగా ఓం ప్రకాశ్ మాథుర్‌కు గుర్తింపు ఉండటంతో కొందరు ఈ నిర్ణయానికి రాజకీయ రంగు పులుముతున్నారు. మరోవైపు టీజేపీ నాయకులు గవర్నర్ వ్యక్తిగత ఆహార ప్రాధాన్యతలను సమర్థిస్తున్నారు. ప్రజా సంస్థల్లో వైవిధ్యాన్ని గౌరవించడం ఎంత ముఖ్యమో.. వ్యక్తుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించడం కూడా అంతే ముఖ్యం. గవర్నర్ తన వ్యక్తిగత ఆహార స్వేచ్ఛకు గౌరవం ఇస్తూనే సిబ్బంది వ్యక్తిగత ఎంపికలను కూడా కాపాడగలిగితే ఈ వివాదానికి పరిష్కారం లభిస్తుంది.

సామాన్యుడిపై మరో భారం.. భారీగా పెరుగనున్న సబ్బులు, నూనెల ధరలు.. ఎఫ్ఎంసీజీ కంపెనీల సంచలన నిర్ణయం



ఇప్పటికే బియ్యం, పప్పులు, ఎల్పీజీ గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలపై మరో భారం పడనుంది. త్వరలోనే రోజువారీ వినియోగ ఉత్పత్తులైన సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, వంటనూనెలు, చాక్లెట్ల ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సరుకుల సరఫరా, ఉత్పత్తి వ్యయం పెరగడంతో ఈ నిత్యావసర వస్తువుల ధరలను పెంచేందుకు వలు ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 113 డాలర్లకు చేరడంతో ఉత్పత్తుల తయారీ, రవాణా వ్యయాలు గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు ముడిసరుకుల ధరలు 74 శాతం వరకు పెరగడం, తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంట దిగుబడులు తగ్గడం వ్యాపారాల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపాయి. క్రైసిల్, ఎలరా క్యాపిటల్, కొటక్ నియో వంటి ఆర్థిక విశ్లేషణ సంస్థలు కంపెనీల ఉత్పత్తి వ్యయాలు పెరిగినందున ఈ భారాలు వినియోగదారులపై పడక తప్పదని స్పష్టం చేశాయి.

పెరగనున్న మొబైల్ రీఛార్జ్ ధర్జీలు.. టెలికాం రంగంలోనూ పెంపు అంచనా:
కేవలం ఎఫ్ఎంసీజీ వస్తువులే కాకుండా టెలికాం రంగంలో కూడా ధరల పెంపు సూచనలు కనిపిస్తున్నాయి. అంబిట్ క్యాపిటల్ నివేదిక ప్రకారం, రాబోయే డిసెంబర్ నాటికి ప్రముఖ టెలికాం సంస్థలు మొబైల్ రీఛార్జ్, టెలిఫోన్ బిల్లులను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువులు, మరోవైపు రవాణా, కమ్యూనికేషన్ ఛార్జీలు ఒకేసారి పెరగనుండటం మధ్యతరగతి, పేద ప్రజల జేబులకు మరింత చిల్లు పెట్టనుంది.

బంగాళాఖాతంలో బీభత్సం.. దూసుకొస్తున్న తుపాను.. ఏపీకి భారీ వర్షాల ముప్పు



బంగాళాఖాతంలో బీభత్సం నెలకొంది.. తీవ్ర వాయుగుండం వేగంగా కదులుతూ తుపానుగా మారబోతోంది. రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర తుపానుగా మారనుంది. ఆ తర్వాత అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం :
ప్రస్తుతం ఈ వాయుగుండం విశాఖపట్నానికి సుమారు 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 1,010 కిలోమీటర్లు, బాపట్లకు 1,080 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. గత ఆరు గంటల్లో గంటకు 8 కిలోమీటర్ల వేగంతో కదిలిన ఈ వ్యవస్థ సోమవారం ఉదయానికి తుపానుగా మారవచ్చని అంచనా. ఎల్లుండి ఉదయానికి తీవ్ర తుపానుగా, బుధవారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడే సూచనలున్నాయి.

గంటకు 125 కి.మీ వేగం :
బుధవారం మధ్యాహ్నం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంది. దీంతో తీర ప్రాంతాల్లో అప్రమత్తత అవసరమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఈ జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చు :
మరోవైపు, తుపాను ప్రభావంతో ఏపీలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చు. మంగళవారం ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

మరికొన్ని జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురవవచ్చు.సహాయక చర్యల కోసం ఏడు జాతీయ విపత్తు స్పందన బృందాలు, 8 రాష్ట్ర విపత్తు స్పందన బృందాలను రంగంలోకి దిగనున్నాయి. తుపాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.ఏపీలో ప్రజలు మంగళ, బుధవారాల్లో అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదు.

పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలి. ఉప్పొంగే అలల దగ్గర సెల్ఫీలు తీసుకోవడం, పొంగిపొర్లే వాగులు దాటడం వంటి ప్రమాదకర పనులకు దూరంగా ఉండాలి. అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఆ ముగ్గురికి తోడు ..ఇప్పుడు మరో ఇద్దరు!

(వాసిరెడ్డి శ్రీనివాస్)

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. ప్రతి నెలా అప్పు చేస్తే తప్ప ప్రభుత్వం ముందుకు సాగలేని పరిస్థితి. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెప్పే సంపద సృష్టి అసలు జరుగుతుందో లేదో తెలియదు కానీ..కొంత మంది మంత్రుల సంపద మాత్రం అమాంతంగా పెరిగిపోతోంది అని ఐఏఎస్ అధికారులు చెపుతున్నారు. మరో వైపు చంద్రబాబు నాయుడు కూడా అప్పుల సృష్టిలో కొత్త కొత్త మార్గాలు వెతుకుతూ దూసుకెళుతున్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరో మంత్రి నారా లోకేష్ లు నిత్యం ప్రత్యేక విమానాల్లో ప్రయాణిస్తున్నారు అనే వార్తలు చాలానే వచ్చాయి. ముఖ్యమంత్రికి ప్రత్యేక విమానాల్లో తిరిగే మొలుబాటు ఉంటుంది.ూశ్రీంశ =ఘఒ – ఆరేడు శాఖల్లో అదే పరిస్థితి! కానీ ఈ సారి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి తనయుడు, మంత్రి నారా లోకేష్ కూడా విరివిగా స్పెషల్ ఫ్లైట్స్ వాడినట్లు చెపుతున్నారు.

అయితే ఈ విమాన ఖర్చులు ఎవరు భరించారు...ఇవి అధికారికమా...అనధికారికంగా అన్న విషయాలు మాత్రం బయటకు రావటం లేదు. వీళ్ళ ముగ్గురి సంగతి అటుంచితే గత కొంత కాలంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో కీలక శాఖలు చూస్తున్న మరో ఇద్దరు మంత్రులు కూడా తరచుగా ప్రత్యేక విమానాలు వాడుతున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇందులో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలోనే అవినీతిలో ఫస్ట్ ప్లేస్ లో ఉన్న మంత్రి ఒకరు అయితే...మరొకరు పవర్ ఫుల్ శాఖను చూస్తున్న మంత్రి. వీళ్ళు ఇద్దరు కూడా ఇప్పుడు స్పెషల్ ఫ్లైట్స్ రేంజ్ నుంచి ఏ మాత్రం దిగటం లేదు అని టీడీపీ వర్గాలు కూడా చెపుతున్నాయి. వారి వారి శాఖల్లో ఆ ఇద్దరు మంత్రుల అవినీతి కూడా కొత్త పుంతలు తొక్కుతుంది అనే ప్రచారం గత కొంత కాలంగా సాగుతోంది. ఏదైనా అత్యవసర సమయాల్లో ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసింది అంటే అర్థం చేసుకోవచ్చు..కానీ వీళ్ళు ఎక్కడికి వెళ్లినా కూడా ఇప్పుడు ప్రత్యేక విమానాలు వాడుతుండటం టీడీపీ నేతల్లో కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో ప్రత్యేక విమానాలు వాడే వాళ్ళ సంఖ్య మూడు ఉంటే ఇప్పుడు అది ఐదుకు పెరిగింది అని అధికారులు చెపుతున్నారు. అవినీతి సొమ్ము ఎంత భారీ మొత్తంలో పోగుపడుతుంటే వీళ్ళు ఇలా ప్రత్యేక విమానాల్లో ప్రయాణించగలరు అనే చర్చ కూడా సాగుతోంది.



రూ.600 కోట్లతో నా కుటుంబాన్ని అంతం చేసేందుకు కుట్ర.. సీఎం శివకుమార్‌పై కుమారస్వామి సంచలన ఆరోపణలు



కర్ణాటక రాజకీయాల్లో కేంద్ర మంత్రి, జేడీ(ఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామి చేసిన ఆరోపణలు తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రూ.600 కోట్ల డీల్ కుదుర్చుకున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్ కేసులో తనను, తన పార్టీని ఇరికించేందుకు సీఎం శివకుమార్, హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే కుట్ర పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు.హసన్ జిల్లాలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో పూజలు జరిపిన అనంతరం కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. "మా కుటుంబాన్ని రాజకీయంగా అంతం చేయాలని ఆదేశాలు ఇచ్చింది ప్రస్తుత ముఖ్యమంత్రే. దీనికోసం ఆయన ఎన్నో కుట్రలు పన్నారు. అందులో భాగమే ఈ రూ.600 కోట్ల సుపారీ డీల్. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్‌లో తమకు ఎలాంటి సంబంధం లేదని నిందితులే స్పష్టంగా చెప్పినప్పటికీ, దర్యాప్తును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తనవైపు మళ్లిస్తోందని కుమారస్వామి ఆరోపించారు. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్సీ) రిక్రూట్‌మెంట్ స్కామ్‌ను కప్పిపుచ్చుకోవడానికే ఈ కేసును వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. స్టింగ్ ఆపరేషన్ దర్యాప్తు 80 శాతం పూర్తయిందని హోంమంత్రి చెప్పడంపై స్పందిస్తూ.. "స్టింగ్ దర్యాప్తు 80 శాతం పూర్తయితే, కేపీఎస్సీ స్కామ్ కప్పిపుచ్చడం 90 శాతం పూర్తయింది" అని ఎద్దేవా చేశారు.ఈ స్టింగ్ ఆపరేషన్ వెనుక జర్నలిస్ట్ రాకేశ్ శెట్టి, కాంగ్రెస్ నాయకురాలు కృపా ఆల్వ ఉన్నారని సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర స్వయంగా చెప్పారని కుమారస్వామి గుర్తుచేశారు. అయినా, శివకుమార్, ఖర్గే ఆ కేసును తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్ర ఎంతలా ఉందంటే, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్యకే దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.వాస్తవానికి 2023లో జరిగిన ఈ స్టింగ్ ఆపరేషన్ వెనుక కాంగ్రెస్ అంతర్గత కుట్ర ఉందని కుమారస్వామి అనుమానం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకే ఈ స్టింగ్ ఆపరేషన్‌ను ఒక సాధనంగా వాడుకున్నారని, ఈ విషయం శివకుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలకు ముందే తెలుసని ఆరోపించారు. ఈ కుట్రను ఎదుర్కొనే శక్తి తమకుందని, దీన్ని ఇంతటితో పదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుమారస్వామి చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

Scanned with OKEN Scanner

ఆర్వో సెంటర్లలో సీసీ ఫుటేజీని భద్రపరచాలి : మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్

వెన్నుపోటు పార్టీ నేతల కనుసన్నల్లో ఆర్వోలు, అధికారులు... నీతులు, సూక్తులు చెప్పడంలో చంద్రబాబు ప్రవచనకర్తలను మించిపోయారు... వారసుడి రాజకీయ చట్రంలో ఇరుక్కుని దురాగతాలు... అనంతపురం, కడప, పల్నాడు జిల్లాలో దౌర్జన్యాలకు ఎవరు బాధ్యత వహిస్తారు...ఫేక్ నామినేషన్లు, దౌర్జన్యాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి: సాకే శైలజానాథ్



అనంతపురం:రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించకుండా కుట్రలు, కుతంత్రాలతో ప్రహసనంగా మార్చిందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, మహిళా అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేయడం, నామినేషన్ పత్రాల విషయంలో అక్రమాలకు పాల్పడటం వంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన ఉదహరించారు. అనంతపురంలోని మైత్రీస్ సీపీ జిల్లా కార్యాలయంలో సాకే శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ల కార్యాలయాల్లోని సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్ చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద వెన్నుపోటు పార్టీ నేతలు, కూటమి నాయకులు, వారి అనుచరులు చెప్పినట్లు అధికారులు పని చేస్తున్న తీరుపై కూడా విచారణ జరగాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా ఎవరైనా వ్యవహరించి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నీతి సూక్తులు వల్లెవేయడంలో ప్రవచనకర్తలను మించిపోయారని ఎద్దేవా చేసారు. గతంలో జరిగిన స్థానిక ఎన్నికలను బహిష్కరించిన టీడీపీ నాయకత్వం, ఇప్పుడు ఏకగ్రీవాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎన్నికలను బహిష్కరించడం ద్వారా తమ పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను చంద్రబాబు నాయుడు నట్టేట ముంచారని ఆక్షేపించారు. అనేక ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసి గెలిచినప్పటికీ, పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కార్యకర్తలు నష్టపోయారని గుర్తు చేసారు. ప్రజలను, పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం తగదని మాజీ మంత్రి సాకే శైలజా నాథ్ హితవు పలికారు.

ఈ దురాగతాలకు ఏం సమాధానం చెబుతారు..:

మైత్రీస్ జిల్లాలోని చక్రాయపేటలో 11 నామినేషన్లకు సంబంధించి కూటమి నేతలులతో కుట్ర పూరితంగా ఫేక్ నామినేషన్లు వేయించలేదా..? దీనిని ఎలా సమర్థించుకుంటారు. పెండ్లిమర్రి ప్రాంతంలోనూ, ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఫేక్ నామినేషన్ల వెనుక వెన్నుపోటు పార్టీ నేతలున్నారన్న మైత్రీస్ సీపీ భార్యాదులను అధికారులు కనీసం పరిశీలన చేసారా..? ఒక పార్టీకి చెందిన వ్యక్తులు మరో పార్టీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసినట్లు తేలితే, అందుకు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియదా..? ఈ అరాచకాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. గుత్తి, గుంతకల్లు, పుట్టూరు, ఎల్లనూరు ప్రాంతాల్లో జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చగా నిలుస్తాయి. ఎల్లనూరు పోలీస్టేషన్ పరిధిలో ఒక ఎస్సీ మహిళా ఎంపీటీసీ అభ్యర్థి ఎదుర్కొన్న ఇబ్బందులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. సదరు మహిళా అభ్యర్థిని ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్టేషన్‌లోనే ఉద్దేశ్యపూర్వకంగా నిర్బంధం చేసి, నామినేషన్ గడువు ముగిసిన తర్వాత ఆమెను బయటకు పంపడంతో చివరకు పత్రాలు దాఖలు చేయలేకపోయారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. పోలీసుల పర్యవేక్షణలో ఉన్న అభ్యర్థిని నామినేషన్ దాఖలు చేయలేకపోవడానికి ఎవరు బాధ్యత వహిస్తారు..? ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పష్టమైన సమాధానం చెప్పాలి.

నామినేషన్ల తిరస్కరణలో పారదర్శకత ఏది?:

నామినేషన్ల పరిశీలనలో నిబంధనలను ఇష్టానుసారంగా అమలు చేస్తున్నారు. కొన్ని చోట్ల సరైన కారణాలు తెలియజేయకుండానే నామినేషన్లను తిరస్కరించారు. అభ్యర్థులు అడిగినప్పుడు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదు. బుక్కరాయసముద్రం ప్రాంతంలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లకు సంబంధించి జరిగిన పరిణామాల ఇందుకు నిదర్శనం. అర్హతలపై సందేహాలుంటే నిబంధనల ప్రకారం వ్యవహరించాలి తప్ప రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదు. నామినేషన్ పత్రాలు స్వీకరించిన తర్వాత వాటిలో కొన్ని పత్రాలు కనిపించకపోవడం, రసీదుల్లో వివరాలు ఉన్నప్పటికీ సంబంధిత పత్రాల విషయంలో సమస్యలు తలెత్తడం వంటి ఆరోపణలపై విచారణ జరగాలి.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న దాడులు, బెదిరింపులు, నామినేషన్ల తిరస్కరణలు, పత్రాల గల్లంతు, నకిలీ నామినేషన్ల అంశాలపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలి అవసరమైన చోట సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పునరుద్ధరించాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి మైత్రీస్సీపీ పోరాటం కొనసాగిస్తుంది. అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తాం. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు.

ఓటమి భయంతోనే తెరపైకి షర్మిల కుమార్తె వివాహ వివాదం...

ఎన్నికల ప్రక్రియపై విమర్శల రావడంతో బాబు ఫ్యామిలీ పాలిటిక్స్... సుప్రీంకోర్టు మొట్టికాయలకు సమాధానం చెప్పలేక అన్నాచెల్లెళ్ల ఆస్తి వ్యవహారాలతో అనవసర రాజకీయ రచ్చ... నామినేషన్లలో ఈసీ లెక్కలపై అనుమానులు కలుగుతున్నాయి... దరఖాస్తులు దాఖలు, ఉపసంహరణ వెనుక అంకెల గారడీ : ఎస్వీ మోహన్ రెడ్డి నిలదీత

కర్నూలు: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబు నాయుడు ప్రజల దృష్టిని మళ్లించేందుకే షర్మిల కుమార్తె వివాహ అంశం తెరపైకి తెచ్చారా? అని కర్నూలు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియపై విమర్శలు వస్తున్న సమయంలో, వైఎస్ షర్మిల కుమార్తె వివాహానికి సంబంధించిన కుటుంబ అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తావించడంపై ప్రజలందరికీ అనుమానాలు కలుగుతున్నాయని స్పష్టం చేశారు. కర్నూలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల వేళ దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం స్థానిక ఎన్నికలు జరుగుతున్న తీరుపై మొట్టికాయలు వేసిన తర్వాత ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, వాటిని పక్కనపెట్టి అన్నాచెల్లెళ్లకు అయిన జగన్, షర్మిల కుటుంబ వ్యవహారాలపై రాజకీయ రచ్చ చేసేలా వ్యవహరించడం తగదని ఆయన హితవు పలికారు. ఎన్నికల నిర్వహణలో ప్రతిపక్షం లేవనెత్తుతున్న అభ్యంతరాలు, నామినేషన్ల దాఖలుకు సంబంధించిన ఆరోపణలు, అభ్యర్థుల ఉపసంహరణలపై ఉన్న సందేహాలకు సమాధానం చెప్పకుండా, కుటుంబ వివాదాలను రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుట్ర దాగి ఉందని ఎస్వీ మోహన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేసారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత అభిప్రాయభేదాలు వారి కుటుంబానికి సంబంధించిన అంశాలని పేర్కొన్నారు. వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోనే స్థాయికి చంద్రబాబు దిగజారడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆస్తులు, ఇళ్లు, వివాహేల నిర్వహణ వంటి అంశాలపై వివాదాలు ఉంటే వాటిని సంబంధిత వ్యక్తులే పరిష్కరించుకోవాలని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి వాటిని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చుకోకూడదని సూచించారు.

నామినేషన్ల సంఖ్యలో వచ్చిన భారీ మార్పులపై అనుమానాలు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల సంఖ్యలో కనిపించిన భారీ మార్పులపై అనుమానాలు కలుగుతున్నాయి. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 409 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజుకు ఆ సంఖ్య 2,409కు, మూడో రోజుకు సుమారు 3,300కు చేరడం వెనుక అనేక ప్రశ్నలు వస్తున్నాయి. అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు కలిపి మొత్తం 57,626 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. నామినేషన్లు దాఖలు చేయడానికి ప్రతిపక్ష అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇంత భారీ సంఖ్యలో నామినేషన్లు ఎలా దాఖలయ్యాయో ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలి. ప్రతిపక్ష అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేశారా? వారిపై ఒత్తిళ్లు ఉన్నాయా? నామినేషన్ల ఉపసంహరణలు నిబంధనల ప్రకారం జరిగాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి.

ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలి

రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదు. ప్రజల తీర్పే అంతిమమని చంద్రబాబు నాయుడు గుర్తు పెట్టుకోవాలి. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవడం ప్రతి పార్టీ లక్ష్యంగా ఉండాలి. ప్రత్యర్థులను అడ్డుకోవడం ద్వారా సాధించే విజయాలకు ప్రజాస్వామ్యంలో నిజమైన విలువ ఉండదు. రాష్ట్ర ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘంపైనా ఉంది. ఎన్నికల్లో ఎవరు గెలిచారన్నది మాత్రమే కాకుండా, ఆ విజయం ఏ విధంగా సాధించామన్నది ముఖ్యం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పలేక, కుటుంబ వ్యవహారాలను రాజకీయ అంశాలుగా మార్చడం ఓటమి భయంతోనే అనే భావన కలుగుతోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించడం, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడం ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి ఉన్న అత్యంత కీలకమైన బాధ్యతలని ఎస్.వి. మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో నమ్మకానికి.. అమ్మకానికి మధ్య పోరాటం... చంద్రబాబుది "సేల్ వైజాగ్".. వైయస్ జగన్‌ది "సేవ్ వైజాగ్"

విశాఖ:స్థానిక సంస్థల ఎన్నికల్లో నమ్మకానికి.. అమ్మకానికి మధ్య పోరాటం జరుగుతోందని వైయస్ఆర్సీపీ నేతలు స్పష్టం చేశారు. విశాఖపట్నం భూములు, పర్యావరణం, ప్రజల హక్కులు, నగర భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో "సేవ్ వైజాగ్" నినాదంతో వైయస్ఆర్సీపీ ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. చంద్రబాబుది "సేల్ వైజాగ్" విధానమైతే, వైయస్ జగన్‌ది "సేవ్ వైజాగ్" సంకల్పమని వైయస్ఆర్సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైయస్ఆర్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కే.కే.రాజు పేర్కొన్నారు. విశాఖలోని వైయస్ఆర్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నేతలు, అనంతరం "సేవ్ వైజాగ్" పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విశాఖను కార్పొరేట్లకు అమ్మేస్తున్నారు: కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

రెండున్నరేళ్లలో విశాఖకు చంద్రబాబు చేసిందేమిటి? యోగా డేలు, సమ్మిట్లు, ఫోటోషూట్ల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి ఏది? పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా వేలాది ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఎకరం 99 పైసలకే విలువైన భూములిచ్చే విధానంతో విశాఖను 'సేల్ వైజాగ్'గా మార్చేశారు. తాగునీటి ఎద్దడి, మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. భోగాపురం విమానాశ్రయ పనులు, పోలవరం కాలువల ద్వారా వచ్చిన నీటి విషయంలో కూడా గతంలో జరిగిన పనులకు చంద్రబాబు తన ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. రుషికొండ పేరుతో పర్యావరణంపై మాట్లాడినవారే ఇప్పుడు విశాఖలో కొండలను తవ్వేస్తున్నారు.

నకిలీ నామినేషన్లతో ఎన్నికల వ్యవస్థను దెబ్బతీస్తున్నారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు అడ్డుకున్న వ్యవహారంపై కోర్టులు ప్రశ్నించడంతో వైయస్ఆర్సీపీ పేరుతో నకిలీ నామినేషన్లు వేయించే కుట్రకు



కూటమి నేతలు తెరతీశారు. టీడీపీ కండువాలతో వచ్చి వైయస్ఆర్సీపీ తరఫున నామినేషన్లు వేసి, తర్వాత ఉపసంహరించుకోవడం ద్వారా ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. నామినేషన్ల అడ్డంకులు, నాయకుల గృహ నిర్బంధాలు, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం ప్రజాస్వామ్యానికి విఘాతం. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది. విశాఖ భూములు, పర్యావరణం, ప్రజల భవిష్యత్తును కాపాడేందుకే వైయస్ఆర్సీపీ 'సేవ్ వైజాగ్' పోరాటం. విశాఖ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణితో పాటు పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించి విశాఖను కాపాడుకోవాలి" అని కురసాల కన్నబాబు విశాఖ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విశాఖ భవిష్యత్తును "బ్లూ వైజాగ్" లక్ష్యం: గుడివాడ అమర్నాథ్

"విశాఖ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి నాయకత్వంలో 'బ్లూ వైజాగ్' నినాదంతో బీచ్‌ల అభివృద్ధి, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పరిశుభ్రం, ప్రజారోగ్యం, తాగునీరు, రహదారులు, పార్కులు, క్రీడా సముదాయాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తాం. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ప్రతిపాదించిన లక్ష కోట్ల రూపాయల 'విజన్ విశాఖ' ప్రణాళికను మా స్థానిక మేనిఫెస్టోకు ప్రాతిపదికగా తీసుకుంటాం. విశాఖను భూముల అమ్మకాలకు కేంద్రంగా మార్చే కూటమి విధానానికి వ్యతిరేకంగా 'సేవ్ వైజాగ్' నినాదంతో పోరాడతాం. పెన్షన్లు, రేషన్ కార్డులు తొలగిస్తామంటూ బెదిరించినా వైయస్ఆర్సీపీ శ్రేణులు వెనక్కి తగ్గవు. జగన్ విశ్వసనీయతకు, చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో వరుదు కళ్యాణితో పాటు వైయస్ఆర్సీపీ అభ్యర్థులందరినీ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలి."

విశాఖలో భూముల కోసమే కూటమి తాపత్రయం: కేకే రాజు

"విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి, అధికార దర్పానికి మధ్య పోటీ జరుగుతోంది. గీతం యూనివర్సిటీకి చెందిన రూ.5,000 కోట్ల విలువైన 55 ఎకరాల భూముల వ్యవహారంలో గతంలో వైయస్ఆర్సీపీ మేయర్‌ను దించేందుకు ప్రయత్నించిన కూటమి నాయకులు, ఇప్పుడు తమ ప్రయోజనాల కోసం వందల కోట్ల ధన ప్రవాహంతో పాటు వైయస్ఆర్సీపీ అభ్యర్థులను బెదిరిస్తున్నారు. వ్యాపారాలు చేసుకోనివ్వమని, ఉపసంహరించుకుంటే ఆర్థిక సహాయం చేస్తామని కార్పొరేటర్ అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. విశాఖ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ, తాగునీటి సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వం నగర భూములను మాత్రం కారుచౌకగా కట్టబెడుతోంది. ప్రజల పక్షాన పోరాడే వరుదు కళ్యాణిని మేయర్‌గా, వైయస్ఆర్సీపీ కార్పొరేటర్ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించి విశాఖ భవిష్యత్తును కాపాడాలి."

విశాఖ విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రజల తీర్పు కావాలి: వరుదు కళ్యాణి

"కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విశాఖను విధ్వంసం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా తీవ్ర తాగునీటి ఎద్దడి, సింహాద్రి అప్పన్న కొండపై పర్యావరణ విధ్వంసం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ముప్పు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పేదల బడ్జీలను, చిన్న ఇళ్లను తొలగిస్తున్న ప్రభుత్వం రూ.5,000 కోట్ల విలువైన భూముల వ్యవహారంపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ధరల నియంత్రణలోనూ ప్రభుత్వం విఫలమైంది. శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిగారి హయాంలో విశాఖను విశ్వనగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నన్ను మేయర్‌గా, అన్ని డివిజన్ల వైయస్ఆర్సీపీ అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించి ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలి" అని వరుదు కళ్యాణి ఓటర్లను అభ్యర్థించారు.

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు: కేటీఆర్

సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ...2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

రాహుల్ మౌనం వెనుక మర్మమదే

దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గాంజీ' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



2028లో కేసీఆరే మళ్లీ సీఎం

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేసారు.

6 నెలల్లో 23 మరణశిక్షలు.. జడ్జి బదిలీ



ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్, బరేలీలోని తన పోస్టింగ్‌ల కాలంలో మొత్తం 36 మరణశిక్షలు విధించిన జడ్జి రవికుమార్ దివాకర్‌ను ముజఫర్‌నగర్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నుంచి ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేశారు. తాజా ఉత్తర్వు ద్వారా ఆయనను కుటుంబ కోర్టు అదనపు ప్రిన్సిపల్ జడ్జిగా నియమించారు.హైప్రొఫైల్ క్రిమినల్ తీర్పులు, పెండింగ్ కేసుల ఉపసంహరణపై తలెత్తిన ప్రశ్నల నడుమ ఈ బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది. 'ది ఎకనమిక్ టైమ్స్' నివేదిక ప్రకారం ముజఫర్‌నగర్‌లో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఆయన 11 కేసుల్లో 23 మరణ శిక్షలు విధించారు. అంతకుముందు బరేలీలో కూడా ఆయన 13 మరణశిక్షలు ఖరారు చేశారు.

Scanned with OKEN Scanner

చంద్రబాబు బ్లాక్ మెయిలింగ్, ఉడత ఊపులకు బెదిరేది లేదు...ఫేక్ నామినేషన్లు, తిరస్కరణలపై న్యాయపోరాటం కొనసాగిస్తాం

ఎన్నికల పేరుతో రాష్ట్రం పరువు తీస్తున్న చంద్రబాబు...సుప్రీంకోర్టు ఆదేశాలూ బేఖాతర్ చేస్తూ దాడులు...సుప్రీం చీవాట్లు తప్పించుకునేందుకే ఫేక్ నామినేషన్లు...అంతా సక్రమంగా జరిగిందని చెప్పుకునేందుకు కుట్రలు...
ఎన్నికల్ని ప్రహసనంగామార్చేసిన చంద్రబాబు...వైఎస్సార్సీపీ పేరుమీదఎడాపెడాఫేక్ నామినేషన్లు...గెలుస్తారనుకునేఅభ్యర్థులనామినేషన్లతిరస్కరణ...అప్పీళ్లపైస్పందించకుండాఆర్డీవోలపైనాఒత్తిళ్లు : కాకాణి గోవర్ధన్ రెడ్డి



నెల్లూరు: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక, వెల్లువలా వస్తున్న ప్రజావ్యతిరేకతకు భయపడి స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు వరుసగా దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని, తాజాగా ఫేక్ నామినేషన్లు, నామినేషన్ల తిరస్కరణలు, ఆమోదించి నామినేషన్ల విత్ డ్రాకు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫైర్ అయ్యారు. చంద్రబాబు ఎన్ని అక్రమాలకు పాల్పడినా, జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన గుండె ధైర్యంతో వైఎస్సార్సీపీ అభ్యర్థులు వీరోచితంగా పోరాడుతున్నారని ఆయన కితాబిచ్చారు. చంద్రబాబు బ్లాక్ మెయిలింగ్ కూ, ఉడత ఊపులకూ బెదిరేది లేదని, ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు.

ఎన్నికల హింసతో రాష్ట్రం పరువు తీస్తున్న చంద్రబాబు

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై వైఎస్సార్సీపీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదులు చేయడం, పట్టించుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ తూతూమంత్రంగా నాలుగు చోట్ల మాత్రం నామినేషన్ల గడువు పొడిగించింది. ఆ తర్వాత రెండో ఘట్టంలో భాగంగా సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇవ్వడం, చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుబట్టడం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ దీని మీద సమీక్షించాలని ఇచ్చాక చంద్రబాబుకు ఏమాత్రమైనా నీతి నిజాయితీ ఉంటే రాజీనామా చేయాల్సింది. ఇంత అనుభవజ్ఞుడని చెప్పుకునే చంద్రబాబు.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అంటేనే ఏహ్యభావం కలిగేలా, రాష్ట్రం పరువుకు తీవ్ర నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తీరు కొనసాగిస్తే మళ్లీ సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టేలా ఉందని తెలిసి మరో కుట్రకు తెరలేపారు. ఈ ఎన్నికల్లో అయినా చంద్రబాబు సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని వ్యవహరిస్తాడని అనుకుంటే అదీ జరగడం లేదు. దీనికి బదులుగా టీడీపీ అభ్యర్థులతో నామినేషన్లు వేయించడం, వైఎస్సార్సీపీ అభ్యర్థుల్ని అడ్డుకోవడం, టీడీపీకి సంబంధించిన వ్యక్తుల చేతే వైఎస్సార్సీపీ నామినేషన్లు కూడా వేయిస్తున్నారు. రేపు ఒకవేళ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించినా, లేదు అంతా న్యాయబద్ధంగా జరిగింది, నామినేషన్లు సక్రమంగానే దాఖలయ్యాయని చెప్పుకునేందుకు కుట్ర మొదలుపెట్టారు.

ఇందులో భాగంగానే ఫేక్ నామినేషన్లను ఆధారాలతో సహా మేం బయటపెడుతున్నాం. వైఎస్సార్సీపీ తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని చెప్పుకోకుండా ఉండేందుకు, నామినేషన్లు వేసిన వ్యక్తులు పోటీలో పాల్గొనకుండా చేసి, వారంతా ఓటు అడగకుండా చేసి, ఏకగ్రీవంగా గెలిచినట్లు చూపించుకునేందుకే ఇదంతా చేస్తున్నారు.

ఫేక్ నామినేషన్లతో మరో కుట్రకు తెరలేపిన చంద్రబాబు

ఎన్ని విధాలుగా కుట్రలు, దొంగతనాలకు పాల్పడాలో అన్నీ తెలిసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన జీవితంలో ఎక్కడా నీతి, నిజాయితీ కనిపించవు. అందుకే ఫేక్ నామినేషన్లు వేయించి, దొంగ లెక్కలు, కాకి లెక్కలతో ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చేస్తున్నారు. మొదటిది దాడులు చేసి నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, రెండవది సుప్రీంకోర్టు తీర్పు తర్వాత నామినేషన్లు వేయలేదనే అంశాన్ని అధిగమించడానికి తన మనుషులతో దొంగనామినేషన్లు వేయించడం, మూడవది కొంత మంది ఎదురుతిరిగి నామినేషన్లు వేసిన వాళ్ల నామినేషన్లను తిరస్కరించడం. నెల్లూరు జిల్లాల్లోనూ ఇలాగే రిటర్నింగ్ అధికారులు ఏమాత్రం నీతీ నిజాయితీలు లేకుండా, అన్నీ విడిచిపెట్టి, అక్కడున్న టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల మాటల్ని వేదంలా భావించి, వారి స్వామి భక్తిని చాటుకున్నారు. ప్రజాస్వామ్య విలువలకూ, రాజ్యాంగ నిబంధనలకు పాతరేస్తూ ఆర్వోలు వ్యవహరిస్తున్నారు. ఏదో విధంగా బలమైన అభ్యర్థుల్ని, వైఎస్సార్సీపీ తరఫున గెలుస్తారని అనుకున్న వారి నామినేషన్లను తిరస్కరిస్తున్నారు. వెంటనే అప్పీలుకు వెళ్తారు కాబట్టి తిరస్కరణకు గురైన నామినేషన్లు ఆమోదించకుండా ఆర్డీవోలపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల ఆర్వోలు ఆమోదించిన నామినేషన్లను సైతం తిరస్కరించాలంటూ ఆర్డీవోలకు అప్పీల్లు పెడుతున్నారు. వృత్తి పేరు రాయలేదని ఒకరి నామినేషన్, పెళ్లి కాకపోయినా భార్య ఆస్తులు డిక్లేర్ చేయలేదంటూ మరో నామినేషన్ తిరస్కరించారు. పెళ్లే కాని వ్యక్తికి భార్య ఎక్కడి నుంచి వస్తుంది చంద్రబాబూ. మా లీగల్ టీమ్ వెళ్లి అభ్యంతరాలు చెప్పినా, మీరు చెప్పాల్సిన అవసరం లేదు, రాతపూర్వకంగా ఇచ్చి వెళ్లాలని ఆర్వోలు చెప్పేస్తున్నారు. నామినేషన్ తిరస్కరించినట్లు కొన్ని చోట్ల లేఖలు ఇచ్చారు, మరికొన్ని చోట్ల అది కూడా ఇవ్వడం లేదు. ఏ కారణంతో తిరస్కరించారో చెప్పాలని మా అభ్యర్థులు ఆర్వోల దగ్గర అప్పీలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకే అక్రమాలు

ఎన్నికలకు ముందే చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయలేని పరిస్థితుల్లో ఆయన ఉన్నారు. కాబట్టి ప్రజలు భగ్గు మంటున్నారు, ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భయం వారికి ఉంది. చంద్రబాబు ఇవాళ ఓటమిపాలైతే రేపు అధికారులు ఆయన మాట వినరు కాబట్టి, ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా ఏదో విధంగా గెలిచామనే సందేశం ఇస్తే తప్ప గట్టెక్కలేమనే అక్రమాలకు దిగుతున్నారు. గంజాయి బ్యాచ్ ను కూడా రంగంలోకి దింపి, వాళ్లను కొట్టండి, చంపండి కానీ వాళ్లు నామినేషన్ వేయడానికి లేదని చెప్తున్నారు. నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలో ఆర్వో.. ఇన్ కంప్లీట్ అని నామినేషన్ తిరస్కరించారు, మీడియా అడిగినా సమాధానం చెప్పలేదు. వైఎస్సార్సీపీ వేసిన నామినేషన్లను రెండో రోజు టీడీపీ ఆఫీసుకు తీసుకెళ్లి ఇచ్చి, వాటిలో తప్పులు వెతకమని చెప్పడం, వాళ్లు చెప్పిన తప్పుల ఆధారంగా వాటిని తిరస్కరిస్తున్నారు.

రేషన్ షాపు నడిపే వాళ్లు, వాటిని ఎప్పుడో తీసేసినా, గతంలో రేషన్ షాపు ఉంది కాబట్టి నామినేషన్ తిరస్కరించామని చెప్తున్నారు. అంగన్ టీచర్లు సైతం రాజీనామాలు చేసినా, ఇంకా పనిచేస్తున్నట్లుగానో, రికవరీలు ఉన్నాయని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేసిన వాళ్లను సైతం మీ మీద రికవరీ వచ్చిందని డీఆర్డీఏ నుంచి సమాచారం వచ్చిందని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. డ్వాక్రా మహిళలు లోన్లు తీసుకుంటే, ఏపీఎం దగ్గరో, సీసీ దగ్గరో కాయితం రాయించి ఈమె ఆ గ్రూపులో ఉంది, ఆ గ్రూపుకు సంబంధించిన లోను ఆమె చూపించలేదు అని చెప్పి నామినేషన్లు తిరస్కరిస్తున్నారు. దీన్ని బట్టి ఎన్నికలకు చంద్రబాబు ఎంత భయపడుతున్నాడో అర్థమవుతోంది. సాధారణ ఎన్నికల్లో ప్రజల ఓట్లతో గెలిచిన చంద్రబాబు.. అదే ప్రజల ఓటు హక్కు హరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు మర్చిపోరని గుర్తించాలి. రాష్ట్ర ప్రజలు కీలెరిగి వాతలు పెడతారని తెలుసుకోవాలి. ఎన్నికల్లో పోటీ చేసే సత్తా లేదు, శక్తి లేదు, దమ్మూ ధైర్యం లేదు, అటువంటప్పుడు నామినేట్ చేసుకుంటే సరిపోయేది తప్ప, ఎన్నికల్లో నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకుని, దొంగ నామినేషన్లు వేయించి, నామినేషన్లను తిరస్కరించి దాన్ని గెలుపుగా చెప్పుకుంటారా? ఆ గెలుపును గెలుపుగా ప్రజలు అనుకుంటారా, దాన్నే గెలుపుగా అనుకునే స్థాయికి చంద్రబాబు దిగజారిపోయారా చెప్పాలి.

చంద్రబాబు డైరెక్షన్, అధికారుల యాక్షన్

చంద్రబాబు డైరెక్షన్ ఆధారంగా ఆయన కింద ఉన్న డీజీపీ, డీఐజీలు, ఐజీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు వ్యవహరిస్తున్నారు. దాని ప్రకారం రిటర్నింగ్ అధికారి యాక్షన్ చేస్తున్నారు. ఫలితంగా మొత్తం ఎన్నికల ప్రక్రియనే ఓ ప్రహసనంగా మార్చేసి, అభ్యర్థులు పోటీ చేయకూడదు, ప్రజలు ఓటేయకూడదు, నేను చెప్పిన వ్యక్తే ఈరోజు ఎన్నిక కావాలనే దుర్మార్గమైన ఆలోచన కనిపిస్తోంది. ఎక్కడైనా ఆర్వోలు ఒకరిద్దరు గట్టిగా నిలబడి, తమ ఆత్మసాక్షి ప్రకారం నామినేషన్లు ఆమోదిస్తే, సదరు అభ్యర్థులకు ఫోన్లు చేసి కేసులు బనాయిస్తామని, కుటుంబ సభ్యుల్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు.

కొంతమంది గిరిజనుల్ని బెదిరించి పోలీసు స్టేషన్లో పెట్టడం, విత్ డ్రా ఫారాలు తీసుకొచ్చి సంతకాలు చేయండి, మీ మీద కేసు లేకుండా చేస్తామని చెప్తున్నారు. ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళ్లింది, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడికి పోయాయో తెలియట్లేదు. దళితుల్ని, గిరిజనుల్ని సైతం పోలీసు స్టేషన్లను తీసుకొచ్చి కేసులు పెడతామని బెదిరించి నామినేషన్లను విత్ డ్రా చేయిస్తున్నారు. చంద్రబాబు ప్రెస్ మీట్ పెట్టి చెప్పిన మాటలు ప్రజలకు అసహ్యం కలిగించేలా ఉన్నాయి. తన బురదను తిరిగి జగన్మోహన్ రెడ్డి గారికి పూసేందుకు ప్రయత్నిస్తున్నారు. నేను భ్రష్టుపట్టిపోయా, జగన్మోహన్ రెడ్డి గారి పాలనలోనూ ఇలాగే జరిగిందని చెప్పుకోవడం అంటే, నేను చేయలేకపోయాను, నా చేతుల్లో లేదు అని చెప్తున్నట్లా లేక మీ గెలుపును నేను భరించలేకపోతున్నాను కాబట్టి ఇదంతా చేస్తున్నా అని చెబుతున్నట్లా అర్థం కావట్లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో, ఆయన ఇచ్చిన పిలుపు మేరకు వైఎస్సార్సీపీ శ్రేణులు ప్రాణాలకు తెగించి రాష్ట్రంలో పోరాడారు. మీరు కత్తులు తెచ్చినా, కటార్లు తెచ్చినా, రాళ్లతో దాడులు చేసినా, దేనికైనా సిద్ధపడ్డారు తప్ప వెనకడుగు వేయలేదు. పోలీసులు కేసులు పెడుతున్నా, లాఠీచార్జ్ లు చేసినా, అవమానించినా, వైఎస్సార్సీపీ శ్రేణులు ముందుకు రావడం అభినందించాల్సిన విషయం.

చంద్రబాబు ఉడత ఊపులకు బెదిరేది లేదు

ఏ తప్పు చేయకుండానే పెళ్లకూరుకు సంబంధించిన నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గారెని రెండోసారి అక్రమంగా జైల్లో పెట్టారు. జైలు నుంచే నామినేషన్ వేసేందుకు ప్రయత్నిస్తే జైలు సూపరింటెండెంట్ సంతకం పెట్టకుండా ఆటంకాలు కల్పించారు. హైకోర్టుల తీర్పుల్ని ప్రస్తావిస్తే ... సంతకం పెట్టారు. గూడూరులో మరో నాయకుడు యద్దాల నరేందర్ రెడ్డి ఇంట్లోకి 25 మంది పోలీసులు గోడలు దూకి వెళ్లి సోదాలు చేశారు. ఆయన్ను అడ్డుతొలగించుకుంటే గూడూరులో సులువుగా ఎన్నికలు జరిగిపోతాయని ఇలా చేశారు. మరో సీనియర్ నాయకుడు భక్తవత్సల రెడ్డి మీద అక్రమంగా 307 కేసు పెట్టి గాలిస్తున్నారు. మరో నాయకుడు శ్రీనివాసులరెడ్డిని అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. మీరు నామినేషన్లు వేస్తే జైలుకు పోవడానికి సిద్ధంగా ఉండండి, అంతే తప్ప మీ నామినేషన్లు ఒప్పుకోం, ఒక వేళ నామినేషన్ వేసినా ఉపసంహరించుకుంటారా లేక జైలుకు పోతారా అని బెదిరిస్తున్నారు. దళితులు, వెనుక బడిన వర్గాలని, ముస్లింలని చూడకుండా వైఎస్సార్సీపీ అభ్యర్థుల్ని టార్గెట్ చేస్తున్నారు. చంద్రబాబు డైరెక్షన్ లోనే మొత్తం తతంగం జరుగుతోంది. ఎక్కడికక్కడ గంజాయి బ్యాచ్ లు, సంఘవిద్రోహక శక్తుల్ని రంగంలోకి దింపి మహిళల బట్టలు చింపేయడం, దాడులు చేస్తున్నారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడేందుకు కాదు, టీడీపీ, కూటమి పెద్దలు చెప్పినట్లు నడుచుకోవడానికే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులే దగ్గరుండి దాడులు చేయిస్తుంటే సామాన్యులకు ఈ వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లుతోంది. జగన్మోహన్ రెడ్డి గారు అధికారంలో ఉండగా చంద్రబాబు..ఈ ఎన్నికలు నా వల్ల కావని కాడి కింద పడేసి వెళ్లిపోయారు. కానీ ఇవాళ విపక్షంలో ఉండి జగన్మోహన్ రెడ్డి గారి పిలుపుకు స్పందించి నామినేషను వేసేందుకు ముందుకొచ్చి పోరాటం చేస్తుంటే, దాన్ని తట్టుకోలేకపోతున్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరికీ పోటీ చేసే, ఓటు వేసే హక్కు కల్పించాలని న్యాయపోరాటం చేస్తాం. మీ బ్లాక్ మెయిలింగ్ కు, ఉడత బెదిరింపులకు భయపడేది లేదు. జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన గుండె ధైర్యంతో వైఎస్సార్సీపీ శ్రేణులు పోరాడతాయి. వైఎస్సార్సీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉంది, వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించే అవకాశం ఉందన్న నిఘా నివేదికలతోనే ఎలాగైనా పరువు ప్రతిష్టలు కాపాడుకునేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రల్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్సీపీ తమ అభ్యర్థులతో పాటు ప్రజలకూ అండగా నిలుస్తుంది. అక్రమాలకు అండగా నిలిచిన పోలీసులపై ప్రైవేటు కేసులు వేయబోతున్నాం. వాటి ఆధారంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

పరాకాష్టకు చంద్రబాబు కుటిల రాజకీయాలు...కోర్టుల్ని, ప్రజల్ని మభ్యపెట్టేందుకే ఫేక్ నామినేషన్లు

చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదు...ఫేక్ నామినేషన్లతో ఎంతకాలం మభ్యపెడతారు...దాడులతో ఎన్నికలు గెలిచి ఏం సాధిస్తారు...ఎన్నికల్ని ఫార్సుగా మార్చేస్తున్న చంద్రబాబు...దీనికి బదులు ఆయనే నామినేట్ చేసుకోవాల్సింది...బరితెగింపు అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సిందే : రవీంద్రనాథ్ రెడ్డి

కడప: రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను భయపెట్టి గెలవాలని చంద్రబాబు చూస్తున్నారని, నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డగింతలు, దాడులు, దౌర్జన్యాలు, చివరికి ఫేక్ నామినేషన్లతో బరి తెగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. జగన్ కూడా ఇలాగే చేసి ఉంటే మీరు ఎక్కడ ఉండే వారని ఆయన చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల మాటలు విని దాడులకు, అక్రమాలకు సహకరిస్తున్న అధికారులు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని రవీంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు.

దుర్మార్గంగా స్థానిక ఎన్నికల తీరు :

చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత ఉందా అసలు ? ఆయన జీవిత చరమాంకంలో ఉన్నారు. గతంలో ప్రజలకు మంచి చేయకపోయినా, ఏ ప్రాంతానికీ మంచి చేయకపోయినా, ఏ కులానికి మంచి చేయకపోయినా, ఏ వ్యక్తికి మంచి చేయకపోయినా.. ఇప్పుడు చేస్తున్న పాలన అంతకన్నా దుర్మార్గంగా ఉంది. నీ రాజకీయమే వెన్నుపోటు నుంచి ప్రారంభమై క్లైమాక్స్ లో పరాకాష్టకు చేరిపోయింది. సుప్రీంకోర్టు, హైకోర్టులు మొట్టికాయలు వేసినా చంద్రబాబుకు బుద్ధి రావడం లేదు. యథేచ్ఛగా మీ గూండాలు రాయలసీమ జిల్లాలతో పాటు పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అయినా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అయినా నామినేషన్లు వేయనీయడం లేదు. అధికారులు ముందే సాగిలపడుతున్నారు. అధికారుల ముందే అంతా జరుగుతున్నా వాళ్లు పట్టించుకోలేదు. నామినేషన్ పత్రాలు చించేయడం, మహిళలను సైతం లెక్కచేయకుండా దాడులు చేయడం, ఎవర్నీ వీళ్లు వదలడం లేదు. నామినేషన్లు లేకుండా చేసే కార్యక్రమం చేస్తున్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం ? దీన్ని అసలు రాజకీయం అంటారా ? మేం అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి గారు కూడా ఇలాగే అనుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో తెలుసుకోండి. మంచి చేశాకే ప్రజల్ని ఓట్లడగాలని జగన్మోహన్ రెడ్డి గారు అనుకోవడం వల్లే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి. ఎక్కడ చూసినా 80-90 శాతం పైగా ఓటింగ్ జరిగింది, ఫలితాలు కూడా అలాగే వచ్చాయి. దీనంతటికీ కారణంగా జగన్మోహన్ రెడ్డి గారి సుపరిపాలనే. సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఈవీఎంల వల్లే ఓడిపోయాం కానీ, ఎన్నికలు పారదర్శకంగా జరిగి ఉంటే కచ్చితంగా మరోసారి జగన్మోహన్ రెడ్డి గారు మరోసారి ముఖ్యమంత్రి అయ్యేవారు.

ఫేక్ నామినేషన్లతో మభ్యపెట్టే యత్నం:

ఇప్పుడు వైఎస్సార్సీపీ అభ్యర్థులకు డూప్లికేట్లు తయారు చేసి టీడీపీ వాళ్లతో ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా నామినేషన్లు వేయిస్తున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించామని కోర్టుల్ని, ప్రజాస్వామ్యవాదుల్ని మభ్యపెట్టడానికే ఇదంతా చేస్తున్నారు. రామకుప్పం మండలం టీడీపీ నాయకుడు శంకరప్ప వైఎస్సార్సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు, అలాగే నీ సొంత నియోజకవర్గం కుప్పంలోని జీడిమాకుల పల్లె, సింగసముద్రం సెగ్మెంట్ లో తన భార్య పుష్పమ్మ పేరుతో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా దొంగ నామినేషన్ వేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. నామినేషన్ల మొదటిరోజు ఎంపీటీసీలకు సంబంధించి 5267 నామినేషన్లు వైఎస్సార్సీపీ వేస్తే.. రెండో రోజు కల్లా వాటిని 26,856కు పెంచేశారు. ఇదంతా కోర్టుల్ని మభ్యపెట్టడానికి, ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికే. మూడో రోజు కల్లా 25,016 ఎంపీటీసీ నామినేషన్లు వేశారు. జడ్పీటీసీలు కూడా తొలిరోజు వైఎస్సార్సీపీ పేరు మీద 409 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. రెండో రోజు 2409 నామినేషన్లు, మూడో రోజు 3515 నామినేషన్లు వైఎస్సార్సీపీ తరఫున ఫేక్ నామినేషన్లు వేశారు. వీళ్లంతా వైఎస్సార్సీపీ కాదని విత్ డ్రా తర్వాత, బీ ఫామ్ ఇచ్చాక ప్రజలకు తెలుస్తుంది. అంతవరకూ వీళ్లు ప్రజల్ని మభ్యపెట్టవచ్చు.

బరితెగింపు అధికారులు మూల్యం చెల్లించుకోవడం ఖాయం:

కడపలో 14 జడ్పీటీసీల్లో ఫేక్ నామినేషన్లు వేశారు. దాఖలైన 39 నామినేషన్లలో ఇప్పుడు ఆమోదించినవి చూస్తే 21 మాత్రమే. మిగతావన్నీ తిరస్కరించారు. 39 నామినేషన్లలో ఓ ఆరు నామినేషన్లు పోలీసుల్ని అడ్డుపెట్టుకుని వీళ్లు చేసిన దాష్టీకానికి బలైన వాళ్లే. నామినేషన్ కేంద్రాల లోపల మాత్రం వందల మంది వీళ్ల నాయకులే ఉంటారు. బయటి నుంచి మా వాళ్లు ఒక్కరిని కూడా రానివ్వరు. వేటిని తిరస్కరించాలి, వేటిని ఆమోదించాలన్నది పై నుంచి అన్నీ ఒత్తిళ్లే. స్థానిక సంస్థలకు జరిగేవి చిన్న ఎన్నికలే. ప్రజాస్వామ్యయుతంగా జరిగితే మంచి నాయకులు వచ్చి ప్రజలకు మేలు జరుగుతుంది. అలా కాకుండా మొత్తం ఎలక్షన్ ఫార్సుగా మార్చేస్తున్నారు. దీనికి బదులు మీరే నామినేట్ చేసుకుని ఉండాల్సింది. ఆంధ్రాలో వీళ్ల అరాచకాలు బీహార్ ను మించిపోయాయి. పోలీసులు, జిల్లా అధికారులను అడ్డుపెట్టుకుని వీళ్లు పులుల్లా తిరుగుతున్నారు. మా వాళ్లను వదిలితే తెలుస్తుంది ఎవరు పులులో. తిరిగి వైఎస్సార్సీపీ వాళ్లే దాడులు చేస్తున్నారని కోర్టుల్ని, ప్రజల్ని మభ్యపెడుతున్నారు. నామినేషన్ల తిరస్కరణకు గురైన వాళ్ల తరఫున అప్పీలుకు వెళ్తున్నాం. కలెక్టర్ గారు ఏం చేస్తారో



చూడాలి. ఐఏఎస్, ఐపీఎస్ లు పక్షపాతం లేకుండా అందరినీ సమానంగా చూస్తాం, అందరికీ మేలు చేస్తాం, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడతామని ప్రమాణం చేసి వస్తారు. కానీ అలాంటి వాళ్ల ముందే ఇవాళ బదిలీలు, సొంత పనుల కోసమో, డబ్బుల కోసమో ఇలా దిగజారిపోతున్నారు. ప్రజాప్రతినిధులు వస్తుంటారు, పోతుంటారు, కానీ అధికారులు శాశ్వతం. వాళ్లకు సుమారు 45 ఏళ్ల సర్వీసు ఉంటుంది. కానీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో వీళ్లు ఇలా బరితెగిస్తున్నారు. ఈ పనులకు వారు తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ అధికారంలోకి వస్తే సినిమా చూపించడం ఖాయం. ఇప్పటికైనా వీళ్లంతా తమ తీరు మార్చుకోవాలని రవీంద్రనాథ్ రెడ్డి హితవు పలికారు.

2031 ఎన్నికలే టార్గెట్.. ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై కోలీవుడ్ రచ్చ

తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్‌కు తిరుగులేదు. వెండితెరపై స్టార్‌డమ్‌ను ఓటు బ్యాంకుగా మార్చుకున్న నేతల చరిత్ర అక్కడ ఉంది. అదే బాటలో విజయ్ సొంత పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ప్పుడు ధనుష్ కూడా అదే ఫార్ములాను ఫాలో అవుతున్నారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. కోలీవుడ్‌లో హీరో ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై బజ్ పెరుగుతోంది. సినిమాల్లో బిజీగా ఉంటూనే.. అభిమాన సంఘాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ.. పొలిటికల్ ఎంట్రీకి గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారన్న చర్చ మొదలైంది. వారం క్రితం ఢిల్లీలో చర్చలు జరిపిన ధనుష్. లేటెస్ట్‌గా చెన్నైలో మహిళా అభిమాన సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. చోళింగనల్లూరులోని జేబీఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి 58 జిల్లాల నుంచి 2,500 మందికి పైగా మహిళా అభిమానులు హాజరయ్యారు. బ్యాక్ టు బ్యాక్ మీటింగ్స్‌తో భారీ సంఖ్యలో అభిమానులను సమీకరించడం.. జిల్లాలవారీగా సంఘాలను యాక్టివ్ చేయడం.. ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. త్వరలోనే ధనుష్ రాజకీయ ఆరంగేట్రం ఉంటుందన్న ప్రచారం ఊపందుకుంది. 2031 ఎన్నికలకు ఐదేళ్ల ముందే పొలిటికల్ స్కెచ్ వేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.విజయ్ రాజకీయాల్లోకి వచ్చేందుకు అభిమాన సంఘాలను పునాదిగా మార్చుకున్నారు. సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లి.. ఆ తర్వాత పార్టీ పెట్టి ఏకంగా ముఖ్యమంత్రి స్థాయికి చేరారు. ఇప్పుడు ధనుష్ కూడా అదే ఫార్ములాను ఫాలో అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ధనుష్ అభిమాన సంఘాలు సైతం సంక్షేమ కార్యక్రమాలపై ఫోకస్ పెట్టడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. ఐదేళ్ల ముందుగానే జిల్లాలవారీగా నెట్‌వర్క్‌ను బలోపేతం చేసి.. ఫ్యాన్ బేస్‌ను పొలిటికల్ బేస్‌గా మార్చుకునేందుకు స్కెచ్ వేస్తున్నారా అన్న చర్చ మొదలైంది. అయితే రాజకీయ ఆరంగేట్రంపై ధనుష్ మాత్రం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.ధనుష్



పొలిటికల్ ఎంట్రీ ఇంకా రూమర్ స్టేజ్‌లోనే ఉంది. కానీ పొలిటికల్ పంచ్‌లు మాత్రం అప్పుడే పడుతున్నాయి. ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై టీవీకే సంచలన వ్యాఖ్యలు చేసింది. ధనుష్ రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తామని, కానీ తమ అధినేత విజయ్‌లా ఫస్ట్ అటెంప్ట్‌లోనే సీఎం కావడం అసాధ్యమంటోంది. డీఎంకె సైతాన్ పోయిందని.. ఇప్పుడు పిల్ల సైతాన్లు వస్తున్నారంటూ సెటైర్లు వేశారు ఎఖ మంత్రి అధవ్ అర్జున్. ప్రస్తుతానికి ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై అభిమానుల హడావుడి తప్ప దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అధికారికంగా ధనుష్ ఎక్కడా రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పలేదు. మరి కేవలం ఊహాగానాలకే టీవీకే నుంచి ఆరేంజ్ రియాక్షన్ వచ్చిందంటే, రియల్‌గానే రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందోనన్న ఆసక్తికర చర్చ తమిళనాడు వ్యాప్తంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే మరో హీరో శివ కార్తికేయన్ కూడా పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారని తెలుస్తుంది.

చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్
రాత్రికి రాత్రి టీడీపీలో చేరిక



పల్నాడు జిల్లా చిలకలూరిపేట మున్సిపాలిటీ రాజకీయం ఒక్కసారిగా ఉత్కంఠకు దారితీసింది. స్థానిక ఎన్నికల సమరం ముగింపు దశకు చేరిన వేళ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అక్కడ ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీ తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న షేక్ కరీమున్. ఆదివారం రాత్రి పార్టీకి రాజీనామా చేశారు. ఆ వెంటనే భర్త యూసుఫ్ అలీతో కలిసి టీడీపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో అధికార తెలుగుదేశం పార్టీలో చేరారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గా పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి తోట రాజరాజేశ్వరికి ఆమె సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వారికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి పురపాలక చైర్‌పర్సన్ అభ్యర్థి తోట రాజరాజేశ్వరి, జనసేన నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తోట రాజారమేష్ ఇందులో పాల్గొన్నారు. టీడీపీ కండువా కప్పుకొన్న అనంతరం భర్త యూసుఫ్ అలీతో కలిసి షేక్ కరిమున్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నాయకత్వంలో చిలకలూరిపేట పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. పట్టణ ప్రగతిలో తాము కూడా భాగస్వామ్యం కావాలనే ఆలోచనతోనే వైఎస్ఆర్సీపీ వీడినట్లు వివరించారు. టీడీపీ కూటమి తరఫున తాము చురుగ్గా ప్రచారంలో పాల్గొంటామని, జనసేన అభ్యర్థి తోట రాజరాజేశ్వరి గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న తరుణంలో ఏకంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థే సొంత పార్టీని వీడి టీడీపీలో చేరడం వైఎస్ఆర్సీపీ శ్రేణులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసి తుది జాబితా వచ్చిన వెంటనే చోటుచేసుకున్న ఈ పరిణామంతో చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయావకాశాలు మరింత బలోపేతమయ్యాయని భావిస్తున్నారు. ఈ హఠాత్ చేరికతో పల్నాడు జిల్లా స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడ్డాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY K.B.G.TILAK, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA,
D.NO.28-1-22, II FLOOR, SHAIK MOHIUDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520 002. EDITOR : K.B.G.TILAK. PH : 0866 - 6620870. R.N.I.NO.APTEL/1999/1614

Scanned with OKEN Scanner

కాలం కలిసి వస్తే 2028లో నేనే సీఎం..

ఓపెన్ అయిపోయిన మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని ప్రకటించిన ఆయన.. భవిష్యత్తులో తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని, అది కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. దీంతో మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యల వెనుక రాజకీయ వ్యూహం ఏమిటనే అంశంపై చర్చ మొదలైంది. ఒకవైపు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన పూర్తి మద్దతు ప్రకటిస్తూనే.. మరోవైపు తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన సంకేతాలు ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధం..నియోజకవర్గంపై మాత్రం క్లారిటీ లేదు

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న మహేశ్ కుమార్ గౌడ్.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన రాజకీయ ప్రస్థానంపై కీలక ప్రకటన చేశారు. తాను నిజామాబాద్ జిల్లా నుంచి కచ్చితంగా పోటీ చేస్తానని వెల్లడించారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తనకు అనుకూలమైన నియోజకవర్గాన్ని నిర్ణయించుకుంటానని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర చర్చకు కారణమవుతున్నాయి. ఎందుకంటే పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్లు ఆశించే నాయకులు తమంతట తాముగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకోవద్దని గతంలో మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. టికెట్ల కేటాయింపు అనేది పార్టీ అంతర్గత ప్రక్రియ ప్రకారమే జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే ఇప్పుడు ఆయనే స్వయంగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

టికెట్ల కేటాయింపునకు పార్టీ విధానమే కీలకం

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు విషయంలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించే నాయకులు ముందుగా సంబంధిత జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిని కలవాలని సూచించారు. అభ్యర్థి విషయంలో డీసీసీ అధ్యక్షుడి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పార్టీ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో అభ్యర్థిత్వంపై చర్చ జరుగుతుందని వివరించారు. ఇటీవల పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖకు సంబంధించిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కూడా పీసీసీ అధ్యక్షుడు ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. నాయకులు ముందుగానే తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకోవడం సరైన పద్ధతి కాదని, పార్టీ నిర్ణయమే అంతిమమని చెప్పిన ఆయన.. ఇప్పుడు తన విషయంలో మాత్రం పోటీపై స్పష్టత ఇచ్చారు. నియోజకవర్గం ఎంపికను మాత్రమే భవిష్యత్తు పరిణామాలకు అనుగుణంగా నిర్ణయించుకుంటానని చెప్పడం గమనార్హం.

తెలంగాణకు బీసీ సీఎం.. కాంగ్రెస్‌తోనే సాధ్యమంటూ వ్యాఖ్యలు

మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యల్లో మరో కీలక అంశం బీసీ ముఖ్యమంత్రి ప్రస్తావన. తెలంగాణలో భవిష్యత్తులో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాంటి అవకాశం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ నాయకత్వంపై మరోసారి చర్చ మొదలైంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ ముఖ్యమంత్రి డిమాండ్‌కు ఆస్కారం లేదని చెబుతూనే.. భవిష్యత్తులో బీసీ నేతకు అత్యున్నత పదవి దక్కుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు తక్షణ నాయకత్వ మార్పు గురించి కాదని, భవిష్యత్తులో కాంగ్రెస్‌లో బీసీ నాయకత్వానికి అవకాశాలపై చేసిన ప్రకటనగా చూడాల్సి ఉంటుంది.

కేబినెట్‌లో బీసీలకు నాలుగైదు మంత్రి పదవులు ఇవ్వాలి

తెలంగాణ మంత్రివర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న తన డిమాండ్‌ను మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి పునరుద్ఘాటించారు. కేబినెట్‌లో బీసీ వర్గానికి చెందిన నాయకులకు నాలుగు నుంచి ఐదు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో బీసీలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన పరిణామంపై తాను బాధపడ్డానని కూడా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయం క్రమశిక్షణకు సంబంధించిన అంశాల నేపథ్యంలో ఏఐసీసీ తీసుకున్నదని సమర్థించారు. వ్యక్తిగతంగా బాధ ఉన్నప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనన్న సంకేతాన్ని ఇచ్చారు.

రేవంత్ రెడ్డితో విభేదాలు లేవు.. మరి భవిష్యత్తు వ్యూహం ఏమిటి?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరి మధ్య మంచి సమన్వయం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రస్తుతానికి రేవంత్ రెడ్డి నాయకత్వానికి తన మద్దతు కొనసాగుతుందని వెల్లడించారు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ప్రకటించడం, భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి అంశాన్ని ప్రస్తావించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మహేశ్ కుమార్ గౌడ్ కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు కావడంతో ఆయన వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. బీసీ నాయకత్వానికి భవిష్యత్తులో అవకాశం ఉంటుందని ఆయన చెప్పడం సహజంగానే రాజకీయ పరిశీలకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చకు తెరలేపాయి. ప్రస్తుత నాయకత్వానికి మద్దతు ఇస్తూనే తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వడం, బీసీ సీఎం అంశాన్ని ప్రస్తావించడం వెనుక ఎలాంటి వ్యూహం ఉందన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. వచ్చే ఎన్నికల్లో ఆయన ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారు? కాంగ్రెస్‌లో బీసీ నాయకత్వానికి ఎంత ప్రాధాన్యం లభిస్తుంది? అనే ప్రశ్నలకు పార్టీ భవిష్యత్తు నిర్ణయాలే సమాధానం చెప్పనున్నాయి.

సన్న బియ్యం సరఫరాలో మోసం..

14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసిన సీఐడీ

తెలంగాణలో ధరత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అరెస్ట్ చేసింది. 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 'సన్న రకం' బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో నాసిరకం 'దొడ్డు బియ్యాన్ని' అందజేసినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి.పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న అందజేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని, అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించగా, అవి నిర్దేశిత సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయ్యింది.నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న బియ్యానికి బదులుగా సుమారు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనివల్ల ప్రభుత్వానికి బోనస్ రూపంలో సుమారు రూ. 1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి బియ్యం సేకరణను నిలిపివేయడంతో సుమారు రూ. 242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని నివారించగలిగారు.ఈ ఉదంతంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. బియ్యం మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ జరుపుతున్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

మేనల్లుడి ఘనకార్యం ... మామ ఇంట్లో చోరీ చేసి 'థార్' కొన్నాడు

మామను పూజకు పిలిచి బుక్కయ్యాడు



సొంత మామ ఇంట్లోనే చేతివాటం ప్రదర్శించి, ఆ సొమ్ముతో ఖరీదైన కారు కొని, దాని ప్రారంభోత్సవానికి మళ్లీ ఆ మామనే ఆహ్వానించి అడ్డంగా దొరికిపోయాడో 19 ఏళ్ల యువకుడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన ఈ వింత ఘటన అందరినీ విస్మయానికి గురిచేసింది.కొల్హాపూర్‌కు చెందిన సమర్ చవాన్ (19) అనే యువకుడు, తన మామ ఉమేశ్ మారుతి చవాన్ ఇంట్లో నుంచి సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించాడు. వాటిని ఓ స్వర్ణకారుడికి విక్రయించి, వచ్చిన రూ.10 లక్షలతో తన కలల వాహనమైన మహీంద్రా థార్ ఎస్‌యూవీని కొనుగోలు చేశాడు. అంతటితో ఆగకుండా, కొత్త కారుకు పూజ చేయాలని నిర్ణయించుకుని, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తన మామ ఉమేశ్‌నే ఆహ్వానించాడు.మేనల్లుడు కొత్త కారు కొన్నాడన్న సంతోషంతో పూజకు సిద్ధమవుతున్న ఉమేశ్‌కు ఇంట్లో ఉహించని షాక్ తగిలింది. ఇంట్లో భద్రపరిచిన తన భార్య బంగారు ఆభరణాలు బీరువాలో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇది ఎవరో తెలిసిన వారి పనేనని అనుమానించిన వారు, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో, నిరుద్యోగి అయిన సమర్ చవాన్ ఉన్నట్టుండి అంత ఖరీదైన థార్ కారు ఎలా కొనగలిగాడనే దానిపై పోలీసులకు అనుమానం కలిగింది. అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, అసలు నిజాన్ని అంగీకరించాడు. మామ ఇంట్లో తానే బంగారం దొంగిలించినట్లు, ఆ డబ్బుతోనే కారు కొన్నట్లు ఒప్పుకున్నాడు.సమర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అతడిని, అతని నుంచి చోరీ సొత్తు కొనుగోలు చేసిన స్వర్ణకారుడిని అరెస్ట్ చేశారు. నేరానికి ఉపయోగించిన సొమ్ముతో కొన్న మహీంద్రా థార్ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.

చర్చిలో లైంగిక వేధింపులు.. బాధితులకు రూ.6,700 కోట్ల పరిహారం..

చర్చి చరిత్రలోనే అతిపెద్ద సెటిల్మెంట్



అమెరికా కాథలిక్ చర్చి చరిత్రలోనే అత్యంత సంచలనాత్మకమైన న్యాయపోరాటం ముగింపునకు వచ్చింది. చర్చి మతాధికారులు, సిబ్బంది చేతిలో తీవ్ర లైంగిక వేధింపులకు గురైన సుమారు 1,300 మంది బాధితులతో న్యూయార్క్ కాథలిక్ ఆర్చ్‌డయాసిస్ దాదాపు 800 మిలియన్ డాలర్ల (భారతీయ కరెన్సీలో రూ. 6,700 కోట్లకు పైగా) భారీ పరిహారం చెల్లించేందుకు చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది.

గత ఏడేళ్లుగా సాగుతున్న ఈ సంక్లిష్ట వివాదానికి తెరపడిందని బాధితుల తరఫు న్యాయవాదులు శనివారం అధికారికంగా ప్రకటించారు. ఆర్చ్‌బిషప్ రోనాల్డ్ హిక్స్ సైతం మతాధికారులకు పంపిన ఈ-మెయిల్‌లో ఈ సెటిల్మెంట్‌ను ధృవీకరించారు. నవంబర్ మొదటి వారంలో ఈ ఒప్పంద పత్రాలపై అధికారికంగా సంతకాలు జరగనున్నాయి.

నేరస్థుల పేర్లు బహిర్గతం చేయాలని షరతు..

ఈ చారిత్రాత్మక ఒప్పందంలో భాగంగా కేవలం ఆర్థిక పరిహారమే కాకుండా బాధితుల ప్రధాన డిమాండ్లకు ఆర్చ్‌డయాసిస్ తలొగ్గింది. వేధింపులకు పాల్పడిన నిందితుల సమాచారానికి సంబంధించిన పూర్తి పత్రాలను, వారి పేర్లను బహిరంగంగా వెబ్‌సైట్‌లో ప్రచురించేందుకు చర్చి యాజమాన్యం అంగీకరించింది.

2019లో న్యూయార్క్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక చట్టం ద్వారా కాలపరిమితితో సంబంధం లేకుండా పాత కేసులపై పిటిషన్లు వేసే వెసులుబాటు లభించడంతో బాధితులందరూ సంఘటితమై ఈ పోరాటం చేశారు.

ఈ నిర్ణయంతో చర్చిలో జవాబుదారీతనం పెరుగుతుందని, దివాలా ప్రక్రియలోకి వెళ్లకుండా ఆర్చ్‌డయాసిస్‌ను కాపాడుకోవడానికి కూడా ఇది దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

అమెరికా వ్యాప్తంగా చర్చిలపై వరుస కేసులు..

అమెరికా కాథలిక్ చర్చిల చరిత్రలో ఇది రెండవ అతిపెద్ద సెటిల్మెంట్‌గా నిలిచింది. దీనికి ముందు లాస్ ఏంజెల్స్ ఆర్చ్‌డయాసిస్ 1,000 మంది బాధితులకు 880 మిలియన్ డాలర్లు చెల్లించగా, ఈ ఏడాది జూన్‌లో శాన్ ఫ్రాన్సిస్కో ఆర్చ్‌డయాసిస్ కూడా 395 మిలియన్ డాలర్ల సెటిల్మెంట్ కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా దశాబ్దాల తరబడి సాగిన సంస్థాగత వైఫల్యాలు, మతాధికారుల లైంగిక వేధింపుల ఘటనలపై బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో కాథలిక్ చర్చిలు వేల కోట్ల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ పరిణామాలు చర్చిల ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా, బాధితులకు కొంతమేర మానసిక ప్రశాంతతను అందిస్తున్నాయని న్యాయవాదులు పేర్కొన్నారు.

ఓటు మీది.. పోరాటం మీదే... రాహుల్ పిలుపు... నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు, ఎంపీలు అక్టోబర్ 30 నుండి నవంబర్ 1 వరకు ఢిల్లీలోనే అందుబాటులో ఉండనున్నారు. దాదాపు 10 లక్షల మంది కార్యకర్తలు, మద్దతుదారులతో రామ్‌లీలా మైదానంలో ఈ నిరసన కార్యక్రమం జరగనుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఈ భారీ ప్రదర్శన దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలు చేపట్టింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా ఢిల్లీ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

కంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా బీజేపీ, దాని మిత్రపక్షాలపై తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. విపక్షాల కంటే ఎక్కువగా తమ నిరసన ర్యాలీకి అధికార పార్టీ నాయకులే పబ్లిసిటీ కల్పిస్తున్నారని, ఇంతటి ఉత్సాహంతో ప్రోత్సహిస్తున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడు రోజులు కూడా బీజేపీ ఇదే అంకితభావాన్ని కొనసాగించాలని చురకలంటించారు.

విద్యార్థులు, రైతులు, కార్మికులకు రాహుల్ పిలుపు:

దేశంలో ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీఛార్జ్ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్న పరిణామాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. "ఓటు మీది, పోరాటం కూడా మీదే" అని పిలుపునిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అందరూ ఢిల్లీకి తరలిరావాలని కోరారు.

10 లక్షల మందితో 'మహా ర్యాలీ'.. సెక్యూరిటీని కట్టుదిట్టం

మేకను దహనం చేసి ఏఐతో తన శవంగా నమ్మించి..

యూపీ కేటుగాడి 'డెత్ డ్రామా' గుట్టురట్టు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి ఓ హత్య కేసు నిందితుడు ఆడిన నాటకం పోలీసులను సైతం విస్తుపోయేలా చేసింది. తన మరణాన్ని తానే సృష్టించుకుని, కోర్టును సైతం బురిడీ కొట్టించి దాదాపు ఏడాదిన్నర పాటు సన్యాసి వేషంలో తప్పించుకు తిరిగిన నిందితుడిని ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. మౌ జిల్లాకు చెందిన రాజ్‌కుమార్ రాజ్‌భర్ అలియాస్ రాజు (38)ను ఆదివారం స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), కోత్వాలి నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. 2016లో జరిగిన యోగేష్ సింగ్ అనే వ్యక్తి హత్య కేసులో రాజ్‌కుమార్ నిందితుడిగా ఉన్నాడు. విచారణ ఎదుర్కొంటూనే బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు, కేసు నుంచి శాశ్వతంగా తప్పించుకునేందుకు 2025 మే నెలలో ఒక విచిత్రమైన కుట్ర పన్నాడు. ఘాజీపూర్‌లో ఒక మేకను చంపి, దానిని చితిపై ఉంచి దహనం చేశాడు. ఆ సమయంలో ఏఐ టెక్నాలజీ సాయంతో చితిపై ఉన్న మేక శరీరం స్థానంలో తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి ఫొటోలు సృష్టించాడు.చివరకు అంత్యక్రియల ఊరేగింపు, అంతిమ సంస్కారాల ఫొటోలను ఆధారాలుగా చూపి మౌ మున్సిపల్ కౌన్సిల్ నుంచి అధికారికంగా మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్) కూడా సంపాదించాడు. కుటుంబసభ్యులు 13వ రోజు తిథి కార్యక్రమం కూడా జరిపించారు. ఆ పత్రాలను కోర్టులో సమర్పించి నిందితుడు చనిపోయినట్లు నమోదు చేయించి కేసు నుంచి తప్పించుకున్నాడు.చనిపోయినట్లు నమ్మించిన అనంతరం నిందితుడు సన్యాసి అవతారం ఎత్తి వివిధ నగరాల్లో తిరిగాడు. హత్య కేసు నుంచే కాకుండా, స్టాక్ మార్కెట్ ట్రేడర్‌గా నమ్మించి పలువురి వద్ద పెట్టుబడుల పేరిట సేకరించిన భారీ మొత్తాన్ని ఎగవేసేందుకే ఈ దారుణ నాటకానికి తెరతీశాడని అదనపు పోలీసు సూపరింటెండెంట్ అనూప్ కుమార్ తెలిపారు.ఖ్వాజాజహాన్‌పూర్ ప్రాంతంలో నిందితుడు తిరుగుతున్నట్లు అందిన నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై ఫోర్జరీ, కోర్టును పక్కదారి పట్టించడం వంటి తీవ్రమైన కొత్త కేసులు నమోదు చేసి, పాత హత్య కేసు విచారణను పునఃప్రారంభించారు.

మెర్సిడెస్ కారుతో జడ్జి మైనర్ కొడుకు బీభత్సం

స్కూటరిస్ట్ మృతి.. కేసును నీరుగార్చే యత్నంపై ఆరోపణలు



కేరళలో ఓ న్యాయమూర్తి మైనర్ కుమారుడు నడిపిన మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కొచ్చిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నిందితుడు జడ్జి కుమారుడు కావడంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో పోలీసులు కేసులో నాన్-బెయిలబుల్ సెక్షన్లు జోడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కొచ్చిలోని చెరనల్లూరు కంట్రైనర్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది.

రోడ్డు పక్కన ఫుడ్ స్టాల్ (తట్టుకడ) నడుపుకునే జయబాలకృష్ణన్ (54) తన పనులు ముగించుకుని స్కూటర్‌పై ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో, త్రిస్సూర్‌కు చెందిన ఓ జడ్జి 17 ఏళ్ల కుమారుడు నడుపుతున్న మెర్సిడెస్ బెంజ్ కారు వెనుక నుంచి స్కూటర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటర్ నుజ్జునుజ్జుకాగా, జయబాలకృష్ణన్ అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా కారు నడపాలనిపించి బయటకు తెచ్చానని తెలిపాడు. అయితే, భారీ వర్షం కారణంగా నీటి మడుగును తప్పించేందుకు స్కూటరిస్ట్ అకస్మాత్తుగా పక్కకు తిరగడంతో తాను కారును అదుపు చేయలేకపోయానని బాలుడు పోలీసులకు వివరించాడు. ప్రాథమిక వైద్య పరీక్షల్లో బాలుడు మద్యం తాగలేదని తేలినా, శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అనంతరం పోలీసులు అతడికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు.అయితే, జడ్జి కుమారుడు కావడంతోనే పోలీసులు కేసును తేలికపాటి సెక్షన్ల కింద నమోదు చేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో తమను ప్రశ్నించినందుకు జడ్జి తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని, పీడకిలి బిగించి బెదిరించారని ఆరోపించారు. ప్రమాదానికి గురైన కారు ఫొటోలను తన ఫోన్ నుంచి పోలీసులు బలవంతంగా డిలీట్ చేయించారని మృతుడి సోదరుడు వాపోయాడు. ఈ వ్యవహారంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పోలీసులు స్పందించారు. తొలుత నమోదు చేసిన బెయిలబుల్ సెక్షన్లతో పాటు, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 105 (హత్యానేరం కిందకు రాని నేరపూరిత హత్య) అనే నాన్-బెయిలబుల్ సెక్షన్‌ను కూడా జోడించారు. దీంతో మైనర్‌ను తిరిగి అదుపులోకి తీసుకుని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచనున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కేరళ హోంమంత్రి రమేశ్ చెన్నితల హామీ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినందుకు కారు యజమాని అయిన జడ్జిపై కూడా మోటారు వాహన చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

Scanned with OKEN Scanner

నయనతార 60 అడుగుల కటౌట్.. కానీ సినిమాపై బజ్ ఏది?



నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2' సినిమా విడుదలకు ముందే చెన్నైలో భారీ కటౌట్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చెంబరంబాక్కంలోని వేల్స్ థియేటర్స్ వద్ద ఏర్పాటు చేసిన ఈ 60 అడుగుల కటౌట్.. భారతదేశంలో ఓ హీరోయిన్‌కు ఏర్పాటు చేసిన అత్యంత ఎత్తైన కటౌట్‌గా ప్రచారం పొందుతోంది. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 6, 2026న థియేటర్లలోకి రానుంది. తెలుగులో 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకే భారీ కటౌట్లు కనిపిస్తుంటాయి. ఇప్పుడు నయనతారకు కూడా అలాంటి క్రేజ్ కనిపించడం విశేషం. అయితే, కటౌట్‌తో వచ్చిన హడావుడి సినిమాపై అంచనాలుగా మారుతుందా అనేది చూడాలి. ఇప్పటివరకు సినిమాకు ఆశించిన స్థాయిలో బజ్ కనిపించడం లేదు. విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. మరోవైపు, సూర్య నటించిన 'సీక్', భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ' వంటి సినిమాల పోటీ కూడా 'మూకుత్తి అమ్మన్ 2'కు సవాలుగా మారే అవకాశం ఉంది. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, దునియా విజయ్, ఊర్వశి, అజయ్ ఘోష్, యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ కటౌట్‌తో వచ్చిన ఈ అటెన్షన్‌ను మేకర్స్ థియేటర్లకు ప్రేక్షకులను రప్పించే స్థాయికి తీసుకెళ్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

ఆరాధ్య బచ్చన్ హీరోయిన్ అవుతుందా?



చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ఆసక్తికరంగా చర్చించుకునే స్టార్ కిడ్స్‌లో ఆరాధ్య బచ్చన్ పేరు ఎప్పుడూ ముందుంటుంది. బిగ్ బీ అమితాబ్ బచ్చన్.. జయా బచ్చన్ మనవరాలుగా టాలీవుడ్, బాలీవుడ్‌లను ఏలిన ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ ల గారాల కుమార్తెగా ఆరాధ్య ప్రతి అడుగుపై సిని లోకం కన్నేసి ఉంచుతుంది. ప్రస్తుతం ఆరాధ్య వయసు 14 ఏళ్లు. మరో నాలుగేళ్లు గడిస్తే పూర్తిస్థాయి నటిగా వెండితెరకు పరిచయమయ్యే వయసు రానుంది. ఈ నేపథ్యంలో ఆరాధ్య భవిష్యత్తు అడుగులు ఏ రంగం వైపు పడతాయనేది హాట్ టాపిక్‌గా మారింది. తండ్రి, తల్లి, తాతయ్యల నుంచి అందిన అపారమైన నటన ..గ్లామర్ వారసత్వాన్ని ఆరాధ్య పుణికి పుచ్చుకోవడం తథ్యమని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు.

చిన్నప్పటి నుంచి ప్రతిష్టాత్మక వేడుకలు, అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో ఐశ్వర్య రాయ్‌తో కలిసి పాల్గొనడం వల్ల ఆరాధ్య కెమెరా ముందుకు రావడం కొత్తేమీ కాదు. అప్పుడే ఆమెలో ఓ స్టార్‌కి తగిన గ్రేస్, బాడీ లాంగ్వేజ్ కనిపిస్తున్నాయని అంటారంతా. బచ్చన్ కుటుంబం నుంచి నటనను కెరీర్‌గా ఎంచుకున్న మూడో తరం నటిగా ఆరాధ్య ఎంట్రీ ఉంటుందని ఆశిస్తున్నారు. అయితే నటన వైపే కాకుండా వ్యాపార రంగం లేదా ఇతర గ్లోబల్ ప్రొఫెషన్స్ వైపు కూడా ఆరాధ్య మొగ్గు చూపొచ్చు వాదన కూడా బలంగానే వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విద్యా సంస్థలలో చదువుకుంటున్న ఆరాధ్య, భవిష్యత్తులో కార్పొరేట్ ప్రపంచం లేదా ఎంటర్‌ప్రెన్యూరిషిప్ వైపు అడుగులు వేసే అవకాశాలను కొట్టేయలేం. ఐశ్వర్య రాయ్ కుమార్తె చదువుకు, వ్యక్తిగత ఎదుగుదలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాతే ఆరాధ్య కెరీర్ పై నిర్ణయం తీసుకోనున్నారు.బచ్చన్ కుటుంబంలో తాత అమితాబ్ బచ్చన్ నుంచి మొదలుకొని అభిషేక్, ఐశ్వర్య వరకు అందరూ విద్యాపరంగానూ, కళా రంగంలోనూ తమకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరాధ్య ఎటువైపు వెళ్లినా కుటుంబం నుంచి పూర్తి మద్దతు ఉంటుందనడంలో సందేహం లేదు. నటనను ఎంచుకుంటే ఏకంగా పాన్-ఇండియా .. గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో లాంచ్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అగ్రశ్రేణి నిర్మాణ సంస్థలు, ప్రముఖ దర్శకులు ఆరాధ్యను తెరకు పరిచయం చేయడానికి ఇప్పటి నుంచే ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు స్టార్ కిడ్స్ ఎదుర్కొనే పబ్లిక్ స్క్రూటినీ, ట్రోలింగ్ వంటి సవాళ్లను ఆరాధ్య చిన్న వయసు నుంచే బలంగా ఎదుర్కొంటూ వస్తోంది. తల్లిదండ్రులు ఆమెను ఈ ఒత్తిళ్ల నుంచి కాపాడుతూ సాధారణ బాల్యాన్ని అందించేందుకు శ్రమిస్తున్నారు. ఈ మానసిక పరిపక్వత భవిష్యత్తులో ఆరాధ్య ఏ రంగంలోనైనా రాణించడానికి ప్రధాన బలంగా మారుతుందని చెప్పొచ్చు. గ్లామర్ ప్రపంచం కాంతి పుంజాలు ఆమెను ఆకర్షిస్తున్నా? ఆరాధ్య సొంత అభిరుచులే అంతిమంగా నిర్ణయించే అవకాశం ఉంది.

అప్పుడు వేశ్య, ఇప్పుడు దేవిక... ఈమె చాలా స్పెషల్



సెన్సార్ బోర్డ్ సభ్యులను సైతం భయపెట్టిందని, హర్రర్ సీన్స్‌కి సెన్సార్ పడిందంటూ ప్రచారం జరగడంతో '418' సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ వారు కన్నడంలో నిర్మించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలకు ముందు చాలా ఇబ్బందులు ఎదుర్కొని, ఈ మధ్య కాలంలో ఇలాంటి మంచి హర్రర్ మూవీ రాలేదు అనే విధంగా స్పందన దక్కించుకుంది. ఈమధ్య కాలంలో హర్రర్ సినిమా అనగానే కామెడీ గుర్తుకు వస్తుంది. హర్రర్ మాత్రమే ఉన్న సినిమాలు చాలా తక్కువగా వస్తున్నాయి. చాలా కాలం తర్వాత పూర్తి స్థాయి హర్రర్ సినిమాగా 418 రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా సెకండ్ హాఫ్ కాస్త లో అవుతుంది అనిపించిన సమయంలో వచ్చిన దేవిక అనే పాత్ర మొత్తం సినిమా స్థాయిని పైకి లేపింది అంటూ రివ్యూస్ వచ్చాయి.

చైత్ర జే ఆచార్ హీరోయిన్‌గా 418 మూవీ...

ఈ సినిమాలోని అత్యంత కీలకమైన దేవిక పాత్రను కన్నడ ముద్దుగుమ్మ చైత్ర జే ఆచార్ చేసింది. ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. మొదటి సినిమా నుంచి ఇప్పటి వరకు ఈమె చాలా సినిమాల్లో నటించినా రెండు మూడు సినిమాలు మినహా ఈమెకు గుర్తింపు తెచ్చి పెట్టలేదు. సప్త సాగరాలు దాటి సినిమాలో వేశ్య పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. చాలా అందంగా కనిపించడంతో పాటు, వేశ్య బాడీ లాంగ్వేజ్‌ను సరిగ్గా మ్యాచ్ చేస్తూ యాక్టింగ్ చేయడం వల్ల ఆ సమయంలో ఈమె గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. ఆ సినిమా తెలుగులోనూ విడుదల అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దాంతో చైత్రకి ఇక్కడ కూడా గుర్తింపు లభించింది. అయితే లక్ కలిసి రాకపోవడంతో టాలీవుడ్ నుంచి ఈ అమ్మడికి ఆఫర్లు రాలేదు.

సప్త సాగరాలు దాటి సినిమాతో కన్నడంలో...

కన్నడంలోనే వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ సప్త సాగరాలు దాటి సినిమాలో చేసిన సురభి అనే వేశ్య పాత్ర స్థాయిలో గుర్తింపు రాలేదు. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించినప్పటికీ మెయిన్ హీరోయిన్ కంటే మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో లీడ్ రోల్ లో కనిపించినా పెద్దగా సత్తా చాట లేక పోయింది. ఆమెకు ప్రతిభ కనబర్చే పాత్రలు దక్కలేదు. మళ్లీ ఇన్నాళ్లకు 418 సినిమాలోని దేవిక పాత్రతో చైత్రకు తన పూర్తి ప్రతిభ చూపించే అవకాశం దక్కింది. సినిమాలోని ఆ పాత్ర ప్రాధాన్యత, ఆ పాత్రకు తగ్గట్లుగా చైత్ర యాక్టింగ్ చేసిన విధానంకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. అద్భుతంగా నటించిందని, సినిమాలో చైత్ర కాకుండా దేవికను మాత్రమే చూసినట్టు అనిపించింది అని ప్రేక్షకులు, విశ్లేషకులు సినిమాను చూసిన తర్వాత అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టాలీవుడ్‌లో స్పెషల్ హీరోయిన్‌గా చైత్ర...

చైత్ర గురించి మరోసారి చర్చ మొదలైంది. ఇంత ప్రతిభవంతురాలైన చైత్రకు ఎందుకు ఆఫర్లు పెద్దగా రావడం లేదు అంటూ కొందరు చర్చ మొదలు పెట్టారు. వచ్చిన సినిమాల్లో కూడా ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యత ఉండటం లేదు. ఆమె నటన ప్రతిభను వాడుకునే దర్శకులు తక్కువ అయ్యారు అంటూ సోషల్ మీడియాలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ ఉన్నప్పటికీ చైత్ర జే ఆచార్ చాలా స్పెషల్ అని మరోసారి 418 సినిమాతో నిరూపితం అయ్యింది అని ఆమె అభిమానులు అంటున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన హీరోయిన్స్ లో ఎక్కువగా అందం చూపించడం తప్ప నటించడం రావడం లేదని, కానీ అందంతో పాటు చైత్ర యాక్టింగ్‌తోనూ ఆకట్టుకుంటుందని, అందుకే ఈ స్పెషల్ బ్యూటీకి మరిన్ని దేవిక, సురభి వంటి పాత్రలు రావాలని చైత్రతో చేయించాలని ఫ్యాన్స్ ఫిల్మ్ మేకర్స్ కి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక మీదట అయినా చైత్రకు తన ప్రతిభకు తగ్గ సినిమా ఆఫర్లు వరుసగా వస్తాయా అనేది చూడాలి.

థ్రెట్స్ మధ్య స్టార్ హీరో బిజినెస్ ధమాకా!



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ మరోసారి వార్తల్లో నిలిచారు. పంజాబ్‌లో సల్మాన్ పేరిట నిర్మాణమైన అత్యంత విలాసవంతమైన పై-రైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ఆయన శనివారం రాత్రి అధికారికంగా ప్రారంభించారు. జేకాబ్ అండ్ కో - జిబి రియల్టీ సంస్థల భాగస్వామ్యంతో రూపొందిన ప్రాజెక్ట్ యాడ్ ప్రోమోలో సల్మాన్ ఖాన్ క్లాస్ లుక్‌తో కనిపించారు. అయితే పంజాబ్‌లో జరిగిన ఈ గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌కు సల్మాన్ ఖాన్ స్వయంగా హాజరుకాకపోవడం గమనారహం లాంచ్ ఈవెంట్‌కు హాజరుకాలేకపోవడానికి అనివార్య కారణాలు అని సల్మాన్ ఖాన్ పేర్కొన్నా? దీని వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు .. భద్రతా ముప్పు ప్రధాన కారణమని ప్రచారం జరుగుతోంది. ఈవెంట్ కోసం సల్మాన్ ఖాన్ ఓ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. -అనివార్య కారణాల వల్ల నేను ఈ రాత్రి కార్యక్రమానికి రాలేకపోయాను. కానీ భౌతికంగా అక్కడ లేకపోయినా నా హృదయం, శుభాకాంక్షలు మీతోనే ఉన్నాయి- పేర్కొన్నారు. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ప్రాణ బెదిరింపులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబైలో నటుడు ట్రైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటన తర్వాత బాలీవుడ్‌లో భయాందోళనలు మరింత ఎక్కువయ్యాయి. సల్మాన్ ఖాన్‌కు చుట్టూ అత్యంత కఠినమైన వై-ప్లస్ కేటగిరీ భద్రత ఉండటంతో సల్మాన్ నేరుగా లక్ష్యంగా చేసుకోవడం సాధ్యం కాకనే దుండగులు ఇతర నటులను .. పరిసరాలను భయాందోళనకు గురి చేస్తున్నారనే కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో పంజాబ్ వంటి సున్నితమైన ప్రాంతంలో ప్రత్యక్షంగా పర్యటించడం భద్రత దృష్ట్యా శ్రేయస్కరం కాదని భావించే సల్మాన్ కార్యక్రమానికి దూరంగా ఉన్నారని తెలుస్తోంది. రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ వివరాల్లోకి వెళితే పంజాబ్‌లోని చండీగఢ్ ప్రాంతంలో 2,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మిస్తున్నారు. -సల్మాన్ ఖాన్ టవర్స్- పేరుతో ప్రసిద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో 6 బహుళ అంతస్తుల టవర్లు ఉండనున్నాయి. ఇందులో 3 .. 4 బిహెచ్‌కే అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు, అత్యాధునిక టౌన్‌షిప్ తరహా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. లాంచ్ యాడ్‌లో సల్మాన్ ఖాన్ సూట్ ధరించి 41 లక్షల విలువైన లగ్జరీ వాచ్‌తో మెరుస్తూ కనిపించారు.మరోవైపు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపుల నడుమ సల్మాన్ ఖాన్ పర్సనల్ లైఫ్ - ప్రొఫెషనల్ ప్రాజెక్ట్‌లలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముంబైలోని బాంద్రా చింబాయ్ ప్రాంతంలో సముద్రానికి అభిముఖంగా ఆరు అంతస్తుల భవన నిర్మాణానికి ఆయనకు ఇటీవల అనుమతులు లభించాయి. దశాబ్దాలుగా బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లోనే నివాసముంటున్న సల్మాన్ భద్రతా కారణాలు .. కుటుంబ అవసరాల రీత్యా ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇలా ఒకవైపు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ బెదిరింపుల నీడ.. మరోవైపు కట్టుదిట్టమైన సెక్యూరిటీ నడుమ సల్మాన్ ఖాన్ కొత్త చిత్రం -మాన్‌స్టర్- హూటింగ్‌తో పాటు రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తున్నారు. ఏది ఏమైనా? బిష్ణోయ్ గ్యాంగ్ ప్రభావం ఎక్కువగా ఉండే పంజాబ్ రీజియన్‌లో ప్రాజెక్ట్ లాంచ్‌కు సల్మాన్ భౌతికంగా దూరంగా ఉండటం బాలీవుడ్‌తో పాటు వ్యాపార వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

వారణాసి లో డూప్ ను పక్కన పెట్టి ఆ రిస్కీ షాట్ మహేష్ బాబు చేశాడా?



సూపర్ స్టార్ కృష్ణ నట వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన మహేష్ బాబు మొదటి మూవీతోనే ఆకట్టుకున్నాడు. బాక్సాఫీస్ రికార్డులను తిరగ రాయడంలో ఆయనకంటూ ఇమేజ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. బి,సి సెంటర్ ప్రేక్షకుల అభిరుచి మేరకు తన సినిమాలో మాస్ ఎలిమెంట్స్ ని సైతం మిళితం చేస్తున్నాడు.

డూప్ లేకుండా రిస్కీ స్టంట్

దర్శకధీరుడు రాజమౌళి మహేష్ బాబు కాంబోలో అంతర్జాతీయ అడ్వెంచర్ డ్రామా గా తెరకెక్కుతున్న వారణాసి మూవీ పై సినీ వర్గాల్లోను, ప్రేక్షకుల్లోను భారీ అంచనాలు నెలకొన్నాయి. 'థ్రిబుల్ ఆర్' మూవీతో ఆస్కార్ రేంజ్ లో తన మేకింగ్ ను చూపించిన రాజమౌళి ఈ మూవీని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నాడు. ఈ సినిమా కోసం మహేష్ వివరీతంగా కష్టపడుతున్నాడట.మహేష్ కెరీర్ స్టార్టింగ్ నుంచి యాక్షన్ సన్నివేశాల్లో నటించడానికి ఇంట్రెస్ట్ చూపించేవాడు. వారణాసి మూవీ కోసం స్పెషల్ ట్రైనింగ్ తీసుకొని మరి షూటింగ్ లో పాల్గొంటున్నాడట. ఇతర దేశాల్లో జరిగే సై రిస్కీ షాట్స్ కోసం విదేశీ ఫైట్ మాస్టర్స్ పర్యవేక్షణలో రోప్స్ కట్టుకొని డూప్ తో సంబంధం లేకుండా తనే ఆ ఫైట్ సీక్వెన్స్ లో పాల్గొనట్లుగా తెలుస్తుంది. ఆయన కెరియర్ స్టార్టింగ్ లోనే నిజం, వన్ నేనొక్కడినే లాంటి సినిమాల్లో కొన్ని రిస్కీ షాట్స్ చేశాడు. సోషల్ మీడియాలో వెలువడుతున్న కథనాల ప్రకారం వారణాసి మూవీలో ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టు మీదికి దూకే ఒక రిస్కీ షాట్ ఉందట. బాడీకి రోప్స్ కట్టుకున్నప్పటికి అది డూప్ తో చేద్దామని దర్శకుడు చెప్పిన కూడా మహేష్ బాబు నేను ఓన్ గా చేస్తానని చెప్పి ఆ షాట్ ను సింగిల్ టేక్ లో చేసేసారట. నిజానికి రాజమౌళి లాంటి దర్శకుడి సినిమాలో సింగిల్ టేక్ లో షాట్ ఓకే అవ్వడం అంటే మామూలు విషయం కాదు. కానీ అన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవడంతో ఈ షాట్ సింగిల్ టేక్ లో చేయగలిగారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మూవీతో ప్రపంచ స్థాయి ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్నాడు. ఇప్పటికే హాలీవుడ్ డైరెక్టర్లు సైతం మహేష్ తో సినిమా చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు.

హాలీవుడ్ ప్రేక్షకులు ఆదరిస్తారా?

అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా హాలీవుడ్ ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుంది. రాజమౌళి లాంటి దర్శకుడు 'ఆర్ఆర్ఆర్' సినిమాతో హాలీవుడ్ ఇండస్ట్రీలో తన సత్తా చాటుకున్నాడు. మరోసారి ఆయన నుంచి వస్తున్న ఈ ప్రాజెక్టు ఏ మేరకు ఇంపాక్ట్ ను క్రియేట్ చేస్తుంది. హాలీవుడ్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేయగలదా లేదా అనేది చూడాలి...

రైటర్ల కోసం స్టార్ వారసుడు వేట



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఇండస్ట్రీలో దర్శకుడిగా తనదైన ముద్ర వేసేందుకు పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు. తండ్రి పేరును వాడుకోకుండా సొంత ప్రతిభతో విజయాన్ని అందుకోవాలని తాపత్రయపడుతున్న స్టార్ వారసుడు ప్రస్తుతం తడుపరి స్ట్రీమింగ్ సిరీస్ కోసం కొత్త రచయితల కోసం అన్వేషిస్తున్నారు. ఉన్న పాత రచయితల కంటే కొత్త ఆలోచనలతో వచ్చే యువ రక్తాన్ని ప్రోత్సహించాలని ఆర్యన్ నిర్ణయించుకోవడం విశేషం. తొలి వెబ్ ప్రాజెక్ట్ -ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్- పనులను విజయవంతంగా పూర్తి చేసిన ఆర్యన్ తన రెండో ప్రాజెక్ట్‌ను మరింత భారీగా.. వైవిధ్యంగా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి డైరెక్షన్ బాధ్యతలకే పరిమితం కాకుండా కథా చర్చల్లో స్వయంగా పాల్గొని స్క్రిప్ట్‌ను దగ్గరుండి తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. అందుకోసమే వినూత్న దృక్పథం, సమకాలీన ఆలోచనలు ఉన్న కొత్త రచయితల బృందాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నేటి తరం ఓటీటీ ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా.. అత్యంత ఆసక్తికరమైన కంటెంట్‌ను అందించడమే లక్ష్యంగా ఆర్యన్ ఖాన్ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా ట్రెడిషనల్ రచయితలు రాసే శైలికి భిన్నంగా, సరికొత్త కోణంలో కథలను చెప్పగల యువ రచయితలకు ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ సెర్చ్ ద్వారా వచ్చే ఐడియాలను భవిష్యత్తులో రాబోయే ఇతర డిజిటల్ ప్రాజెక్ట్‌లకు కూడా ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆర్యన్ ఖాన్ కెరీర్ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. ఆయన మొదటగా వాయిస్ ఆర్టిస్ట్‌గా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 2019లో వచ్చిన -ది లయన్ కింగ్-...2024లో విడుదలైన -ముఫాసా: ది లయన్ కింగ్- చిత్రాలలో సింబా పాత్రకు ఆయన అందించిన వాయిస్ ఓవర్ విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అయితే నటన కంటే కెమెరా వెనుక ఉండి కథలను నడిపించడమే ఆర్యన్ అసలు లక్ష్యమని ఇప్పటికే స్పష్టం చేశారు.ఆ దిశగానే బాలీవుడ్ చిత్ర పరిశ్రమ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని -ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్- సిరీస్‌తో షోరూనర్‌గా.. రచయితగా.. దర్శకుడిగా అవతారమెత్తారు. మొదటి ప్రాజెక్ట్‌లోనే షారుఖ్ ఖాన్.. ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ వంటి దిగ్గజ నటులు ప్రత్యేక పాత్రల్లో కనిపించడంతో ఇండస్ట్రీ వ్యాప్తంగా సిరీస్‌పై క్రేజ్ ఏర్పడింది. అనుకున్నట్లుగానే ఆ ప్లాన్ ఆర్మోట్ అయింది. రిలీజ్ అనంతరం సిరీస్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

Scanned with OKEN Scanner

రోడ్లపైకి లక్షల మంది ఇజ్రాయెలీలు.. నెతన్యాహుకు ఓటమి తప్పదా?



సరిహద్దుల్లో శత్రువుల రక్తం చిందుతున్నా.. దేశం లోపల మాత్రం సొంత ప్రజల కన్నీళ్లు, ఆగ్రహం సుడిగాలిలా చుట్టుముట్టాయి. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ నిరసనకారుల హోరుతో మార్మోగుతోంది. "మా భద్రత ఏది? మా బంధువుల ప్రాణాలకు బాధ్యులెవరు?" అంటూ వీధుల్లోకి వచ్చిన లక్షలాది మంది ప్రజల కన్నీళ్లు.. ఆగ్రహం ఇజ్రాయెల్ వీరుడిగా చెప్పుకునే నెతన్యాహు సింహాసనాన్ని కదిలించేలా కనిపిస్తోంది. ఇజ్రాయెల్ చరిత్రలోనే ఇది అత్యంత క్లిష్టమైన ఘట్టం. సరిహద్దుల్లో యుద్ధం సాగుతున్నా.. దేశంలో మాత్రం ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం అగ్నిపర్వతంలా బద్దలవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టెల్ అవీవ్ వీధుల్లోకి ఉవ్వెత్తున ఎగిసిపడిన ప్రజల ఆక్రోశం ఇజ్రాయెల్ రాజకీయాలను గందరగోళంలోకి నెట్టివేసింది.

గుండెకోత మిగిల్చిన అక్టోబర్ 7 దాడి

2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన సైనిక దాడి ఇజ్రాయెలీల గుండెల్లో చెరగని గాయాన్ని మిగిల్చింది. నిద్రపోతున్న వేలాది మంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వందలాది మంది బందీలుగా నరకం అనుభవించారు. "దేశ భద్రతే మా ప్రాధాన్యం" అని నిరంతరం చెప్పే నెతన్యాహు ప్రభుత్వం.. ఇంత పెద్ద దాడిని ముందే ఎందుకు ఊహించలేకపోయింది? రక్షణ వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? అన్న ప్రశ్న ప్రతి ఇజ్రాయెలీ పౌరుడి మనస్సును కలచివేస్తోంది.

కన్నీటి మధ్య స్వతంత్ర విచారణ డిమాండ్

ఇప్పుడు వీధుల్లోకి వచ్చిన లక్షల మంది నిరసనకారులు కేవలం రాజకీయం మాట్లాడటం లేదు. తమ వారిని కోల్పోయిన బాధను, ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. అక్టోబర్ 7 భద్రతా వైఫల్యాలపై తక్షణమే ఒక 'స్వతంత్ర విచారణ కమిషన్' వేసి అసలు నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే అధికారమే ముఖ్యమా అని ప్రశ్నిస్తున్నారు.

నెతన్యాహు ముందున్న కత్తిమీద సాము

ఒకవైపు సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధం.. మరోవైపు బందీల కుటుంబాల రోదనలు, ఇంకోవైపు దేశంలో పెల్లుబుకుతున్న తీవ్ర అసంతృప్తి.. ఇవన్నీ నెతన్యాహు రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. నిరసనల్లో కనిపిస్తున్న ఈ ఆగ్రహం రాబోయే ఎన్నికల్లో ఓట్ల రూపంలో మారితే ఆయనకు ఘోర పరాభవం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఎన్నికల ఫలితాలను కేవలం నిరసనల ఆధారంగానే చెప్పలేం. నెతన్యాహు మద్దతుదారులు జాతీయ భద్రత, బలమైన నాయకత్వం అనే అంశాలను ప్రచార ఆయుధాలుగా వాడుతుండగా... విపక్షాలు ప్రభుత్వ జవాబుదారీతనాన్ని వేలెత్తి చూపుతున్నాయి.

అంతిమ తీర్పు ప్రజలదే

ప్రజా ఉద్యమాలు ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ ఆగ్రహం ఓటింగ్ మిషన్ల వరకు చేరి అధికారాన్ని మారుస్తుందా? లేక రాజకీయ చతురతతో నెతన్యాహు మరోసారి గట్టెక్కుతారా? అనేది కాలమే నిర్ణయించాలి. కానీ ఒక్కటి మాత్రం నిజం.. సొంత దేశ ప్రజల్లో రగిలిన ఈ నమ్మకద్రోహపు గాయం నెతన్యాహుకు జీవితంలోనే అతిపెద్ద సవాలుగా మారింది.

ట్రంప్ హెచ్చరికల వెనుక అసలు వ్యూహం ఏంటి?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసే అవకాశం ఉందంటూ హెచ్చరించినట్లు వచ్చిన వార్తలు అంతర్జాతీయంగా చర్చకు దారితీశాయి. అయితే, ఈ పరిణామాలను కేవలం యుద్ధ హెచ్చరికగా కాకుండా.. చమురు, వాణిజ్యం, రాజకీయ ఒత్తిళ్ల కోణంలోనూ చూడాలి. ఇరాన్‌కు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడితే చమురు రవాణా ఖర్చులు పెరగవచ్చు. సరఫరా తగ్గుతుందనే భయంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు కూడా వేగంగా మారవచ్చు. అమెరికా ఒత్తిడికి ఇరాన్ అంగీకరిస్తుందా? లేక తన వ్యూహాన్ని కొనసాగిస్తుందా? అనేదే ఇప్పుడు కీలకం. చర్చలు జరుగుతున్నాయని ఒకవైపు సంకేతాలు వచ్చినా, మరోవైపు ఇరు దేశాల ప్రకటనల్లో విభేదాలు కనిపిస్తే అనిశ్చితి మరింత పెరుగుతుంది. అయితే, దాడి హెచ్చరికలు రావడం మాత్రమే యుద్ధం తప్పకుండా జరుగుతుందని అర్థం కాదు. ఈ పరిణామాలు భారత్‌కు కూడా ముఖ్యమే. మన దేశం పెద్ద మొత్తంలో ముడిచమురును దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ ధరలు ఎక్కువకాలం పెరిగితే ఇంధన ఖర్చులు, రవాణా చార్జీలు, వస్తువుల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో, ధరలు స్థిరంగా ఉంటే ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పరిమితంగా ఉండవచ్చు. చివరికి, ట్రంప్ హెచ్చరికలు నిజమైన సైనిక చర్యగా మారతాయా, లేక చర్చల్లో ఒత్తిడి పెంచే ప్రయత్నమా అనేది చూడాలి. హార్ముజ్ జలసంధిలో రవాణా పరిస్థితులు, అధికారిక ప్రకటనలు, చమురు ధరల మార్పులే తదుపరి పరిణామాలకు కీలక సంకేతాలు.

మైనస్ 45 డిగ్రీల చలిలో.. ఎవరీ 'శౌర్య కమాండోలు'.. చైనాకు ఎందుకు చుక్కలు చూపిస్తున్నారు?



అత్యంత ప్రతికూల వాతావరణం... ఊపిరి తీసుకోవడమే కష్టమయ్యే 19 వేల అడుగుల ఎత్తు... హిమపాతాలు, శూన్యానికి పడిపోయే ఉష్ణోగ్రతలు... ఒకవైపు ప్రకృతే శత్రువులా దాడి చేస్తుంటే మరోవైపు సరిహద్దు వెంబడి చైనా కుతంత్రాలు.. ఇలాంటి నరకప్రాయమైన పరిస్థితులలోనూ రక్తం గడ్డకట్టే మైనస్ 45 డిగ్రీల చలిలో శత్రువు గుండెల్లో నిద్రపోతున్న వీరులే 'శౌర్య కమాండోలు'. ఇటీవల ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) చీఫ్ అరుణాచల్ ప్రదేశ్ బార్డర్‌లో ఈ కమాండోలు చూపుతున్న ప్రతాపాన్ని చైనాకు వారు చూపిస్తున్న చుక్కలను వెల్లడించడంతో దేశమంతటా ఇప్పుడు "ఎవరీ శౌర్య కమాండోలు?" అనే చర్చ ఆసక్తికరంగా మారింది.

గల్వాన్ ఘర్షణే ఈ 'శౌర్య' విభాగానికి మూలం

2020లో గల్వాన్ లోయలో చైనా సైనికుల దురాక్రమణ యత్నాలు, తదనంతర పరిణామాల తర్వాత భారత సరిహద్దు భద్రతలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఎత్తైన పర్వత ప్రాంతాలు, విపరీతమైన మంచు కురిసే ప్రదేశాలలో చైనా బలగాల ఆకస్మిక దాడులను తక్షణమే తిప్పికొట్టేందుకు ఒక ప్రత్యేక శక్తివంతమైన దళం అవసరమని భారత భద్రతా సంస్థలు భావించాయి. అందులోంచి రూపుదిద్దుకున్నదే ఐటీబీపీకి చెందిన ఈ ప్రత్యేక విభాగం 'శౌర్య కమాండో దళం'.

మైనస్ 45 డిగ్రీల చలిలో గడ్డకట్టే వీరత్వం

సముద్ర మట్టానికి 9,000 అడుగుల నుండి 19,000 అడుగుల ఎత్తులోని అత్యంత ప్రమాదకరమైన శిఖరాలపై వీరు నిరంతరం గస్తీ కాస్తారు. కొండలు ఎక్కడం , మంచులో మార్షల్ ఆర్ట్స్ , అత్యంత వేగంగా వ్యూహాత్మక దాడులు చేయడం,

మైనస్ 45 డిగ్రీల చలి వాతావరణానికి శరీరాన్ని అలవాటు చేసుకోవడం వంటి కఠినమైన ట్రైనింగ్‌ను వీరు పూర్తి చేస్తారు. అత్యాధునిక రాత్రి వేళ చూసే నైట్-విజన్ పరికరాలు, కఠిన శీతల వాతావరణానికి తట్టుకునే తేలికపాటి ఆయుధాలు వీరి సొంతం.

చైనాకు శౌర్య కమాండోలు ఎందుకు చుక్కలు చూపిస్తున్నారు?

ఒకప్పుడు ప్రతికూల వాతావరణాన్ని ఆసరాగా చేసుకుని చైనా సైన్యం (పీఎల్‌ఏ) సరిహద్దుల్లో చొరబాట్లకు యత్నించేది. కానీ శౌర్య కమాండోల రాకతో ఆ పరిస్థితి తలకిందులైంది. ఎలాంటి మంచు తుఫానులోనైనా ఈ కమాండోలు పహారా కాస్తుండడంతో చైనా బలగాలు వెనక్కి తగ్గక తప్పడం లేదు. చైనా సరిహద్దుల్లో చిన్నపాటి కదలిక కనిపించినా కొద్ది నిమిషాల్లోనే కౌంటర్ అటాక్ ఇచ్చే సామర్థ్యం శౌర్య కమాండోల సొంతం.

ప్రతికూల వాతావరణం తట్టుకోలేక చైనా సైనికులు తరచూ ఇబ్బందులు పడుతుంటే.. శౌర్య కమాండోలు మాత్రం మైనస్ డిగ్రీలలోనూ సింహాల్లా కదలాడడం చైనా బలగాలలో మానసిక భయాన్ని కలిగిస్తోంది.

సరిహద్దుకు తిరుగులేని 'ఉక్కు గోడ'

హిమాలయాల మంచు చలిలో దేశ ప్రజలందరూ హాయిగా నిద్రపోతున్న వేళ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దును కాపాడుతున్న శౌర్య కమాండోలు భారత రక్షణ రంగానికి కొండంత అండ. అరుణాచల్ ప్రదేశ్ నుంచి లడఖ్ వరకు సరిహద్దు వెంబడి శౌర్య కమాండోలు నిలబడి ఉన్నంత కాలం... చైనా ఆటలు ఇక సాగవనేది స్పష్టమవుతోంది.

అమెరికా రహస్య స్థావరాలపై నల్లటి త్రిభుజాలు.. గంటకు 2,900 కి.మీ. వేగం.. అసలేం జరుగుతోంది?



అమెరికా ఆకాశంలో ఇటీవల వెలుగుచూస్తున్న కొన్ని వింత వైమానిక వాహనాలు అంతర్జాతీయంగా తీవ్ర ఆసక్తిని, ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. సాధారణ విమానాల ఆకారం కానీ, డ్రోన్లకు ఉండే ప్రామాణిక కదలికలు కానీ లేని కొన్ని వింత వస్తువులు సున్నితమైన రక్షణ ప్రాంతాల సమీపంలో ప్రత్యక్షమవుతున్నాయి. వీటికి ఇంజిన్ శబ్దం లేకపోవడం.. పొగ లేదా ఎగ్జాస్ట్ ఆనవాళ్లు కనిపించకపోవడం పరిశోధకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అత్యంత రహస్య సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించే అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లోనే ఇవి సంచరించడం ఆ దేశ భద్రతా వ్యవస్థపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గుర్తుతెలియని వైమానిక దృగ్విషయాలకు (యూఏపీ) సంబంధించిన రహస్య పత్రాలను బహిర్గతం చేసే క్రమంలో అక్టోబర్ 23న వెలువడిన సమాచారం ఈ చర్చను మరింత వేడెక్కించింది. గత ఏడాదికాలంలో కనీసం మూడు సందర్భాల్లో నల్లటి త్రిభుజాకారపు వస్తువులు ఈ కేంద్రాల వద్ద కనిపించినట్లు ఆ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఘటనలలో ప్రతిఒక్కరినీ విస్తుపోయేలా చేస్తున్న ప్రధాన అంశం ఆ వస్తువుల అసాధారణ వేగం. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఒక నల్లటి త్రిభుజాకారపు వస్తువు కేవలం మూడు సెకన్ల వ్యవధిలోనే దాదాపు 2.4 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. దీనిని బట్టి లెక్కిస్తే దాని వేగం గంటకు సుమారు 2,900 కిలోమీటర్లకు చేరుకుంటుంది. అయితే ఇది కేవలం ప్రత్యక్ష సాక్షుల అంచనా మాత్రమే అయినందున శాస్త్రీయంగా నిర్ధారించడానికి రాడార్, ఇతర సెన్సార్ల డేటా అత్యవసరం కానుంది. 9 నుండి 15 అడుగుల వింగ్ స్పాన్ కలిగిన ఈ వాహనాల నిర్మాణం కూడా అత్యంత విచిత్రంగా ఉంది. ప్రామాణిక విమానాల్లో ఉండే కాక్‌పిట్, ఎయిర్ ఇంటేక్స్ లేదా ప్రత్యేక ఇంజిన్ భాగాలు వీటిలో ఏమాత్రం కనిపించలేదు. థర్మల్ పరికరాల ద్వారా పరిశీలించినప్పుడు కూడా విమానాల్లోలాగా ఇంజిన్ వద్ద అధిక ఉష్ణోగ్రత ఉండకుండా ఉపరితలమంతా ఒకే రకమైన ఉష్ణ సంకేతాలు నమోదు కావడం గమనార్హం. ఈ పరిణామాలు అమెరికా జాతీయ భద్రతకు సంబంధించి పలు కీలక అనుమానాలకు తావిస్తున్నాయి. ఇవి అమెరికా రక్షణ దళాలు రహస్యంగా రూపొందిస్తున్న నూతన తరం స్టెల్త్ సాంకేతికతకు చెందినవా లేక ప్రత్యర్థి దేశాలు ప్రయోగించిన అత్యాధునిక నిఘా సాధనాలా అనే దిశగా విశ్లేషణలు జరుగుతున్నాయి.

ఫుడ్ బ్యాంక్ వివాదం .. అమెరికాలో భారతీయ విద్యార్థులపై ద్వేషానికి మరో అస్త్రం



అమెరికాలో భారతీయ విద్యార్థుల చుట్టూ మరో వివాదం ముసురుకుంది. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో చదువుతున్న ఎఫ్-1 విద్యార్థికి సంబంధించినదిగా చెబుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఫుడ్ బ్యాంకుల నుంచి ఉచితంగా ఆహారం పొందేందుకు మోసపూరిత మార్గాలను వివరిస్తున్నట్లుగా ఆ వీడియోపై ఆరోపణలు వచ్చాయి. దీంతో కొందరు నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ వ్యవహారంలో అసలు ఏం జరిగింది? నిజంగానే ఆహార పంపిణీ వ్యవస్థను మోసం చేశారా? లేక విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను వినియోగించుకోవడాన్ని వివాదంగా మార్చారా? ప్రస్తుతం ఈ ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

వీడియో తొలగింపు.. ఆరోపణలతోనే తీర్పా?

వైరల్ అయిన వీడియోపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో దానిని రూపొందించిన వ్యక్తి తన యూట్యూబ్ వీడియోను ప్రైవేట్ చేసినట్లు కథనాలు చెబుతున్నాయి. అలాగే ఎక్స్ లో షేర్ చేసిన వీడియోపై కాపీరైట్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అయితే వీడియో అందుబాటులో లేకపోవడం లేదా దానిని తొలగించడం మాత్రమే ఆరోపణలు నిజమని నిరూపించదు. ఆ వీడియోలో అసలు ఏం చెప్పారు? ఏ ఫుడ్ బ్యాంక్‌ను ఉపయోగించారు? అక్కడి నిబంధనలను ఉల్లంఘించారా? అనే అంశాలపై స్పష్టమైన ఆధారాలు బయటకు రావాల్సి ఉంది. సోషల్ మీడియాలో ఆరోపణలు రావడం ఒక ఎత్తయితే, వాటిని వాస్తవాలుగా పరిగణించి ఒక వ్యక్తిని లేదా మొత్తం సమాజాన్ని దోషిగా చిత్రీకరించడం మరో ఎత్తు. ఈ ఘటనలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది.

ఫుడ్ బ్యాంక్ అంటే ఏమిటి? విద్యార్థులకు ఎందుకు ఉపయోగపడుతుంది?

అమెరికాలో ఫుడ్ బ్యాంకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆహారం అందించేందుకు పనిచేస్తాయి. ఉద్యోగాలు కోల్పోయినవారు, తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు, విద్యార్థులు, ఇతర అవసరాల్లో ఉన్నవారికి ఇవి కొంత ఊరటనిస్తాయి. కొన్ని విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లలో ప్రత్యేక ఫుడ్ ప్యాంట్రీలను ఏర్పాటు చేసి అర్హులైన విద్యార్థులకు ఉచితంగా ఆహార పదార్థాలు అందిస్తున్నాయి.విదేశాలకు వెళ్లి చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. ట్యూషన్ ఫీజులు, అద్దె, రవాణా, బీమా, ఇతర జీవన వ్యయాలు విద్యార్థులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతాయి. కుటుంబం నుంచి వచ్చే డబ్బు ఆలస్యమైనా, అనుకోని ఖర్చులు ఎదురైనా కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడవచ్చు. అలాంటి సందర్భాల్లో విశ్వవిద్యాలయాలు అందించే ఆహార సహాయ కార్యక్రమాలు వారికి ఉపయోగపడతాయి. అయితే ప్రతి ఫుడ్ బ్యాంక్‌కు ప్రత్యేక అర్హతలు, వినియోగ నిబంధనలు ఉంటాయి. వాటిని పాటిస్తూ ఆహారం తీసుకోవడం చట్టబద్ధమైన సదుపాయాన్ని వినియోగించుకోవడమే. తప్పుడు సమాచారం ఇచ్చి, అర్హత లేకున్నా ప్రయోజనం పొందితే మాత్రం అది వేరే విషయం. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం అత్యంత ముఖ్యం.

ఎఫ్-1 విద్యార్థి అంటే ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండకూడదా?

అమెరికా ఎఫ్-1 విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు చదువు, జీవన ఖర్చులను భరించగల సామర్థ్యానికి సంబంధించిన ఆధారాలు అవసరం. అయితే, వీసా కోసం ఆర్థిక సామర్థ్యాన్ని చూపించడం అంటే భవిష్యత్తులో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ ఎదురుకావని హామీ ఇచ్చినట్లుకాదు. విదేశీ విద్యార్థులకు కూడా అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. కుటుంబ ఆదాయంలో మార్పులు, అత్యవసర ఖర్చులు, ఉద్యోగ అవకాశాలపై పరిమితులు, జీవన వ్యయాల పెరుగుదల వంటి అంశాలు వారి పరిస్థితిని ప్రభావితం చేయవచ్చు. అందుకే కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆహారం, అత్యవసర ఆర్థిక సాయం, ఇతర సహాయక కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఒక విద్యార్థి యూనివర్సిటీ ఫుడ్ ప్యాంట్రీ నుంచి నిబంధనలకు అనుగుణంగా ఆహారం తీసుకున్నట్టయితే దానిని మోసంగా పరిగణించలేం. అదే సమయంలో నిజంగా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత సంస్థలు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవచ్చు. కేవలం వీసా స్థితి ఆధారంగా లేదా సోషల్ మీడియా ఆరోపణలతోనే తుది నిర్ణయానికి రావడం సరికాదు.

ఒకరి ఆరోపణ.. భారతీయులందరిపైనా ద్వేషమా?

ఈ ఘటనలో ఆందోళన కలిగిస్తున్న మరో అంశం అమెరికాలో భారతీయులపై వ్యక్తమవుతున్న ప్రతికూల స్పందన. ఎక్స్‌లో వైరల్ అయిన పోస్టు కింద కొందరు భారతీయులందరినీ దేశం నుంచి పంపించేయాలంటూ వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఒక వ్యక్తి తప్పు చేసినా దానికి మొత్తం జాతీయతను బాధ్యురాలిగా చేయడం న్యాయం కాదు. అమెరికాలో భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలు సహా అనేక విభాగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. వారిలో ఎవరైనా తప్పు చేస్తే వ్యక్తిగతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో, ఎలాంటి తప్పు చేయని ఇతర విద్యార్థులను జాతి ఆధారంగా లక్ష్యంగా చేసుకోవడం వివక్ష కిందకు వస్తుంది. సోషల్ మీడియా అల్గారిథమ్‌లు వివాదాస్పద కంటెంట్‌ను వేగంగా విస్తరించే పరిస్థితుల్లో అసంపూర్ణ సమాచారం ఆధారంగా ఏర్పడే అభిప్రాయాలు పెద్ద సమస్యగా మారుతున్నాయి. ఒక వీడియో చుట్టూ మొదలైన వివాదం క్రమంగా వలసదారులపై ద్వేషపూరిత ప్రచారానికి వేదికగా మారితే, వాస్తవాలను తెలుసుకునే అవకాశం వెనుకబడిపోతుంది.

అసలు ప్రశ్న.. ఫుడ్ బ్యాంక్ వినియోగమా? నిబంధనల ఉల్లంఘనా?

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు బయటకు వచ్చిన వివరాల ఆధారంగా మాత్రమే విద్యార్థి తప్పు చేశాడని నిర్ధారించడం సాధ్యం కాదు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌కు సంబంధించిన విద్యార్థి ఫుడ్ ప్యాంట్రీ వంటి సదుపాయాలు ఉండటం.. అర్హులైన విద్యార్థులు వాటిని వినియోగించుకోవడం సహజమే. అయితే వైరల్ వీడియోలో ఏ విధానాన్ని చూపించారు? అది విశ్వవిద్యాలయ నిబంధనలకు విరుద్ధమా? నిజంగా ఫుడ్ బ్యాంక్‌ను మోసం చేశారా? అనే ప్రశ్నలకు విశ్వసనీయమైన ఆధారాలు అవసరం. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ఆరోపణ నిజం కాదు. అలాగే విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ వాటిని జాతి లేదా జాతీయతతో ముడిపెట్టడం కూడా సరైన విధానం కాదు. వాస్తవాలు నిర్ధారించిన తర్వాతే విమర్శలు చేయాలి. తప్పు నిరూపితమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఒకరి చర్యలను సాకుగా చూపి మొత్తం భారతీయ సమాజాన్ని నిందించడం మాత్రం సమస్యకు పరిష్కారం కాదు.

మునీర్.. దేశ సంపదను దోచుకోవద్దు

పాక్‌లో రేర్ ఎర్త్ మెటల్స్ డీల్‌పై నిరసనలు



పాకిస్తాన్‌లో రేర్ ఎర్త్ మెటల్స్ ఒప్పందం కొత్త రాజకీయ వివాదానికి తెరలేపింది. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందంలో భాగంగా దేశంలోని విలువైన ఖనిజ వనరులను వెలికితీసి ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో ఖనిజాల తవ్వకాల కోసం వచ్చిన వాహనాలను స్థానికులు అడ్డుకోవడం ఈ వివాదం తీవ్రతను వెల్లడిస్తోంది. దేశ సహజ సంపదను కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్, ప్రభుత్వ పెద్దలపై విమర్శలు గుప్పించారు.

అమెరికాతో ఒప్పందంపై ఎందుకీ వివాదం?

ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. రక్షణ రంగంలోనూ వీటికి కీలకమైన ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశాలతో అమెరికా సహా పలు అగ్రరాజ్యాలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయి. పాకిస్థాన్‌లోనూ ఈ వనరులను వెలికితీసి అంతర్జాతీయ మార్కెట్‌కు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఒప్పందం వల్ల దేశానికి ఎంత ప్రయోజనం కలుగుతుంది? ఖనిజాల తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయం స్థానిక ప్రజలకు ఎంతవరకు చేరుతుంది? సహజ వనరులపై దేశానికి ఉండాల్సిన నియంత్రణ ఏమవుతుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దేశ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు, ఖనిజ ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచుకోవడం ప్రభుత్వానికి అవసరమే కావచ్చు. కానీ ఆ ప్రక్రియలో దేశ ప్రయోజనాలు, స్థానిక ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిరసనకారులు కోరుతున్నారు.

బ్రీఫ్‌కేసులో ఖనిజాలు.. గతంలోనూ విమర్శలు

గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశం సందర్భంగా పాకిస్థాన్ నాయకులు రేర్ ఎర్త్ మెటల్స్ నమూనాలను ప్రదర్శించిన అంశం కూడా చర్చకు వచ్చింది. ఖనిజాల నమూనాలను బ్రీఫ్‌కేసులో తీసుకెళ్లి చూపించడంపై అప్పట్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. దేశంలోని విలువైన వనరులను అమెరికాకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారంటూ కొందరు విమర్శకులు వ్యాఖ్యానించారు. ఈ పరిణామం నేపథ్యంలో ఇప్పుడు తవ్వకాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమవుతుండటంతో పాత వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

ఖనిజాల తవ్వకాలను అడ్డుకున్న స్థానికులు

ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఖనిజాల తవ్వకాల కోసం వాహనాలు చేరుకోవడంతో స్థానికులు వాటిని అడ్డుకున్నట్లు సమాచారం. తమ ప్రాంతంలోని సహజ వనరులను వెలికితీసి విదేశాలకు తరలించే ముందు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దేశ సంపదను కాపాడాల్సిన పాలకులే దాన్ని ఇతరుల ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే పరిస్థితి కల్పిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మీ లాభాల కోసం దేశ సంపదను దోచుకోవద్దు' అనే నినాదం ఈ నిరసనల్లో ప్రధానంగా వినిపిస్తోంది. ఖనిజ సంపదపై స్థానిక ప్రజలకు కూడా హక్కు ఉండాలని, తవ్వకాల వల్ల తమ జీవనోపాధికి నష్టం కలగకూడదని నిరసనకారులు కోరుతున్నారు. అయితే ఈ నిరసనల వెనుక ఉన్న స్థానిక సమస్యలు, తవ్వకాల ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు మరింత స్పష్టత పొందాల్సి ఉంది.

పాకిస్థాన్‌కు లాభమా? నష్టమా?

రేర్ ఎర్త్ మెటల్స్ అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన వనరులు. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే పాకిస్థాన్‌కు విదేశీ మారకద్రవ్యం సమకూరడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు లభించవచ్చు. అయితే ముడి ఖనిజాలను తక్కువ ధరకు ఎగుమతి చేసి వాటి శుద్ధి, ప్రాసెసింగ్, అధునాతన ఉత్పత్తుల తయారీ ద్వారా వచ్చే అధిక విలువను ఇతర దేశాలు పొందితే పాకిస్థాన్‌కు దక్కే ప్రయోజనం పరిమితమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఖనిజాల తవ్వకాలతోపాటు దేశంలోనే ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేయడం, స్థానికులకు ఉపాధి కల్పించడం, పర్యావరణ నష్టాన్ని తగ్గించడం వంటి అంశాలు కీలకం. ఒప్పందాల వివరాలను పారదర్శకంగా వెల్లడించడం, ప్రభుత్వ ఆదాయాన్ని ఎలా వినియోగిస్తారో ప్రజలకు వివరించడం కూడా అవసరం.

మునీర్ ప్రభుత్వానికి సవాలుగా నిరసనలు

పాకిస్థాన్‌లో ఆర్థిక సంక్షోభం, రాజకీయ అనిశ్చితి వంటి సమస్యల మధ్య సహజ వనరుల వినియోగంపై ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వానికి ముఖ్యమైన లక్ష్యాలే అయినప్పటికీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు కొత్త సమస్యలకు దారితీయవచ్చు. ప్రత్యేకించి ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి ప్రాంతాల్లో స్థానికుల ఆందోళనలను పట్టించుకోకుండా తవ్వకాలు కొనసాగిస్తే నిరసనలు మరింత విస్తరించే అవకాశం ఉంది. అమెరికాతో రేర్ ఎర్త్ మెటల్స్ ఒప్పందం పాకిస్థాన్‌కు ఆర్థిక అవకాశాలను అందించగలిగినా.. దాని అమలులో పారదర్శకత, దేశ ప్రయోజనాల పరిరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం కీలకం కానున్నాయి. ఆసిమ్ మునీర్, పీఎం నవాజ్ లు మాత్రమే ఈ డీల్ లో బాగుపడుతున్నారన్న ఆరోపణలు పాకిస్తాన్ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. సహజ సంపద ఎవరి ప్రయోజనాలకు ఉపయోగపడాలి? దాని ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చేరాలి? అన్న ప్రశ్నలే ఇప్పుడు పాకిస్థాన్‌లో ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారాయి.

Scanned with OKEN Scanner

పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో రచ్చ లేపుతున్న ఇండిపెండెంట్!

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల వేడి పరాకాష్టకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొన్ని ప్రాంతాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ మెజార్టీ మున్సిపాలిటీల్లో అభ్యర్థులపై స్పష్టత రావడంతో అందరూ ప్రచారంలో దూకుడు పెంచారు. ఎలాగైనా సరే విజయం సాధించాలనే పట్టుదలతో అధికార, విపక్ష పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే, పార్టీల హామీలను మించిపోయేలా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా వినూత్న హామీలు, ప్రలోభాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మున్సిపాలిటీ ఎన్నికలు కాకరేపుతున్నాయి. ఈ మున్సిపాలిటీలో ఒక కౌన్సిల్ పదవికి పోటీచేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రకటించిన ఆఫర్ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. తనను గెలిపిస్తే ఏడాది పాటు రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా కేబుల్ టీవీ సేవలు అందిస్తానని ఆయన ఓటర్లకు హామీ ఇచ్చారు. గతంలో ఇదే ప్రాంతం నుంచి కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉండటంతో, ఈ హామీ పట్ల స్థానిక ఓటర్లు బాగా ఆకర్షితులవుతున్నారని చెబుతున్నారు అప్పటివరకు తమ ఇళ్లలో డిష్ కనెక్షన్లు వాడుతున్న కొందరు ఓటర్లు, వాటిని తొలగించి వెంటనే కేబుల్ వైర్లు వేయాలంటూ స్వయంగా ఆ అభ్యర్థినే కోరడం అక్కడి ప్రచార సరళికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే ఈ ఉచిత కేబుల్ టీవీ హామీ వెనుక ఉన్న ఆర్థిక సమీకరణాలను గమనిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందేనని అంటున్నారు. పిఠాపురం మున్సిపాలిటీలోని ఒక వార్డులో సగటున 1,500 నుండి 2,000 వరకు ఓట్లు ఉంటాయని, అంటే దాదాపు 500 వరకు ఇళ్లు ఉంటాయని అంచనా. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం ఒక ఇంటికి కేబుల్ టీవీ కనెక్షన్ ఖర్చు నెలకు కనీసం రూ. 350గా లెక్కించినా, ఒక కుటుంబానికి ఏడాదికి రూ. 4,200 వరకు అవుతుంది. ఈ లెక్కన వార్డులోని 500 ఇళ్లకు ఏడాది పాటు ఉచితంగా కేబుల్ టీవీ ప్రసారాలు అందించాలంటే సదరు అభ్యర్థి తన సొంత జేబు నుంచి ఏకంగా రూ. 21 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఒక సాధారణ మున్సిపల్ వార్డు సభ్యుడిగా గెలవడం కోసం ఒక అభ్యర్థి ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించాల్సిన అవసరం ఉందా అనే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.వాస్తవానికి ఇలాంటి వినూత్న ప్రచారాలు కేవలం పిఠాపురానికే పరిమితం కాలేదని అంటున్నారు. రాష్ట్రంలోని అనేక మున్సిపాలిటీల్లోనూ అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. పోటీలో ఉన్న పలువురు అభ్యర్థులు ఓటర్లకు రకరకాల గృహోపకరణాలను పంపిణీ చేసేందుకు ఇప్పటికే సన్నాహాలు చేసుకుంటున్నారని అంటున్నారు. కొన్నిచోట్ల ఓటర్లు కూడా ఒక అడుగు ముందుకేసి తమకు ఏ వస్తువులు కావాలో ముందుగానే అభ్యర్థులకు ఇండెంట్ ఇస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు కురిపిస్తున్న హామీలు, ఇస్తున్న ఆఫర్లు ఏపీ రాజకీయంలో సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తున్నాయి.

'కూటమి'కి ఇలాంటి ప్రచారం మంచిదేనా?


ఏపీలో కూటమి పార్టీల మధ్య జరుగుతున్న చర్చలపై రాజకీయంగానే కాకుండా.. వ్యక్తిగతంగా కూడా.. ఇబ్బందికర అంశాలు తెరమీదికి వస్తున్నాయి. కొన్ని కొన్ని విషయాలు నాలుగు గోడల మధ్యే జరిగిపోవాలి. కూటమి పార్టీల ముఖ్య నేతల విషయాలు కూడా.. నాలుగు గోడల మధ్యే ఉండాలి. కానీ.. ఎవరు బయటకు చెబుతున్నారో.. ఎందు కు చెబుతున్నారో.. తెలియదు కానీ.. నాలుగు గోడల మధ్య ఉండాల్సిన విషయాలు సోషల్ మీడియాలోకి వస్తున్నా యి. తద్వారా.. ప్రజల్లో కూటమి పార్టీలపై చులకన భావం పెరుగుతోందన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి పార్టీలకు సీట్ల సర్దుబాటు వ్యవహారం తలనొప్పిగా మారిన విషయం తెలిసిందే. స్థానిక ఎన్నికల్లో మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటు అయిపోయిందని అనుకున్నా.. తర్వాత టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన రెబల్స్ రంగంలోకి దిగి నామినేషన్ వేశారు. దీనిపై పార్టీలు మౌనంగా ఉన్నాయి. ఇక, తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వ్యవహారం తెరమీదకు వచ్చింది. వీటికి కూడా నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగిసిపోయింది. కానీ.. సీట్ల పంపకాల విషయం మాత్రం తెగలేదు. దీంతో పవన్ కల్యాణ్.. చంద్రబాబు పదే పదే కలుసుకోవడం.. సీట్ల సర్దుబాటుపై పవన్ అభ్యర్థించడం వంటివి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలుగా వస్తున్నాయి. అదేసమయంలో ప్రధాన మీడియాలోనూ ఇదే చర్చ సాగుతోంది. సహజంగానే కూటమి అన్నాక.. సీట్ల సర్దుబాటు అంత ఈజీకాకపోవచ్చు. అనుకున్నంత తేలిక కూడా కాదు. కానీ.. ఈ అంతర్గత విషయాలు సాధ్యమైనంత వరకు నాలుగు గోడల మధ్యే పరిష్కారం అయి.. ఇరు పక్షాలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత.. సంయుక్త మీడియా సమావేశం నిర్వహిస్తే.. అది విమర్శలకు తావిచ్చేది కాదు. కానీ, పదే పదే జనసేన అధినేత పవన్.. టీడీపీ అధినేతను కలుసుకున్నారని.. సీట్లపై చర్చించారని.. ఇంకా కొలిక్కి రాలేదని వార్తలు రావడంపై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక, జనసేన కోరుతున్న సీట్లు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా లేదన్న ప్రచారం కూడా మరోవైపు టీడీపీ వర్గాల నుంచే జరుగుతోంది. జనసేన నాయకులు కూడా అసంతృప్తితోనే ఉన్నారన్న వాదన బలపడుతోంది. దీనికి కారణం.. అంతర్గతంగా చర్చించి.. ఒక నిర్ణయానికి రావాల్సిన సీట్ల వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు లీకు చేయడమేనన్నది ఇరు పార్టీల్లోని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. ఇలా చేయడం వల్ల.. కూటమిపై చులకన భావం పెరుగుతుందని అంటున్నారు. సో.. ఈ విషయాన్ని ఇరు పార్టీలు గమనించి.. చర్చలను సాధ్యమైనంత వరకు రహస్యంగానే పూర్తి చేయడం మంచిదని అంటున్నారు.

పది రూపాయల చిల్లర కోసం గొడవ.. కండక్టర్‌ను బస్సులోంచి తోసేసిన మహిళ



చిల్లర విషయంలో మొదలైన చిన్న గొడవ కారణంగా ఓ ప్రయాణికురాలు మహిళా కండక్టర్‌ను బస్సులోంచి తోసేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బస్సులో ప్రయాణిస్తున్న మౌనిక, కండక్టర్ ప్రవల్లికల మధ్య చిల్లర విషయంలో వివాదం తలెత్తింది. మౌనిక తన కుమారుడి టికెట్ కోసం రూ. 100 ఇవ్వగా, కండక్టర్ రూ. 10 టికెట్ ఇచ్చి మిగతా చిల్లర కాసేపటి తర్వాత ఇస్తానని చెప్పింది.అయితే ఇందుకు మౌనిక ఒప్పుకోకుండా వెంటనే చిల్లర ఇవ్వాలని పట్టుబట్టింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఇద్దరూ ఒకరినొకరు నెట్టుకోవడంతో, కండక్టర్ ప్రవళిక ప్రమాదవశాత్తూ బస్సులోంచి కిందపడిపోయింది. అంతలోనే బస్సు వెనుక టైర్లు ఆమె కాళ్లపై నుంచి వెళ్లడంతో కండక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన తోటి ప్రయాణికులు 108 అంబులెన్స్ ద్వారా ఆమెను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రవళిక రెండు కాళ్లు నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ ఘటనలో తన తప్పేమీ లేదని, చిల్లర డబ్బుల విషయంలో కండక్టరే గొడవపడిందని, ఫుట్‌బోర్డు వద్ద నిలబడడం వల్లే ప్రమాదవశాత్తూ జారి పడిపోయిందని ప్రయాణికురాలు మౌనిక చెబుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

భార్య మరణాన్ని భరించలేక ఆమె వర్ధంతి రోజే భర్త ఆత్మహత్య



భార్య మరణాన్ని తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. భార్య చనిపోయిన తేదీ నాడే భర్త కూడా ప్రాణాలు తీసుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.వివరాల్లోకి వెళ్తే.. బాడిపేటకు చెందిన దూలి లక్ష్మణరావు, గౌరి అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ విశాఖపట్నంలోని మధురవాడలో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. కుటుంబంతో కలిసి సంతోషంగా సాగుతున్న లక్ష్మణరావు జీవితంలో అకస్మాత్తుగా విషాదం అలుముకుంది.సుమారు ఏడాది క్రితం లక్ష్మణరావు భార్య గౌరి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో లక్ష్మణరావు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. భార్యతో ఉన్న అనుబంధం, ఆమె లేని లోటు ఆయనను మానసికంగా కుంగదీశాయి. భార్య మరణించినప్పటి నుంచి తీవ్ర ఆవేదనతో ఉన్న లక్ష్మణరావు, సరిగ్గా ఆమె మృతి చెందిన తేదీ నాడే ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు.దీనికోసం స్వగ్రామానికి చేరుకున్న లక్ష్మణరావు, గ్రామస్తులతో కలిసి కొంతసేపు సరదాగా గడిపాడు. అనంతరం గంట్యాడ మండలం కొర్లాం సమీపంలోని నేలబావి వద్దకు వెళ్లి, అందులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులిద్దరూ దూరం కావడంతో ఆ చిన్నారి కుమార్తె పరిస్థితిని తలుచుకుని స్థానికులు కంటతడి పెడుతున్నారు. భార్య చనిపోయిన రోజునే భర్త కూడా ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని, చర్చనీయాంశాన్ని మిగిల్చింది.

ఓరీ దేవుడో.. బాల్కనీ నుంచి గుట్కా ఉమ్మితే 11,000 వోల్ట్స్ కరెంట్ తగిలి వ్యక్తి మృతి

ప్రపంచంలో ఎన్నో రకాల విచిత్ర ప్రమాదాలు జరుగుతుంటాయి. కానీ, ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం గుట్కా ఉమ్మివేయడం వల్ల ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఉదంతం మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసింది. ఈ విస్తుపోయే ఘటన మధ్యప్రదేశ్‌లోని విదిశ జిల్లాలో చోటుచేసుకుంది. 11,000 వోల్ట్ల హై-టెన్షన్ విద్యుత్ తీగ ప్రాణాలను హరించిన ఈ అనూహ్య ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.విదిశ జిల్లాకు చెందిన 65 ఏళ్ల ప్రభులాల్ గుప్తా అనే వ్యక్తి మేస్త్రీగా పనిచేస్తూ, స్థానికంగా ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సంఘటన జరిగిన రోజు అతను తన ఇంటి మూడో అంతస్తు బాల్కనీలో నిలబడి గుట్కా నములుతూ బయటకు ఉమ్మాడు. అయితే ఆ సమయంలో బాల్కనీకి అతి సమీపంగా వెళ్తున్న 11 కేవీ (11,000 వోల్టు) హై-టెన్షన్ విద్యుత్ తీగపైకి ఆ ఉమ్మి పడింది.ఎలక్ట్రికల్ నిపుణులు, శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం, ఉమ్మిలో తేమ, లవణాలు అధికంగా ఉంటాయి. ఇవి విద్యుత్‌ను సులభంగా ప్రసరింపజేస్తాయి. బాల్కనీకి హై-టెన్షన్ లైనంత దగ్గరగా ఉండటం వల్ల, ఉమ్మి ద్వారా ఏర్పడిన మార్గం గుండా విద్యుత్ ప్రవహించి కరెంట్ షాక్‌కు గురిచేసింది. ఈ ప్రమాదంలో ప్రభులాల్ గుప్తా తీవ్రమైన కాలిన గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు.

కిలో బియ్యం రూ.వంద, ఎకరం భూమి 99 పైసలు విశాఖలో వైసీపీ వినూత్న ప్రచారం

విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ ప్రచారం హీట్ పుట్టిస్తోంది. నిత్యావసరాల ధరల పెరుగుదలపై ప్రజలను చైతన్యం చేసేలా వైసీపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. బియ్యం ధర కిలో వంద రూపాయలకు చేరుకుందని అదే సమయంలో విశాఖ నగరంలో ఎకరం భూమిని 99 పైసలకే అప్పగిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి ఒక్కరికి అవసరమైన నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని చెప్పడమే కాకుండా ధనవంతులకు కారుచౌకగా భూములు అప్పగించేస్తుందని చాటడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా ప్రయత్నాలు చేస్తుండటం విమర్శకులను సైతం ఆకర్షిస్తోందని అంటున్నారు.పారిశ్రామిక పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న వైసీపీ.. ఈ అంశాన్ని ఎన్నికల అస్త్రంగా మలుచుకోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో నగరపాలక సంస్థను దక్కించుకునేలా విపక్షం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని అంటున్నారు.

ప్రధానంగా పేద, మధ్య తరగతి ఓటర్ల దృష్టిని ఆకర్షించడమే లక్ష్యంగా వైసీపీ వ్యూహాలు రచిస్తోందని అంటున్నారు. అందుకే స్థానిక సమస్యల కన్నా, ధరల పెరుగుదలను ప్రధాన అజెండాగా మార్చుకుందని అంటున్నారు. దీనివల్ల నేరుగా ప్రభుత్వాన్ని టార్గెట్ చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. అంతేకాకుండా ప్రజల సమస్యలకు తాము పట్టించుకుంటామని చెప్పుకుంటూ వారిలో సానుకూలత పెంచుకునే ఎత్తుగడను అమలు చేస్తోందని విశ్లేషిస్తున్నారు.

తిరిగి పుంజుకునే ప్రయత్నాలు

మున్సిపల్ ఎన్నికల్లో నిత్యావసరాల ధరలను ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తున్న విపక్షం.. ప్రజల మద్దతు పొందే అవకాశం ఉందా అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. గత ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విశాఖ నగరంపై వైసీపీ జెండా ఎగరేసింది. అయితే అంతకుముందు, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ నగరంలో ఒక్కసీటు కూడా వైసీపీ దక్కించుకోలేకపోయింది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో అయితే విశాఖ కార్పొరేషన్ పరిధిలో ఉన్న భీమిలి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు లక్ష ఓట్ల తేడాతో వైసీపీ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో నిత్యావసరాల సమస్యను మాత్రమే ప్రచారం చేసి గత ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని పూడ్చుకుని, తిరిగి అధికార పక్షంపై పైచేయి సాధించే అవకాశం ఉందా? అన్నదే ప్రధాన చర్చనీయాంశంగా మారింది.



పెట్టుబడులపై ప్రచారంతో లాభమేనా?

నిత్యావసరాల విషయంలో వైసీపీ ప్రచారాన్ని ప్రజలు నమ్మితే తమకు లాభం జరుగుతుందని వైసీపీ నేతలు భావిస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో పెట్టుబడుల వ్యతిరేక ప్రచారం వల్ల నష్టం జరగదా? అంటూ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. విశాఖ నగరాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అంటున్నారు. గూగుల్ డేటా సెంటర్ తోపాటు విశాఖను ఏఐ, ఐటీ హబ్ గా తీర్చిదిద్దే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయనే చర్చ ఎక్కువగా నడుస్తోంది. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను ఇప్పటికే ప్రారంభించాయి. దీనివల్ల నగర వాసులకు ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగాయనే టాక్ నడుస్తోంది. ఈ కారణంగా కంపెనీలకు భూములు ఇవ్వడాన్ని వైసీపీ తప్పుపట్టడాన్ని ప్రజలు స్వాగతిస్తారా? అన్నదే సందేహానికి కారణమవుతోందని చెబుతున్నారు. పెట్టుబడులు ఆకర్షించాలంటే పారిశ్రామిక సంస్థలకు భూములు ఇవ్వాల్సివుందని, ఏ ప్రభుత్వమైనా ఆ విధానం అమలు చేయకతప్పదని అంటున్నారు. మొత్తానికి వైసీపీ చేస్తున్న ప్రచారం సోషల్ మీడియాలో హాట్ డిబేట్ కు వేదిక అవుతోంది. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలు ఎలా ప్రభావితం అవుతారు అన్నదే ఇక్కడ ప్రధాన చర్చనీయాంశంగా ఉందని అంటున్నారు. ధరల పెరుగుదల అంశంపై ఎక్కువగా రియాక్ట్ అయితే వైసీపీకి అనుకూలంగా స్పందించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ఎల్ నినో కారణంగా దేశవ్యాప్తంగా ధరల పెరుగుదల ఉండటం వల్ల, స్థానిక ఎన్నికల్లో ఈ అంశం ప్రభావం చూపుతుందా? అన్నదే చూడాల్సివుందని వ్యాఖ్యానిస్తున్నారు.

టైగర్ ష్రాఫ్ దాడి కేసులో సంచలనం.. బిష్ణోయ్ గ్యాంగ్ అసలు టార్గెట్ ఆమిర్ ఖాన్



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై అక్టోబర్ 18న జరిగిన కాల్పుల ఘటన కేసులో దర్యాప్తు కొనసాగుతుండగా, విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడికి అసలు లక్ష్యం టైగర్ ష్రాఫ్ కాదని, ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ అని పోలీసు వర్గాలు వెల్లడించాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్న షూటర్లు మొదట ఆమిర్‌పై దాడికి పక్కా ప్రణాళికతో ముంబైకి వచ్చినట్లు విచారణలో తేలింది. ఈ వార్త బాలీవుడ్‌లో తీవ్ర కలకలం రేపుతోంది.పోలీసు వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. హర్యానాకు చెందిన ఇద్దరు షూటర్లు సెప్టెంబర్ 20వ తేదీకే ముంబైకి చేరుకున్నారు. ఆ తర్వాత పలుమార్లు ఆమిర్ ఖాన్ నివాసం వద్ద రెక్కీ నిర్వహించి, ఆయన కదలికలను గమనించారు. అయితే, ఆమిర్ ఖాన్ ఎక్కువగా ఇంటికే పరిమితం కావడం లేదా పని నిమిత్తం నగరం బయట ఉండటంతో ఆయనపై దాడి చేయడం కష్టమని షూటర్లు భావించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ ప్రణాళికను మార్చుకున్నట్లు తెలుస్తోంది.ఈ దాడి ప్రణాళిక వెనుక ఉన్న కారణాలను కూడా పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది జులైలో గౌరీ స్ప్రాట్‌ను ఆమిర్ ఖాన్ వివాహం చేసుకున్న తర్వాత, అతనికి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో కొన్ని సోషల్ మీడియా పోస్టులు, వాయిస్ నోట్లు అప్పట్లో వైరల్ అయ్యాయి. ఆమిర్ ఖాన్ 'లవ్ జిహాద్'ను ప్రోత్సహిస్తున్నారని ఆ పోస్టులలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ బెదిరింపులు నిజమైనవేనని అప్పట్లో ముంబై పోలీసులు కూడా ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలోనే ఆమిర్‌పై దాడికి కుట్ర జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.ఆమిర్ ఖాన్ టార్గెట్‌గా విఫలమవ్వడంతో దుండగులు తమ దృష్టిని టైగర్ ష్రాఫ్‌పైకి మళ్లించారు. టైగర్ తరచుగా ఒక పబ్లిక్ ప్రదేశంలో కనిపిస్తుండటంతో అతడిని లక్ష్యంగా చేసుకోవడం సులభమని భావించి దాడికి యత్నించారు. ఇదే గ్యాంగ్ చాలా కాలంగా సల్మాన్ ఖాన్‌ను కూడా టార్గెట్ చేస్తున్నప్పటికీ, ఆయనకు ఉన్న కట్టుదిట్టమైన భద్రత కారణంగా వారి ప్రయత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం ఈ కేసులో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, పూర్తినెట్‌వర్క్‌ను ఛేదించేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

పండుగపూట.. బావపై దాడి చేసి మర్మాంగాలను కొరికేసిన మహిళ

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో కుటుంబ కలహం తీవ్ర ఘర్షణకు దారితీసింది. మేనల్లుడు ఇంట్లో భోజనం చేయడంపై తలెత్తిన వివాదం చివరకు దాడి వరకు వెళ్లింది. ఈ క్రమంలో తన బావపై మహిళ దాడి చేయడమే కాకుండా, అతడి జననాంగాలపై కొరికింది. గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలుడు భోజనం చేయడంపై మొదలైన వివాదం

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా సజేతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘురౌపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం (అక్టోబర్ 23) సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో రజనీష్ ఇంట్లో అతడి సోదరుడు పుష్పరాజ్ కుమారుడు రేహాంష్ భోజనం చేస్తున్నాడు. ఈ విషయం బాలుడి తల్లి గాయత్రికి ఆగ్రహం తెప్పించింది. ఆమె బాలుడిని తీవ్రంగా కొట్టడం ప్రారంభించింది. దీనిపై రజనీష్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. కొద్దిసేపటికే వివాదం ముదిరి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది.

బావపై దాడి చేసిన యువతి

గొడవ సమయంలో గాయత్రి తనపై దాడి చేసిందని రజనీష్ ఆరోపించాడు. ఈ క్రమంలో తన కింది దుస్తులు జారిపోగా, ఆమె తన జననాంగాలపై కొరికిందని తెలిపాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా, పరిస్థితి మెరుగుపడిన అనంతరం శనివారం డిశ్చార్జ్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అంతేకాకుండా, వాగ్వాదం సమయంలో గాయత్రి కత్తితో తన భర్తపై దాడి చేయడానికి ప్రయత్నించిందని రజనీష్ భార్య సుమన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు.



గతంలోనూ కుటుంబ కలహాలు?

ఈ కుటుంబంలో గతంలోనూ విభేదాలు ఉన్నట్లు కుటుంబ పెద్ద రామ్ స్వరూప్ పేర్కొన్నారు. మనవడు కుటుంబ సభ్యులను కలవడానికి వచ్చినప్పుడు అతడిని కొట్టడం, ఇతరులతో కలవకుండా అడ్డుకోవడం జరిగేవని ఆయన ఆరోపించాడు. మహానవమి సందర్భంగా కూడా ఇలాంటి వివాదం తలెత్తగా కుటుంబ సభ్యులు జోక్యం చేసుకుని పరిస్థితిని సర్దిచెప్పినట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు.. నిందితురాలి కోసం గాలింపు

బాధితుడి భార్య ఫిర్యాదు ఆధారంగా సజేతి పోలీసులు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహానికి దారితీసిన పరిస్థితులు, దానికి సంబంధించిన ఆరోపణలపై పోలీసులు మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయ్యాకే ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

తల్లి సంబంధాన్ని ప్రశ్నించిన కన్నకొడుకు .. కత్తి దాడిలో 21 ఏళ్ల యువకుడు మృతి



హైదరాబాద్ పాతబస్తీలో 21 ఏళ్ల యువకుడి హత్య కలకలం రేపింది. తల్లి మనీషాతో భగత్ సింగ్‌కు ఉన్న సంబంధాన్ని మధుర్ సింగ్ వ్యతిరేకించడమే ఈ దారుణానికి కారణమా? లేక ఆస్తి వివాదం కూడా హత్యకు దారితీసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి బంధువులు చేస్తున్న ఆరోపణలతో ఈ కేసులో కొత్త కోణాలు తెరపైకి వచ్చాయి.హైదరాబాద్ పాతబస్తీలోని హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 24న ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మధుర్ సింగ్ తల్లి మనీషాతో భగత్ సింగ్‌కు సన్నిహిత సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మధుర్ తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తగా, అది ఘర్షణకు దారితీసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో భగత్ సింగ్ కత్తితో మధుర్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని కుటుంబ సభ్యులు, స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు మధుర్ ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

ఆస్తి కోసమే హత్య చేశాడా?

మధుర్ సింగ్ మృతిపై అతడి బంధువులు పలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. భగత్ సింగ్ మనీషాను వివాహం చేసుకున్నాడని, ఈ విషయం తమకు ఇటీవలే తెలిసిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఆస్తిని తన పేరు మీద రాయాలని మనీషాపై భగత్ సింగ్ ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపిస్తున్నారు. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకుని, ఆమె కుమారుడిని హత్య చేశాడని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆస్తి వివాదమే హత్యకు కారణమన్న విషయానికి ఇంకా అధికారిక నిర్ధారణ లేదు. తల్లితో సంబంధాన్ని ప్రశ్నించడంతో జరిగిన ఘర్షణకు, ఆస్తి వివాదానికి మధ్య ఏదైనా సంబంధం ఉందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

పోలీసుల దర్యాప్తులో తేలాల్సిన నిజాలు

21 ఏళ్ల వయసులోనే మధుర్ సింగ్ ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుడితో గతంలో ఏవైనా విభేదాలు ఉన్నాయా, ఆస్తి విషయంలో ఒత్తిళ్లు వచ్చాయా అనే అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. హుస్సేనీ ఆలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బంధువుల ఆరోపణలతో పాటు హత్యకు దారితీసిన అసలు కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసులో పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

Scanned with OKEN Scanner

రూ.5 కోట్ల లంచం తీసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్..

సంచుల నిండా నోట్ల కట్టలు.. లెక్కింపు వీడియో వెలుగులోకి



ఓ ప్రైవేట్ ఆస్పత్రి భాగస్వాముల మధ్య వివాదానికి సంబంధించి పోలీస్ అధికారి ఏకంగా రూ.5 కోట్లు లంచం తీసుకున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళనాడులోని తంజావూరులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సుకుమారన్ అనే పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాజాగా, ఆయన సమక్షంలో నగదు లావాదేవీలు జరుగుతున్న వీడియో బయటకు వచ్చింది. దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వారి ఆదేశాల మేరకే సుకుమారన్ సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం.వివరాల్లోకి వెళ్తే.. తంజావూర్‌లోని రగుమాన్ నగర్‌కు చెందిన శరవణన్.. కొంత మందితో కలిసి హాస్పిటల్ పెట్టారు. భాగస్వాముల మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం చెలరేగింది. దీనిపై ఐజీకి ఇరువర్గాలు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు శరవణన్‌తో పాటు మరి కొందరిపై కేసు నమోదుచేశారు. ఈ క్రమంలోనే కేసును సీబీసీఐడీకి బదిలీ చేయగా.. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని శరవణన్ ఆరోపించారు. అంతేకాదు, ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.5 కోట్ల డిమాండ్ చేశారని క్రైమ్ బ్రాంచ్‌కి ఫిర్యాదు చేశాడు.నగదు రూపంలో రూ.3.75 కోట్లు, మిగతా రూ.1.70 కోట్లకు చెక్కును సుకుమారన్‌కు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుతో పోలీస్ అధికారి నివాసంలో సీబీసీఐడీ అక్టోబరు 10న సోదాలు నిర్వహించి కీలక పత్రాలు, వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు జిల్లా పోలీస్ సీబీసీఐడీ అధికారి సుకుమారన్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా, దీనికి సంబంధించిన వీడియో బయటకు రావడంతో కేసు బిగుసుకుంది. వీడియోలో టేబుల్‌పై పేర్చిన నోట్ల కట్టలు ఉండగా.. కుర్చిలో ఓ వ్యక్తి కూర్చున్నాడు. ఓ మహిళ సహా ముగ్గురు ఒకవైపున.. ఇంకోవైపున ముగ్గురు నిలబడి ఉన్నారు. వీరిలో ఒకరు టేబుల్‌పై నోట్ల కట్టను లెక్కిస్తుండటం వీడియోలో రికార్డయ్యింది. అయితే, నోట్ల కట్టలు ఉన్న సంచులను ఒకరు తమ మొబైల్ ఫోన్‌లో వీడియో తీయడం కూడా ఉంది.

విస్తరిస్తున్న ఏఐ.. రాబోయే 20 ఏళ్లు గందరగోళం.. బిల్ గేట్స్ సంచలన వ్యాఖ్యలు



ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గణనీయంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి రంగంలోనూ ఏఐ క్రమంగా విస్తరిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్, బిలియనీర్, మానవతావాది బిల్ గేట్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న 20 ఏళ్లలో ఏఐ ద్వారా ఉద్యోగాల్లో భారీ మార్పులు రాబోతున్నాయని అంచనా వేశారు. ఏఐ మరింత సమృద్ధిగా అందరికీ అందుబాటులోకి రానుందని తెలిపారు. కానీ దీనివల్ల వర్కర్లు, అలాగే సమాజానికి చాలా ప్రమాదకరం అని పేర్కొన్నారు. ఈ పరివర్తన పీరియడ్ లో ఉద్యోగులు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కుంటారని స్పష్టం చేశారు. ఈ కాలం అత్యంత గందరగోళంగా ఉంటుందని బిల్ గేట్స్ అంచనా వేశారు. డికోడర్ అనే పాడ్ కాస్ట్ లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు బిల్ గేట్స్. ఈ ఏఐ పరివర్తన కారణంగా కొంతమంది విజేతలుగా.. మరికొంతమంది ఫెయిల్యూర్స్ గా మిగిలిపోతారని బిల్ గేట్స్ అంచనా వేశారు. వ్యాపారం రంగంలో ఏఐ వినియోగం గణనీయంగా పెరగడం కారణంగా అనేక మంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటారని స్పష్టం చేశారు. రోబోలు అందుబాటులోకి వస్తే వర్కర్లపై ఆధారపడటం తగ్గుతుందని డీకోడర్ పాడ్ కాస్ట్ లో బిల్ గేట్స్ తెలిపారు. మరోవైపు ఆఫీస్ నుంచి చేసే ఉద్యోగాలపై బిల్ గేట్స్ అందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో టెలిఫోన్ సేల్స్, కస్టమర్ సపోర్ట్ అలాగే అకౌంటింగ్ వంటి ఉద్యోగాలు ఏఐ కారణంతో కనుమరుగవుతాయని పేర్కొన్నారు. ఎందుకంటే మానవుల కంటే ఏఐ ఈ పనులను అత్యంత వేగంగా చేస్తుందని బిల్ గేట్స్ స్పష్టం చేశారు. అలాగే తక్కువ ఖర్చు.. కచ్చితత్వంతో ఈ పనులను ఏఐ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే మానవులు చేయగలిగే అనేక పనులను ఏఐ సమర్థవంతంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. వాటిలో కస్టమర్స్ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం.. మేనేజింగ్ సపోర్ట్ రిక్వెస్ట్ లు.. అలాగే ప్రాసెసింగ్ ఫైనాన్షియల్ సమాచారం.. తదితర విభాగాల్లో ఏఐ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అలాగే రానున్న రోజుల్లో హ్యూమనాయిడ్ రోబోలు మానవులు చేసే ఫిజికల్ వర్క్ ను కూడా చేస్తాయని బిల్ గేట్స్ తెలిపారు. పెద్ద పెద్ద ఇండస్ట్రీస్ లో కార్మికులు చేతులతో చేసే పనిని రోబోలు సమర్థవంతంగా నిర్వహిస్తాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో రోబోలు ఇంటి నిర్మాణాలు, ఫుడ్ గ్రోయింగ్ తో పాటు సర్జరీలు కూడా చేస్తాయని తెలిపారు. మానవుల కంటే రోబోలు దాదాపు అన్ని పనులను సమర్థవంతంగా చేయడం అందోళన కలిగించే అంశంగా బిల్ గేట్స్ అభివర్ణించారు.

జెన్ జీ దెబ్బకు కుప్పకూలిన మరో ప్రభుత్వం...

పదేళ్ల పాలనకు ఎన్నికల్లో చరమగీతం

అవినీతి, బంధుప్రీతి, పక్షపాతం, అధికార దుర్వినియోగం, అక్రమాలకు వ్యతిరేకంగా పలు దేశాల్లో జరుగుతున్న విద్యార్థుల ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వాలు వరుసగా కుప్పకూలుతున్నాయి. ఇప్పటికే మన పొరుగునే ఉన్న బంగ్లాదేశ్, నేపాల్ వంటి చోట్ల ప్రభుత్వాలను జెన్ జీ విద్యార్థులే కుప్పకూల్చారు. ఈ రెండు దేశాల్లోనూ విద్యార్థి నిరసనలు చోటు చేసుకోవడం, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వాలు కుప్పకూలడం చూశాం. ఇప్పుడు ఐరోపా దేశమైన సెర్బియాలో (గ్రావతీఎఱు) అయితే ఏకంగా నిరసనలతో మొదలైన విద్యార్థుల పోరు.. ఎన్నికల్లో పోటీ చేసి దశాబ్దకాలంగా పాలిస్తున్న నియంత సర్కార్ ను కుప్పకూల్చింది.సెర్బియా పార్లమెంట్ ఎన్నికల్లో తీవ్ర సంచలనం నమోదైంది. దాదాపు దశాబ్ద కాలంగా ఆ దేశ రాజకీయాలపై బలమైన ఆధిపత్యం చెలాయించిన అధ్యక్షుడు అలెక్సాండర్ వుచిచ్ తన ఓటమిని అధికారికంగా అంగీకరించారు. అక్కడ యువత, విద్యార్థుల మద్దతుతో బరిలోకి దిగిన 'స్టూడెంట్ లిస్ట్' కూటమి చారిత్రాత్మక విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ ఫలితంతో తూర్పు ఐరోపా రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాగా, సుదీర్ఘ కాలం పోరాడిన విద్యార్థులు ఇప్పుడు అక్కడ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.2024లో నోవి సాడ్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం కూలిచేత ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో సెర్బియాలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు తీవ్రమయ్యాయి. పాలనలో పెరిగిపోయిన అవినీతి, పారదర్శకత లేకపోవడంపై యువత సుదీర్ఘకాలం నిరసనలు తెలిపింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 250 స్థానాలున్న పార్లమెంట్‌లో విద్యార్థుల కూటమి 135 నుంచి 140 స్థానాలు దక్కించుకోగా, వుచిచ్‌కు చెందిన సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీ కేవలం 105 స్థానాలకే పరిమితమైంది. విద్యార్థుల ఈ అనూహ్య గెలుపు కేవలం సెర్బియాకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా యువజన శక్తులు సాధిస్తున్న పురోగతికి అద్దం పడుతోందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటికే ఐరోపాలోని ఫ్రాన్స్, ఇటలీ, అల్బేనియా వంటి ఐరోపా దేశాల్లోనూ విద్యార్థులు విద్యా నిధుల కోత, పెరిగిన జీవన వ్యయం, పాలనాపరమైన అవినీతికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి భారీ స్థాయిలో నిరసనలు చేపట్టారు. ఇటలీలో పాఠశాల నిబంధనలపై, ఫ్రాన్స్‌లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమిపై యువత తీవ్ర స్థాయిలో గళమెత్తింది.భారత్ లోనూ నీట్ అక్రమాలు, ఆ తర్వాత ఎన్ఐఆర్, ఎన్నికల అక్రమాలపై విద్యార్థులు ఢిల్లీలో అందోళనలు చేపడుతున్న తరుణంలో వెలువడిన ఈ ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తమిళనాడులో ప్రతి ఇంటర్ స్టూడెంట్ కూ ఓ 'హీరో' సైకిల్, హెల్మెట్ : సీఎం విజయ్



తమిళనాడులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం అమలు చేయనున్న ఉచిత సైకిళ్ల పంపిణీ పథకంలో ముందడుగు పడింది. 2026-27 విద్యా సంవత్సరానికి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అత్యాధునిక సైకిళ్లను సరఫరా చేసే కాంట్రాక్ట్ ను ప్రముఖ సంస్థ హీరో సైకిల్స్ దక్కించుకుంది. ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో అత్యల్ప ధరను కోట్ చేసి, ఎల్1 గా నిలిచింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. దీని కింద మొత్తం 5,32,388 మంది పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందజేయనున్నారు ముఖ్యమంత్రి విజయ్. బాలుర సైకిల్ ధరను ఒక్కొక్కటి రూ. 7,235 గా కోట్ చేసిందా సంస్థ. బాలికల సైకిల్ ధరను రూ. 7,476 గా నిర్ణయించింది. బిడ్డింగ్ దాఖలు చేసిన ఇతర కంపెనీలతో పోల్చుకుంటే హీరో సైకిల్స్.. ఎల్1 నిలవడంతో ఆ సంస్థను ఖరారు చేసింది. వీటిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం మొత్తం రూ. 392 కోట్ల వ్యయం చేయనుంది. ఇందులో ప్రభుత్వం ఇప్పటికే రూ. 277 కోట్లను కేటాయించింది గానీ.. వర్క్ ఆర్డర్ ఇంకా జారీ కావాల్సి ఉంది. టెండర్ ఖరారు కావడంతో ఒకట్రెండు రోజుల్లో వర్క్ ఆర్డర్ వెలువడొచ్చు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సైకిళ్లను ఐఎస్ 10613:2023 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా హీరో సైకిల్స్ సంస్థ తయారు చేయాల్సి ఉంటుంది. సైకిల్ ఫ్రేమ్, హ్యాండిల్ బార్, క్యారియర్, ఫోర్క్ నిర్మాణంలో ఈఆర్‌డబ్ల్యూ స్టీల్ పైపులను ఉపయోగించాల్సి ఉంటుంది. సైకిల్ విడిభాగాలను వేరే సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్ కాంట్రాక్ట్ ఇవ్వకూడదని టెండర్ నిబంధనల్లో పేర్కొంది ప్రభుత్వం. వాటన్నింటినీ కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సొంతంగానే తయారు చేయాలని సూచించింది. విద్యార్థుల కోసం లైలాక్ మిస్ట్, ఆర్మీ గ్రీన్ రంగులలో వీటిని ఆకర్షణీయంగా తయారు చేస్తారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సైకిళ్లతో పాటు బీఐఎస్ సర్టిఫికేషన్ హెల్మెట్, మంచినీటి బాటిల్ ను ఉచితంగా పంపిణీ చేస్తారు. ప్రమాదాలను నివారించడానికి, నకిలీ ఉత్పత్తులను నిరోధించడానికి తమిళనాడు ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని లేజర్ టెక్నాలజీ ద్వారా సైకిల్ ఫ్రేమ్‌పై ముద్రిస్తారు. అవి శాశ్వతంగా ఉండిపోతాయి. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 4,500 పాఠశాలలకు సైకిళ్ల నిర్వహణ కోసం రెండు టూల్ కిట్లను కూడా ప్రభుత్వం సరఫరా చేయనుంది. పంపిణీ చేసిన 30 రోజుల్లోగా ఏమైనా సాంకేతిక లోపాలు గుర్తిస్తే, సంబంధిత సరఫరాదారుల సర్వీస్ సిబ్బంది వెంటనే ఉచితంగా మరమ్మతులు చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పథకం కోసం అర్హులైన విద్యార్థుల్లో 2,37,133 మంది బాలురు, 2,95,255 మంది బాలికలు ఉన్నారు. వర్క్ ఆర్డర్ అందిన నాటి నుంచి 150 రోజుల్లోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని నిబంధన ఉంది.

కొలీజియంకు ముందే కేంద్రం నుంచి ఆమోదం

ఇది తప్పుడు సంకేతమేనని విమర్శ...న్యాయ నియామకాలకు సంబంధించి మాజీ సీజేఐ చంద్రచూడ్‌పై జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వ్యాఖ్యలు..'వితవుట్ ఫియర్ ఆర్ ఫేవర్' పుస్తకంలో ప్రస్తావన



న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్ తన అంచనాలకు అనుగుణంగా వ్యవహరించలేదని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు. ది వైర్ కోసం శనివారం కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల 'వితవుట్ ఫియర్ ఆర్ ఫేవర్' పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని జస్టిస్ కౌల్ ప్రచురించారు. సీజేఐ చంద్రచూడ్ పదవీకాలంలో కౌల్ సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు.ఆ కాలానికి సంబంధించిన పలు కీలక విషయాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. తన పుస్తకంలో జస్టిస్ కౌల్ పేర్కొన్న వివరాల ప్రకారం.. ఒక సందర్భంలో సుప్రీంకోర్టు కొలీజియం సమావేశం జరుగకముందే అప్పటి సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రభుత్వం నుంచి 'ఆమోదం' కోరారు. మరో సందర్భంలో మైనారిటీ మతానికి చెందిన న్యాయమూర్తి అభ్యర్థి కులం ఏమిటని ప్రభుత్వం వేసిన 'వింతైన' ప్రశ్నను కూడా ఆయన ప్రస్తావించారు. ఇద్దరు అగ్ర న్యాయమూర్తుల మధ్య తరచూ విభేదాలు ఎందుకు వచ్చాయని అడిగినప్పుడు, సీజేఐ నుంచి తాను ఎక్కువ ఆశించానని జస్టిస్ కౌల్ తెలిపారు. 'సంప్రదింపులు జరుపడం వేరు, నేను 'ముందస్తు ఆమోదం'గా భావించినది వేరు.అంటే కొలీజియం అధికారికంగా చర్చించకముందే ప్రభుత్వ అనుమతి కోరడం. ఇది తప్పుడు సంకేతాన్ని పంపుతుంది. రాజకీయ వర్గాలకు మీరు తలుపులో చిన్న అవకాశం ఇచ్చినా, వారు తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తారు. ఇది ఏ విధంగానూ రాజకీయ పక్షపాతానికి సంబంధించిన విషయం కాదు. అధికార సంబంధాల సహజ స్వభావానికి సంబంధించిన అంశం మాత్రమే' అని ఆయన రాశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కొలీజియంలో జరిగిన చర్చల గురించి కూడా జస్టిస్ కౌల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఐదుగురు న్యాయమూర్తుల పేర్లపై కొలీజియం అంగీకారానికి వచ్చినప్పటికీ, చివరి నిమిషంలో ప్రతిపాదించిన ఆరో పేరును కూడా చేర్చాలని సీజేఐ కోరారని ఆయన తెలిపారు.అయితే, ఆ ప్రతిపాదనకు తాను లేదా కొలీజియంలోని ఇతర సభ్యులు అంగీకరించలేదని చెప్పారు. 'ఆరో పేరు సహా మిగిలిన పేర్లకు సంబంధించి ఆయన అప్పటికే ప్రభుత్వంతో ఏదో ఒక రకమైన ఆమోదం తీసుకుని ఉండవచ్చు' అని జస్టిస్ కౌల్ అన్నారు. 'దురదృష్టవశాత్తు, పేర్లను ముందుగానే చర్చించడం, ప్రభుత్వంతో ఒక రకమైన ముందస్తు సంప్రదింపులు జరుపడం ఇప్పుడు ఒక పద్ధతిగా మారింది. గతంలో కూడా ఇది జరిగేది. చంద్రచూడ్‌కు ముందు కూడా, ఆయన తర్వాత కూడా ఇది జరుగుతున్నదని నేను భావిస్తున్నాను. అందుకే ఈ విషయం నన్ను కలవరపెడుతున్నది' అని ఆయన అన్నారు. 2015లో జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను రద్దు చేసిన అంశంపై అన ఆభిప్రాయాన్ని కూడా ఆయన పుస్తకంలో వెల్లడించారు. ఆ కమిషన్‌కు పనిచేసే అవకాశం ఇచ్చి ఉండాల్సిందని తాను భావించినట్టు రాశారు.

టీడీపీ, ఆరెస్సెస్,కాంగ్రెస్ సంకీర్ణ సర్కారిది

రేవంత్‌కు సరెండర్

హైదరాబాద్ : ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్నది అసలు కాంగ్రెస్ పార్టీ కాదని.. టీడీపీ, ఆరెస్సెస్ కాంగ్రెస్ అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భగ్గవ్ దేశ్‌పాండే దుమ్మెత్తిపోశారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. భగ్గవ్‌కు కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భగ్గవ్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాను 2006 నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నానని, అయితే అప్పటి కాంగ్రెస్‌కు, ఇప్పటి కాంగ్రెస్‌కు ఎంతో తేడా ఉన్నదని వ్యాఖ్యానించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు పూర్తిగా రేవంత్‌రెడ్డికి సరెండర్ అయ్యారని భగ్గవ్ దేశ్‌పాండే విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ చెప్పే మాటలకు, తెలంగాణలో కొనసాగుతున్న పాలనకు పూర్తి విరుద్ధంగా ఉన్నదని మండిపడ్డారు.

'ఇది అసలు కాంగ్రెస్ కాదు.. తెలుగుదేశం, ఆరెస్సెస్ భావజాలంతో నడుస్తున్న కాంగ్రెస్.. లీవ్ కాంగ్రెస్.. సేవ్ తెలంగాణ' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జూదవ్, మాజీ ఎమ్మెల్యే బాల సుమన్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్నారు.

42 ఏళ్ల తర్వాత దళిత వాడలోకి దేవత రథం ..., మంత్రులే స్వయంగా తాళ్లు



సామాజిక అసమానతలను పటాపంచలు చేస్తూ, సమతా మమతల వేదికగా ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. తమిళనాడులోని చారిత్రక నగరం కాంచీపురం జిల్లా వాలాజాబాద్ సమీపంలోని పుత్తగరం గ్రామంలో ఏకంగా 42 ఏళ్ల తర్వాత గ్రామ దేవత రథం దళితుల నివాస ప్రాంతంలోకి అడుగుపెట్టింది. స్థానిక అరుళ్‌మిగు శ్రీ ముత్తు కొలక్కి అమ్మవారి ఆలయ రథోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రయోగాత్మక రథయాత్ర (ట్రయల్ రన్) స్థానిక దళిత వాడ గుండా అత్యంత వైభవంగా సాగింది. దశాబ్దాలుగా వేచి చూసిన ఈ చారిత్రాత్మక ఘట్టంతో ఆ ప్రాంతంలో ఆనందోత్సాహాలు విరబూసాయి.

వివాదాలు, కోర్టు తీర్పుల దాటి ముందుకు కదిలిన రథం

ఈ రథయాత్ర వెనుక పెద్ద పోరాటమే ఉంది. అమ్మవారి రథం తమ వీధుల గుండా కూడా వెళ్లాలని దళిత వర్గానికి చెందిన ప్రజలు చాన్నాళ్లుగా కోరుతున్నారు. అయితే గ్రామాల్లోని కొందరు దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంతో రథం వెళ్లే మార్గంపై వివాదం నెలకొంది. ఈ క్రమంలో పసరై సెల్వరాజ్ అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. రథాన్ని దళిత వాడలోకి కూడా అనుమతించాలని సంచలన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రకరకాల కారణాల వల్ల ఇన్నాళ్లూ రథోత్సవం నిలిచిపోయింది. తాజాగా జిల్లా యంత్రాంగం చొరవతో మళ్లీ చక్రాలు ముందుకు కదిలాయి.

మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం.. భారీ పోలీస్ భద్రత

జిల్లా పరిపాలనాధికారుల పర్యవేక్షణలో ఆదివారం ఈ ప్రయోగాత్మక రథయాత్రను అట్టహాసంగా ప్రారంభించారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి తంగం తెన్నరసు, అటవీ శాఖ మంత్రి రంజిత్ కుమార్ స్వయంగా పాల్గొని రథం తాళ్లను లాగి ఈ రథయాత్రను ప్రారంభించారు. ఊరిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ అరవిందన్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నలుగురు డిఎస్పీలు, ఇద్దరు ఏఎస్పీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో రథం గ్రామంలోని అన్ని వీధుల గుండా సురక్షితంగా సాగి ఆలయానికి చేరుకుంది.

చెండా మేళాలు, దివ్య దీపారాధనలతో ఘన స్వాగతం

సుదీర్ఘమైన 42 ఏళ్ల నిరీక్షణ తర్వాత తమ గడప ముందుకు వచ్చిన అమ్మవారి రథాన్ని చూసి దళితవాడ ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. చెండా మేళాలు, దప్పుల వాయిద్యాలు, మంగళ వాయిద్యాల మోతలతో గ్రామం సంతోషంలో మునిగిపోయింది. గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, దివ్య దీపారాధనలు సమర్పించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ రథం తాడు పట్టుకుని లాగుతూ ఆధ్యాత్మిక పండగను జరుపుకున్నారు. ఈ ఘటన తమిళనాడు సామాజిక చరిత్రలో ఒక గొప్ప మార్పుగా నిలిచిపోనుంది.

తెలంగాణలో వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేశముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

ప్రభుత్వానికి సవాల్.. వినియోగదారులపై భారం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది."వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

Scanned with OKEN Scanner

ప్రధాని మోడీ చుట్టూ నిమ్మకాయలు.. మేకులు.. రంగంలోకి పోలీసులు.. ఏం జరిగింది..

అది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. మౌ జిల్లా.. సరయు నది.. ఆ నది ఒడ్డున దేశ ప్రధాన మోడీ ఫోటో ఉంది. మామూలుగా అయితే ఎవరికి ఎటువంటి అనుమానం వచ్చేది కాదు. కానీ ఆ ఫోటో చుట్టూ నిమ్మకాయలు ఉన్నాయి. కొబ్బరికాయలు కూడా ఉన్నాయి. మేకులు కూడా కనిపించాయి. అసలు ఇలా ఎందుకు ఏర్పాటు చేశారు.. ఎందుకు ఏర్పాటు చేశారు.. దీని వెనక ఏముంది.. అసలు ఏం జరిగింది.. అనే కారణాలను ఆరా తీస్తే దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూశాయి.బీజెపి అధికారంలో ఉన్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో తాంత్రిక పూజలకు.. క్షుద్ర పూజలకు కొదవ ఉండదు. ఎందుకంటే ఇక్కడ కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా క్షుద్ర పూజలు చేస్తుంటారు. వీటివల్ల అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయా.. ప్రయోజనాలు సొంతమవుతాయా.. అనే విషయాలను పక్కన పెడితే ఈ ప్రాంతాలలో క్షుద్ర పూజలు చేయడం ఆనాదిగా వస్తోంది.తాజాగా ఇక్కడ కొంతమంది వ్యక్తులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకొని ఆ తరహా వ్యవహారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఏకంగా సరయు నది ఒడ్డున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటుచేసి.. దాని చుట్టూ కొబ్బరికాయలు ఉంచారు. నిమ్మకాయలు



కోసిపెట్టారు. ప్రత్యేకంగా మేకులు తయారుచేసి.. నరేంద్ర మోడీ ఫోటో చుట్టూ కొట్టారు. పసుపు కుంకుమ..ఇంకా కొన్ని పదర్థాలను అక్కడ ఉంచారు. చూసేందుకు ఆ ప్రాంతం భయానకంగా ఉందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.దీనికి సంబంధించిన సమాచారం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ప్రధాన మీడియాలో విస్తృతంగా చర్చలోకి వచ్చింది. దీంతో ఉత్తర ప్రదేశ్ పోలీసులు రంగంలోకి దిగారు.. కేసు నమోదు చేశారు. అయితే ఈ పూజలు ఎవరు చేశారు? దాని వెనుక ఎవరున్నారు? అనే కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారం పట్ల ఆమ్ ఆద్మీ పార్టీ స్పందించింది. ఉత్తర ప్రదేశ్ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణను పక్కన పెట్టారని.. క్షుద్ర పూజలు చేసేవారిని పట్టుకునే పనిలో బిజీగా ఉన్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. నేటి కాలంలో ఇటువంటి వాటికి ఆస్కారం ఉంటుందా.. అసలు క్షుద్ర పూజలను ఎవరైనా నమ్ముతారా అంటూ ఆప్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేసింది. ఈ ఘటనపై బీజేపీ నాయకులు స్పందించారు. నరేంద్ర మోడీకి దేవతల ఆశీర్వచన బలం ఉందని.. ఆయనను ఇటువంటి క్షుద్ర పూజలు ఏనీ చేయలేవని వారు చెబుతున్నారు.

త్రిష రోడ్ షో- షాప్ ఓపెనింగా? పొలిటికల్ ఎంట్రీకి ట్రైలరా?

సినీ తారలు షాపింగ్ మాల్స్, మొబైల్ షోరూమ్‌ల ప్రారంభోత్సవాలకు రావడం మామూలే కానీ.. కోయంబత్తూరు వీధుల్లో సౌత్ క్వీన్ త్రిష సృష్టించిన సునామీ మాత్రం ఇటు కోలీవుడ్‌ను, అటు తమిళనాడు రాజకీయ వర్గాలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఒక చిన్న మొబైల్ షాప్ ఓపెనింగ్ కోసం వచ్చిన త్రిష, ఏకంగా ఒక బడా పొలిటికల్ లీడర్ రేంజ్‌లో కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి.. వేలాదిగా తరలివచ్చిన జనసందోహానికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ హంగామా చేసింది. ఎర్రటి కాటన్ చీరలో దేవతలా మెరిసిపోతూ ఆ నడిరోడ్డుపై ఆమె చేసిన మాస్ రోడ్ షో చూసి కంగారు పడటం కోయంబత్తూరు వాసుల వంతయింది.

ఇది షాప్ ఓపెనింగ్ కాదు.. పొలిటికల్ గిమిక్

ఈ రోడ్ షో వీడియోలు నెట్టింట ప్రత్యక్షమవ్వడమే ఆలస్యం.. తమిళనాడు సోషల్ మీడియా స్టీమ్ రేంజ్‌లో వేడెక్కిపోయింది. ఇది షాపింగ్ మాల్ ప్రమోషన్ లా లేదు.. ముమ్మాటికీ అంచెలంచెలుగా ప్లాన్ చేసిన పొలిటికల్ కల్ట్ స్ట్రాటజీలా ఉంది అంటూ ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో కామెంట్ల వర్షం కురుస్తోంది. మొబైల్ షాప్ ప్రారంభించడానికి వచ్చిన భామ, ఆ పనిని ఎలక్షన్ ర్యాలీగా మార్చేయడం వెనుక సాధారణమైన పబ్లిసిటీ మాత్రమే లేదని, ప్రజల్లో తనకున్న క్రేజ్‌ను చెక్ చేసుకోవడానికే ఈ స్థాయి పబ్లిక్ కనెక్ట్ షో ప్లాన్ చేసిందని గట్టి ప్రచారం



సాగుతోంది.

విజయ్ బాటలోనే త్రిష?

దళపతి విజయ్ పార్టీలో చేరి ఆమె కీలకపాత్ర పోషిస్తారన్న ప్రచారం జరుగుతోంది. తిరుచ్చి ఉపఎన్నిక ఇంకా జరగాల్సి ఉంది. ఆమె పేరు తరచూ ప్రచారంలోకి వస్తూనే ఉంది.తమిళనాడులో పురాతన కాలం నుంచి సినీ స్టార్లను నెత్తిన పెట్టుకుని రాజకీయాల్లో కిరీటాలు కట్టబెట్టే ఆచారం ఉంది కాబట్టి త్రిష ప్లాన్ కూడా అదేనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు.

జోరుగా పొలిటికల్ మీమ్స్

మరోవైపు, ఎరుపు రంగు శారీలో త్రిష మెరిసిన గ్లామరస్ లుక్స్, ఆమె కారు పైనుంచి అభిమానులకు ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి.రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేసే గ్లామర్ అండ్ మాస్ ఫాలోయింగ్ త్రిష సొంతం అంటూ ఫ్యాన్స్ హంగామా చేస్తుంటే.. మేడమ్ మైక్ పట్టుకోవడం ఖాయం" అంటూ మీమర్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. మొత్తానికి ఒక చిన్న షాప్ ఓపెనింగ్‌తో తమిళనాడు పొలిటికల్ అండ్ సినిమా సర్కిల్స్ రెండింటిలోనూ త్రిష పెట్టిన మంటలు త్వరలో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి!

ఐటీ కంపెనీల్లో కన్నడిగులకే ప్రాధాన్యం ఇవ్వాలి: డీకే శివకుమార్

బెంగళూరులోని ఐటీ సంస్థల్లో స్థానిక కన్నడిగులకు ఉద్యోగ అవకాశాలు లభించడం లేదనే ఫిర్యాదులపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తీవ్రంగా స్పందించారు.

ఐటీ కంపెనీలలో స్థానికులను పక్కన పెడుతున్నారనే అంశాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకలో కన్నడిగుడే సర్వాధికారి.. ఏ కారణం చేతనైనా కన్నడిగుల హక్కులు, ఆత్మగౌరవం, ఉద్యోగ అవకాశాలను కాలరాసే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదు అంటూ ఎక్స్ వేదికగా ఆయన చేసిన హెచ్చరికలు ప్రస్తుతం కన్నడ నాట హాట్ టాపిక్ అవుతోంది.

ప్రైవేట్ సంస్థలపై చర్యలకు హెచ్చరిక

బెంగళూరు నగరానికి లభించిన భారతదేశపు సాంకేతిక రాజధాని గుర్తింపు వెనుక స్థానిక కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యం , శ్రమ దాగి ఉన్నాయని డి.కె. శివకుమార్ కొనియాడారు.

ఐటీ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా మద్దతు ఇస్తున్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ సంస్థలు కావాలని కన్నడిగులను పక్కన పెడుతున్నట్లు తేలితే సదరు సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. కన్నడిగుల సంక్షేమం, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే తమ కాంగ్రెస్ ప్రభుత్వం వారి ప్రయోజనాలను కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పుకొచ్చారు.



రిజర్వేషన్ బిల్లు వివాదం

ఈ ట్వీట్ వ్యాఖ్యల వెనుక గత కొన్ని నెలలుగా కర్ణాటకను ఊపేస్తున్న స్థానిక ఉద్యోగాల రిజర్వేషన్ బిల్లు వివాదం ఉంది. ప్రైవేట్ పరిశ్రమల్లో సి-గ్రేడ్, డి-గ్రేడ్ ఉద్యోగాలలో 100%, మేనేజ్‌మెంట్ స్థాయి పోస్టుల్లో 50% నుంచి 70% వరకు స్థానిక కన్నడిగులకే రిజర్వ్ చేయాలని సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టం దుమారానికి దారితీసింది. నాస్కామ్ వంటి ఐటీ పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఈ నిర్ణయం వల్ల బెంగళూరు నుంచి పెట్టుబడులు, గ్లోబల్ టాలెంట్ ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని అందోళన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఆ బిల్లును తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టింది.

మళ్లీ తెరపైకి కన్నడ సెంటిమెంట్

ఐటీ కంపెనీల ఒత్తిడితో రిజర్వేషన్ బిల్లును పక్కన పెట్టారంటూ కన్నడ రక్షణ వేదిక వంటి స్థానిక సంఘాల నుంచి తీవ్ర నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, డి.కె. శివకుమార్ చేసిన ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఒకవైపు అంతర్జాతీయ స్థాయి ఐటీ హబ్‌గా బెంగళూరును నిలబెట్టుకుంటూనే, మరోవైపు కన్నడ ప్రాంతీయ భావోద్వేగాలను, స్థానిక ఉద్యోగావకాశాల నిరసనలను శాంతపరిచేందుకు కాంగ్రెస్ సర్కారు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాబోయే రోజుల్లో ఐటీ కంపెనీల నియామకాలపై ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు తీసుకోనుందోనని ఉత్కంఠ పారిశ్రామిక వర్గాల్లో నెలకొంది.

92 వేల ఉద్యోగాలు మాయం.. కుప్పకూలుతున్న భారత ఐటీ రంగం?

ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి ఐటీ ఉద్యోగం సాధిస్తే చాలు.. జీవితం స్థిరపడినట్లే అని భావించేవారు. ప్రతిష్ఠాత్మక సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రాంగణంలోకి అడుగుపెట్టడం.. చేతిలో ఆఫర్ లెటర్ పట్టుకోవడం ఎందరో యువతీ యువకుల, వారి తల్లిదండ్రుల నిశ్శబ్ద స్వప్నం. కానీ నేడు ఆ ఐటీ కలలపై అనిశ్చితి, అభద్రతా భావం నీడలు పరుస్తున్నాయి. ప్రముఖ ఐటీ దిగ్గజాల నుంచి దాదాపు 92 వేల మంది ఉద్యోగులు నిష్క్రమించారనే వార్త వినగానే సగటు టెక్ నిపుణుడి గుండెల్లో ఒక రకమైన ఆందోళన మొదలవుతోంది.

మారిన ఉద్యోగ స్వరూపం.. వెంటాడుతున్న ఆందోళన

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం వేగంగా పుంజుకుంటున్న తరుణంలో టెక్ ప్రపంచం తీవ్ర మార్పులకు గురవుతోంది. గతంలో గంటల తరబడి కష్టపడి పూర్తి చేసిన ప్రాథమిక కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డీబగ్గింగ్ వంటి పనులను నేడు ఏఐ టూల్స్ కంటిరెప్పపాటులో పూర్తి చేస్తున్నాయి. దీనికితోడు ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, అమెరికా, యూరప్ క్లయింట్ల వ్యయ నియంత్రణ, క్లౌడ్ ప్రాజెక్టులలో వస్తున్న జాప్యం ఐటీ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.ఈ 92 వేల మంది సంఖ్యలో కేవలం ఉద్యోగాలు కోల్పోయిన వారే కాకుండా,, స్వచ్ఛందంగా కంపెనీలు మారినవారు.. రాజీనామా చేసినవారు కూడా ఉన్నప్పటికీ.. "రేపు నా పరిస్థితి ఏమిటి?" అనే ప్రశ్న ప్రతి ఐటీ ఉద్యోగి మనస్సును తొలిచేస్తోంది. అమెరికాలో పనిచేస్తున్న మన భారతీయ టెక్ నిపుణులు కూడా పీసా నిబంధనలు, ఉద్యోగాల కోతలతో ఇబ్బందులు పడుతూ స్వదేశానికి తిరిగి రావలసి రావడం వారి ఆవేదనకు అద్దం పడుతోంది. క్వాల్‌కామ్ వంటి



అంతర్జాతీయ టెక్ దిగ్గజాల్లోనూ పునర్వ్యవస్థీకరణ పేరిట జరుగుతున్న పరిణామాలు ఈ భయాలను మరింత పెంచుతున్నాయి.

క్యాంపస్ కలల నుండి కఠిన వాస్తవంలోకి..

ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఫ్రెషర్స్ పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. సాధారణ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు ఉంటే సరిపోదని.. ఏఐ టూల్స్ వాడకం, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగం దక్కే పరిస్థితులు వచ్చాయి. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన చదువుకు, మారుతున్న ఐటీ అవసరాలకు మధ్య ఉన్న అంతరం యువతను నిరాశకు గురిచేస్తోంది.

ఐటీ రంగం కుప్పకూలుతోందా?

అయితే ఈ గణాంకాలను చూసి ఐటీ రంగం పూర్తిగా కుప్పకూలిపోతోందని భావించడం తొందరపాటే అవుతుంది. ఇది కేవలం ఉద్యోగాల తొలగింపు మాత్రమే కాదు.. ఐటీ రంగానికి సంబంధించిన ఒక పెద్ద 'రూపాంతరం'. పాత రకం ఉద్యోగాల అవసరం తగ్గుతున్నప్పటికీ.. ఏఐ మోడళ్ల అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి సరికొత్త విభాగాల్లో నూతన అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. గాలివాటాన్ని బట్టి దిశ మార్చుకునే నావలాగా.. ప్రస్తుత ఐటీ ఉద్యోగి కూడా మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడమేతో అనిశ్చితికి ఏకైక పరిష్కారం. ఎంతటి పెనుమార్పులైనా సరే... కొత్త నైపుణ్యాన్ని ఆయుధంగా మలచుకున్న రోజే టెక్ నిపుణుడు తన కలను మళ్లీ నిజం చేసుకోగలడు.

"మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే".. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్

ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. బీహార్ రాజధాని పాట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు ఖర్గే తీరును తీవ్రంగా ఖండించారు.బీహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సభలో ఖర్గే ప్రసంగిస్తుండగా, ప్రేక్షకుల మధ్యలో ఉన్న సంతోష్ సింగ్ అనే వ్యక్తి "మోదీ నహీ జాయేగా" (మోదీ అధికారంలోంచి దిగరు) అని గట్టిగా అరిచాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఖర్గే, "మోదీ కా బాప్ భీ జాయేగా" (మోదీ ఏంటి.. మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ మూడుసార్లు వ్యాఖ్యానించారు. ఆ వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు సంతోష్ సింగ్‌ను చుట్టుముట్టి, చితకబాది సభా ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం ముదిరింది.ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించారు. "ప్రధాని మోదీపై, ఆయన తండ్రిపై దూషణలకు దిగుతూ కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు హుందాతనాన్ని కోల్పోతోంది. వరుస ఓటములతో నిరాశ, నిస్పృహల్లో ఉన్న కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోంది" అని విమర్శించారు. గతంలో మోదీ తల్లిని, ఆయన పేదరికాన్ని అవమానించారని గుర్తుచేశారు.కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కూడా ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. "ప్రధాని మోదీకి దేశవిదేశాల్లో పెరుగుతున్న ప్రజాదరణను చూసి



ఓర్వలేక కాంగ్రెస్ నేతలు ద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నారు. 140 కోట్ల మంది ప్రజలు ఎన్నుకున్న ప్రధానిని, ఆయన కుటుంబాన్ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే" అని అన్నారు.బీజేపీ నేతలు తుహిన్ సిన్హా, గిరిరాజ్ సింగ్, నితిన్ నబిన్ తదితరులు కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై చర్చించే అంశాలు లేనప్పుడే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతాయని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెబుతారని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

పాకిస్థాన్ ఎప్పటికీ కశ్మీర్‌కు కూడా శత్రువే.. ఫరూక్ వ్యాఖ్యలపై గులాం నబీ ఆజాద్ ఫైర్

కశ్మీర్‌పై నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలను మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ తప్పుబట్టారు. ఫరూక్‌పై తనకు గౌరవం ఉందని, అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు సరికావని స్పష్టం చేశారు. పాకిస్థాన్ భారత్‌తో పాటు జమ్మూ కశ్మీర్ ప్రజలకు కూడా శత్రువని అన్నారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ప్రజలు తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్నారని ఆజాద్ గుర్తుచేశారు. అక్కడి పరిస్థితులను చూస్తే



పాకిస్థాన్ కశ్మీర్ ప్రజలకు రక్షణగా నిలుస్తోందని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. 1947 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు జమ్మూ కశ్మీర్ అభివృద్ధికి కృషి చేశాయని పేర్కొన్నారు.ఫరూక్ అబ్దుల్లా శనివారం బారాముల్లాలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ ప్రస్తావించడం వల్లే ఆ ప్రాంతానికి రక్షణ లభిస్తోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ నుంచి న్యాయం ఆశించగలమా? అని ప్రశ్నించారు.ఈ వ్యాఖ్యలపై భాజపా నేతలు తీవ్రంగా స్పందించారు. ఫరూక్‌పై పోలీసు చర్యలు తీసుకోవాలని భాజపా అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జమ్మూ కశ్మీర్ భాజపా అధ్యక్షుడు సత్ శర్మ కోరారు. మాజీ మంత్రి ఇమ్రాన్ అన్సారీ కూడా ఫరూక్ వ్యాఖ్యలను తప్పుబట్టారు.

Scanned with OKEN Scanner